

శ్రీశైలం డ్యామ్ నుంచి దిగువకు పరవళ్లు తొక్కుతున్న వరద నీరు

# ఆశల సాగు

## కృష్ణమ్మ పరవళ్లతో నిండుకుండలా శ్రీశైలం

- సాగర్‌డ్యామ్‌కు భారీగా చేరిక
- సాగుకు నీటి విడుదల
- తాగునీటి చెరువులకు, జోన్‌1 సాగునీటికి తొలి ప్రాధాన్యం
- ఆ తరువాత జిల్లాకు..
- ముమ్మరంగా కాలువల పనులు
- మాగాణి సాగుకు సిద్ధమవుతున్న ఆయకట్టు రైతులు
- నార్లు పోసేందుకు సమాయత్తం
- వర్షాలతో మెట్ట సాగుకు సానుకూలత

**వానమ్మ కరుణించింది. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నిండు జలాలతో రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయి. విస్తారంగా పడుతున్న వర్షాలతో జిల్లాలో పంటల సాగుకు ఆశాజనక వాతావరణం కనిపిస్తోంది. సాగర్ డ్యామ్ నుంచి నీటి విడుదలతో ఆయకట్టు రైతుల్లో వరిసాగుపై నమ్మకం కలిగింది. సాగునీటి కాలువల మరమ్మతులు ముమ్మరంగా సాగుతున్నాయి. చివరి భూములకు సైతం నీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో అందుబాటులో ఉన్న బోర్లు, బావులు ఇతర వనరుల కింద వరినార్లు పోసేందుకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల రైతులు సమాయత్తమవుతున్నారు.**

ఒంగోలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఒంగోలులోని ఇరిగేషన్ సర్కిల్‌పరిధిలో సుమారు 4.34 లక్షల ఎకరాల ఆయకట్టు సాగర్ కాలువల పరిధిలో ఉంది. అందులో 1.71 లక్షల ఎకరాలు బాపట్ల జిల్లా పరిధిలో ఉంది. 2.63 లక్షల ఎకరాలు ప్రకాశం జిల్లాలో ఉంది. మొత్తం 4.39 లక్షల ఎకరాల ఆయకట్టులో సుమారు మూడు లక్షల ఎకరాల్లో ఏటా సాగర్ నీటి ఆధారంగా పంటలు సాగవుతాయి. ఇంచుమించు లక్ష ఎకరాల్లో మాగాణి, మరో రెండు లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలు వేస్తారు. మిగిలిన లక్షా 34వేల ఎకరాలు సాగర్ ఆయకట్టులో ఉన్న చివరి భూములే. వీటికి నీరందక వర్షాధారంగానే సాగవుతున్నాయి. గత ఏడాది (2024-25) ఉమ్మడి జిల్లాలో సాగర్ కాలువల కింద దాదాపు 2.75 లక్షల ఎకరాలలో పంటలు వేశారు. అందులో 85 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇంచుమించు లక్షా 90వేల ఎకరాల్లో ఆరుతడి పంటలైన మిర్చి, మొక్కజొన్న, పత్తి, పొగాకు, శనగ ఇతరత్రా పంటలు వేశారు. ఏటా ఆగస్టులో తాగునీటికి సెప్టెంబరు నుంచి సాగు నీటికి సాగర్‌నీరు జిల్లాకు వస్తోంది. అయితే ఈ ఏడాది కృష్ణా ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకల్లో ముందుగానే భారీ వర్షాలు కురియడంతో ఎగువ ప్రాజెక్టులైన అల్మట్టి, నారాయణపూర్, జురాలు నిండి దిగువకు భారీగా వరద ప్రవాహం ఉంటోంది. ఇప్పటికే శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా మారగా సాగర్ డ్యామ్

మిగతా 6లో...



## ఇంజనీరింగ్ అడ్మిషన్లలో వెనుకంజ

### 56శాతం సీట్లు మాత్రమే భర్తీ

### మిగిలిపోయిన 3673 సీట్లు

### కంప్యూటర్, ఐటీ కోర్సులకు విద్యార్థుల మొగ్గు



ఒంగోలు విద్య, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఇంజనీరింగ్ అడ్మిషన్లలో విద్యార్థులు వెనుకంజ వేశారు. జిల్లాలో కన్వీనర్ కోటా సీట్లలో కేవలం 56శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 3675 సీట్లు మిగిలిపోయాయి. విద్యార్థులు ఎక్కువగా కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ (ఏఐ) రిలేటెడ్ కోర్సులకు మొగ్గు చూపారు. ఈ కోర్సుల మీద ఆసక్తితో ఈ కోర్సుల కోసం విద్యార్థులు జిల్లా దాటి ఇతర జిల్లాలకు, పొరుగు రాష్ట్రాలకు వెళ్లారు. దీంతో జిల్లాలో సీట్లు మిగిలిపోయాయి. ఇంజనీరింగ్ కోర్ సబ్జెక్టు గ్రూపుల వైపు విద్యార్థులు ఆసక్తి

మిగతా 6లో...

## బోడపాడు బడి టీచర్లకు అభినందనలు

- ఎక్స్ వేదికగా తెలిపిన మంత్రి లోకేష్

మార్కాపురం రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడపాడు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

మిగతా 6లో...



రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును పీకేసిన వైసీపీ నేత

## బరితెగించిన వైసీపీ నేత

**అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును పీకేసి ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటిన నాయకుడు**

తర్లుపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును వైసీపీ నాయకుడు బరితెగించి తొలగించి మొక్కలు నాటాడు. ప్రభుత్వ భూమి హాంఫట్ శీర్షికతో ఈనెల 19న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి 20న జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈమేరకు సర్వే నెంబర్ 132-3లో 1.55ఎకరాలు, 129-11లో 52 సెంట్ల ప్రభుత్వ భూమిగా సర్వేచేసి గుర్తించి మంగళవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. దానిని లెక్కచేయని వైసీపీ నేత బోర్డును పీకేసి బుధవారం జామాయిల్ మొక్కలను సాగు చేశారు. పలువురు గ్రామస్థులు అడ్డుకొనగా వారిని భయభ్రాంతులకు గురిచేయడంలో

మిగతా 6లో...

## ఉచిత సిలిండర్లకు నెలాఖరుదాకా గడువు

- బుక్ చేసుకున్న 48 గంటల్లో నగదు
- జిల్లాలో రెండో విడతలో రూ.29.84 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ
- రాయితీ అమలు చేశాక వినియోగదారులకు ఇప్పటివరకు రూ.60 కోట్ల మేర లబ్ధి



ఒంగోలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సూపర్ సిక్స్ అమలులో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం జిల్లా ప్రజలకు వరంగా నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఎన్నికల్లో ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ పథకాన్ని గత ఏడాది దీపావళి నుంచి అమలులోకి తీసుకొని వచ్చారు. ఏడాదికి మూడు సిలిండర్ల చొప్పున లబ్ధిదారులకు గ్యాస్ నగదును వారి బ్యాంకు అకౌంట్లలో 48 గంటల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకుంది. ఈ పథకం ద్వారా జిల్లాలో లక్షలాది మంది లబ్ధిపొందుతున్నారు. గత ఏడాది ఈ పథకం అమలు కావడంతో మొదటి విడత జిల్లాలో 3.60 లక్షల మంది లబ్ధిదారులకు సుమారు రూ.30 కోట్లు లబ్ధిపొందారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూలై ఆఖరు వరకు రెండో విడత ఉచిత సిలిండర్ పథకం అమలులోకి వచ్చింది. రెండో విడతలో జిల్లాకు 3,69,457 మంది లబ్ధిదారులకు సిలెండర్లు ఉండగా ప్రభుత్వం 3,56,200 మంది అర్హులుగా గుర్తించింది. అందుకోసం జిల్లాకు రూ.30,46,82,503ను కేటాయించింది. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు రెండో విడత సిలిండర్లను జిల్లా వ్యాప్తంగా 3,49,020 మంది గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకున్నారు. వీరికి

మిగతా 6లో...


## అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్

### జిల్లాలో కలిపేందుకు మార్గం సుగమం

### మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుతో అడుగులు ముందుకు పడే అవకాశం

అద్దంకి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రాంత ప్రజల కోరిక మేరకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు, ప్రకాశం జిల్లాలో కలిపేందుకు మార్గం సుగమమైనట్లు స్థానికులు భావిస్తున్నారు. జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దుల మార్పులు, చేర్పులు కోసం అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ఉన్నతస్థాయిలో తీవ్రప్రయత్నాలు చేసి ఉండడంతో ఎట్టి పరిస్థితులలో జరుగుతుందనే భావన అద్దంకి నియోజకవర్గ ప్రజల్లో బలంగా ఉంది. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వం జిల్లాల విభజనను లోపభూయిష్టంగా చేసిందని, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయడంతో పాటు అద్దంకి, కందుకూరు

మిగతా 6లో...



## ఎయిడెడ్ దోపిడీ

### కొన్ని ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల ఇష్టారాజ్యం



- అర్హత లేని వారికి ప్రభుత్వ రాయితీలు
- ప్రభుత్వ ఖజానాకు కన్నం
- ఒకే డైస్‌కోడ్‌తో మోసం
- ఉన్నతాధికారుల దృష్టికి వ్యవహారం

**జిల్లాలోని కొన్ని ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో దోపిడీ ఎక్కువైంది. అర్హతలేని విద్యార్థులకు కూడా ప్రభుత్వం ఇచ్చే రాయితీలను వర్తింపజేస్తూ యాజమాన్యాలు ఖజానాకు కన్నం వేస్తున్నాయి. పాఠశాలకు ఒకేడైస్ కోడ్‌తో మోసం చేస్తున్నాయి. జిల్లాలోని సుమారు 15 పాఠశాలల్లో ఈ దందా ఏళ్లతరబడి యథేచ్ఛగా సాగుతోంది. ఈ పాఠశాలల వైపు కన్నెత్తి చూసేందుకు క్షేత్రస్థాయిలోని అధికారులు జంకుతున్నారు. జిల్లాలోని ఒక ఎయిడెడ్ పాఠశాల విషయంలో హైకోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన పాఠశాల విద్య డైరెక్టర్ దృష్టికి ఈ వ్యవహారం రావడంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.**

ఒంగోలు విద్య, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : అధికారుల ఉదాసీనతను అలుసుగా తీసుకున్న కొన్ని ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా దోపిడీని కొనసాగిస్తున్నారు. అధికారులెవ్వరూ వారి జోలికి పోయేందుకు సాహసించడం లేదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు విద్యాబుద్ధులు నేర్పేందుకు సేవాతత్పరతతో కొన్ని యాజమాన్యాలు ముందుకు వచ్చి పాఠశాలలను ప్రారంభించాయి. తర్వాత వాటికి ప్రభుత్వం గ్రాంటు ఇన్ ఎయిడెడ్ ఇచ్చి టీచర్లకు జీతాలు చెల్లించడంతోపాటు పాఠశాలల నిర్వహణకు నిధులు ఇచ్చేది. కాలక్రమేణా సేవాలక్ష్యంతో ప్రారంభమైన పాఠశాలలు కొందరు స్వార్థపరులైన యాజమాన్యాల నిర్వాకంతో వ్యాపార సంస్థలుగా మారిపోయాయి. ధనార్జనకు ఎయిడెడ్‌లు ఒక ఆయుధంగా మారాయి.

**ఒకే డైస్ కోడ్‌తో మోసం**

కొన్ని ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు ఒకే డైస్‌కోడ్‌తో మోసానికి

మిగతా 6లో...





## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

7

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ల గడువు

## పొడిగింపు

- వచ్చే నెల 10వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం
- కొనుగోళ్లను పటిష్టంగా చేపట్టాలి : జేసీ

7

## కంభంలో పట్టపగలే చోరీ

25 తులాల బంగారం, రూ.40వేల డబ్బు అపహరణ

7

## పోలీస్ కస్టడీకి ఆరుగురు



జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ విభాగాలను పరిశీలిస్తున్న ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి, ఎస్పీ దామోదర్ తదితరులు

## పోలీసు సేవలు ప్రజలకు చేరువ కావాలి

- గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి
- సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి
- జిల్లా పోలీసు కార్యాలయంలో వార్షిక తనిఖీలు

ఒంగోలు క్రైం,జూలై24(ఆంధ్రజ్యోతి): పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ విభాగాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకొని విధులు నిర్వహించి ప్రజలకు పోలీసు సేవలను చేరువ చేయాలని కోరారు. నూతన సాంకేతిక పద్ధతులపై పోలీసులకు నిరంతరం అవగాహన కలిగించేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు. డిజిటలైజేషన్ ద్వారా పారదర్శకత, సమర్థత పెరిగి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అదే విధంగా సిబ్బందికి సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పోలీసుల పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. అయన వెంట ఎస్పీ ఏఆర్ దామోదర్, అదనపు ఎస్పీ కే.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏవో రామ్మోహనరావు, సీఐలు రాఘవేంద్ర, దేవప్రభాకర్, సూర్యనారాయణ, దుర్గా ప్రసాద్ ,విజయకృష్ణ, మేడా శ్రీనివాసరావు, నాగరాజు, శ్రీకాంత్ బాబు, సుధాకర్, షమీముల్లా, సిబ్బంది ఉన్నారు.

## మహిళపై ఎంపీడీవో లైంగిక వేధింపులు

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు , కేసు నమోదు

తర్లుపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న మహిళపై తర్లుపాడు ఎంపీడీవో ఎంకే చక్రపాణి ప్రసాద్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. బుధవారం సాయంత్రం మహిళను తన చాంబర్‌లోకి పిలుచుకుని బాత్‌రూమ్ శుభ్రంగా క్లీన్ చేయాలని చెప్పాడు. ఆమె క్లీన్ చేస్తుండగా ఎంపీడీవో బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఆ మహిళను చేయి పట్టుకుని బలవంతం చేసేందుకు యత్నించాడు. దీంతో ఆ మహిళ పెనుగులాడి అతడిబారి నుంచి కేకలు వేస్తూ బయటకు వచ్చింది. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు అక్కడికి చేరడంతో ఆ మహిళ బోరున విలపిస్తూ వారికి చెప్పింది. గతంలో కూడా ఎంపీడీవో తన చాంబర్‌లో పని ఉందని పిలిపించుకుని చేయిపట్టుకొని బలవంతం చేయబోయినట్లు ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కాగా ఎంపీడీవో వెంటనే రెండు రోజులపాటు సెలవు చీటీ రాసి ఈవోఆర్డీ సుకుమార్‌కు వాట్సాప్ చేసి వెళ్లి పోయారు. ఎంపీడీవో లైంగిక వేధింపులకు పాల్పడడంతో మహిళ గురువారం సాయంత్రం తర్లుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ బ్రహ్మనాయుడుకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విచారణ చేసి అనంతరం ఎంపీడీవోపై లైంగిక వేధంపుల కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఆశల సాగు

(5వ పేజీ తరువాయి)

కూడా నిండే పరిస్థితికి చేరుతోంది.

**ప్రాజెక్టుల పరిస్థితి ఇదీ..**

కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 885 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 883 అడుగుల నీటి మట్టం వద్ద 207 టీఎంసీలు నిల్వ ఉంది. ఎగువ నుంచి లక్షా 7వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి, విద్యుత్ పంపు హౌస్‌లో ఉత్పత్తి ప్రారంభించి మొత్తం లక్షా 47వేల క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. ఆ నీరు రెండు రోజుల్లో సాగర్ డ్యామ్‌లకు చేరనుంది. ఇప్పటికే సాగర్ డ్యామ్‌లోకి సుమారు 86వేల క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి వస్తోంది. సాగర్ డ్యామ్ నీటి మట్టం 590 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం నీటి మట్టం 548 అడుగులకు చేరగా 269 టీఎంసీల నీరు ఉంది. మరో 42 టీఎంసీల నీరు వస్తే సాగర్‌డ్యామ్ నిండే అవకాశం ఉంది. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహం పరిశీలిస్తే నాలుగైదు రోజుల్లో డ్యామ్ నిండి గేట్లు ఎత్తాల్సి వస్తోంది.

**నీటి విడుదలకు ఆదేశం**

సాగర్ కుడికాలువ పరిధిలో తాగు, సాగునీటికి నీటిని విడుదల చేయాలని రెండు రోజుల క్రితం వ్యవసాయశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. తదనుగుణంగా బుధవారం సాయంత్రం సాగర్ డ్యామ్ నుంచి అధికారులు నీటిని విడుదల చేశారు. డ్యామ్‌కు దిగువన పల్నాడు జిల్లాలో కుడి ప్రధాన కాలువపై ఉన్న బుగ్గవాగు రిజర్వాయర్‌లో గేట్ల పనులు సాగుతుండటంతో నీటిని స్వల్పంగా ఇస్తున్నారు. నెలఖరులోగా వాటిని పూర్తి చేసి పూర్తిస్థాయిలో డ్యామ్ నుంచి నీటిని ఇస్తారని సమాచారం. గత ఏడెనిమిది ఏళ్లలో సాగర్‌డ్యామ్ నుంచి జూలైలోనే నీటిని ఇవ్వడం ఇదే ప్రథమం. ప్రస్తుతం డ్యామ్ నుంచి ఇస్తున్న నీటిని తొలుత కుడి కాలువ పరిధిలోని నాలుగు జిల్లాల్లో తాగునీటి అవసరాలకు, జోన్-1 పరిధిలో సాగునీటికి ఇస్తున్నారు. అనంతరం పక్షం రోజులకు జోన్-2కు సాగర్ నీటిని ఇస్తారు. అంటే మన జిల్లాకు తాగునీటికి ఈనెలాఖరు వరకు సాగునీటికి, ఆగస్టు 15నాటికి సాగర్ నీరు రానుంది.

**ముమ్మరంగా కాలువల పనులు**

మరోవైపు సాగర్‌కాలువల్లో మరమ్మతుల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సాగర్‌కాలువల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్, తూములు, షట్టర్లు ఇతరత్రా మరమ్మతులకు ప్రజా ప్రభుత్వం వచ్చాక రెండు దఫాలుగా సుమారు రూ.14 కోట్లు నిధులు ఇవ్వగా ఆ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలా కృష్ణమ్మ పరవళ్లు, సాగర్ డ్యామ్ నుంచి ముందే నీరు విడుదల, ఆపై ముమ్మరంగా కాలువల పనులు జరుగుతుండటంతో సాగర్ ఆయకట్టు రైతాంగం ఈ సీజన్ పంటల సాగుపై నమ్మకంతో ఉన్నారు. పూర్తిస్థాయిలో నీరు వచ్చిన వెంటనే వరి పంటసాగు చేసేలా ముందుగానే అందుబాటులో ఉన్న బోర్లు, బావులు ఇతరత్రా వనరులకింద వరినారు పోసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వారం పదిరోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతో మెట్టసాగు రైతాంగం కూడా పంటల సాగుపై నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభం (జూన్)తో పాటు ఈనెల తొలిపక్షం వరకు వర్షాలు సరిలేక కొంత గందరగోళంగా ఉన్నా గత వారం పదిరోజులుగా జిల్లాలో విస్తారంగా నానలు పడుతుండటంతో ప్రధాన ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. పలుచోట్ల కంది, పత్తి, మిర్చి ఇతర కీలక పంటల సాగుకు శ్రీకారం చుట్టారు.

## అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్

(5వపేజీ తరువాయి)

నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలుపుతామని ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వారు ఇదే అంశాన్ని పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో మార్కాపురం జిల్లా ఏర్పాటు కచ్చితంగా జరుగుతుందనే భావిస్తున్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు జరిగితే ఒంగోలు కేంద్రంగా ఉండే ప్రకాశం జిల్లా పరిధిలోకి అద్దంకి నియోజకవర్గం చేర్పు ఖాయంగా భావిస్తున్నారు. దీంతో అటు అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లా పరిధిలోకి చేర్చడం ఖాయంగా కనిపిస్తోంది.

# రెండు ఓట్లు ఉంటే నిబంధనల ప్రకారం నేరం

- డీఆర్వో చినఓబులేషు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలని, రెండో ఓటు కలిగి ఉంటే నేరమని డీఆర్వో చిన ఓబులేషు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేసి ఓట్లు కలిగిన వారు వెంటనే ఒక ఓటును రద్దు చేసుకోవాలన్నారు. నివాసం ఉన్న చోట మాత్రమే ఓటును కలిగి ఉండాలని చెప్పారు. ఎవరైనా రెండో ఓటును రద్దు చేసుకోకుంటే కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నేరంగా పరిగణిస్తారని స్పష్టం చేశారు. అటువంటి వారికి సెక్షన్31 పీఆర్ఎ1950 ప్రకారం ఒక ఏడాది జైలు శిక్ష లేదా జరిమానా ఉంటుందని తెలిపారు. అలాగే ఓటుకు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని కోరారు. 18 ఏళ్ళు నిండిన యువతీ, యువకులు ఓటుహక్కు పొందాలని చెప్పారు. ఒంగోలు నగరంలో పాటు జిల్లాలోని వివిధ పట్టణాల్లో డోరు నెంబర్లు లేకపోతే వెంటనే వేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన పలు అంశాలపై డీఆర్వో స్పందిస్తూ వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, ఎం.కేశవర్ధనరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్.జాన్సన్, ఎ.కుమార్, ఎస్.వరకుమార్, ఎంవీ.సత్యనారాయణ, కె.రవీంద్రారెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, కార్పొరేషన్ డీపీవో బాబురావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంకటరావు, క్రాంతికుమార్, రసూల్, గుర్రం సత్యనారాయణ, రఘురాం, సుదర్శన్, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

# మర్రిపూడిలో స్తంభించిన పౌరసేవలు

- డిజిటల్ అసిస్టెంట్ లేక ఇక్కట్లు
- కాళ్లు అరిగేలా తిరుగుతున్న ప్రజలు



వెలవెలబోతున్న మర్రిపూడి సచివాలయం

మర్రిపూడి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పౌరసేవలు గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. మర్రిపూడి సచివాలయ పరిధిలో గత పదిరోజులుగా పౌరసేవలు స్తంభించిపోయాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ ప్రసన్నను పొదిలి మండలం తలమళ్ళకు బదిలీ చేశారు. నాగులుప్పపాడు మండలం కొత్తకోట సచివాలయం నుంచి చక్రవర్తిని ఇక్కడ నియమించారు. అయితే నాలుగురోజుల క్రితం చుట్టపు చూపుగా వచ్చి ఇక్కడ బాధ్యతలు తీసుకొని అప్పటి నుంచి పత్తాలేకుండా పోయారు. పంచాయతీ కార్యదర్శి విధులకు రావడం లేదు. ఎందుకని అడిగితే తాను ఒంగోలు జిల్లాకేంద్రంలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నాని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. డిప్యుటేషన్ ఉత్తర్వులు లేకుండానే విధులకు డుమ్మా కొట్టడంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు సచివాలయం చుట్టూ కాళ్ళఅరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. డిజిటల్ సహాయకుడు లేకపోవడంతో ఆధార్ కేంద్రం కార్యకలాపాలు నిలిచిపోయాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే ప్రతి ఒక్కరికీ ఆధార్ కేంద్రంతో పని ఉంటుంది. దీనికితోడు రేషన్‌కార్డ్ దరఖాస్తులు, పింఛన్ దరఖాస్తులు ముఖ్యంగా రైతులు మ్యుటేషన్ కోసం వస్తున్నారు. ప్రైవేటు మీసేవ కేంద్రాలకు వెళితే ప్రజల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. మండలంలో జువ్విగుంట, మర్రిపూడి సచివాలయాల్లో మాత్రమే ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జువ్విగుంట సచివాలయంలో కొన్ని నెలలుగా ఆధార్ సేవలు నిలిచిపోయాయి. అప్పటి నుంచి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఆధార్ కేంద్రం మర్రిపూడికి రావాల్సి వస్తోంది. మండల కేంద్రంలో పౌరసేవలు నిలిచిపోవడంతో సమీపంలోని పొదిలి పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో ప్రజలు తీవ్ర వ్యవప్రయాసాలతో ఇబ్బంది పడుతున్నారు. డిప్యూటేషన్‌పై వెళ్లాలనుకున్న డిజిటల్ అసిస్టెంట్ మండల కేంద్రంలోని సచివాలయాన్ని ఎంచుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన డిజిటల్ అసిస్టెంట్‌ను ఇక్కడ పనిచేసే విధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఆర్టీసీ పోలీస్ ఔట్‌పోస్ట్‌లో ఆలకించే వారేరీ ?

- బ్యాగు మారిపోవడంతో ఇబ్బందిపడిన ప్రయాణికుడు



ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న పోలీస్ ఔట్‌పోస్ట్

ఒంగోలు కార్పొరేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్ పోస్ట్‌లో ప్రయాణికుల గోడు ఆలకించేవారు కరువయ్యారు. ప్రయాణ సమయంలో ఇబ్బందులు ఎదురైనపుడు సహకారం అందించాల్సిన పోలీసులు ఔట్‌పోస్ట్‌లో సమాధానం చెప్పడం లేదని బాధితులు తెలిపారు. గురువారం గుంటూరు నుంచి ఒంగోలుకు వచ్చిన ఓ ప్రయాణికుడు బస్సు దిగే సమయంలో తన బ్యాగు వేరే ప్రయాణికుడు తీసుకెళ్ళగా, అతని బ్యాగు వదిలేసి వెళ్ళారు. అయితే ఆ బ్యాగు తనది కాదని, తనలాగే బ్యాగు మరిచిపోయే వ్యక్తి ఇబ్బంది పడకూడదని పోలీసులు స్వాధీనం చేసుకోవాలని కోరారు. అయితే తనను సుమారు గంటసేపు ఎవరూ పట్టించుకోలేదని బాధిత ప్రయాణికుడు వాపోయారు. దీంతో ఆర్టీసీ ట్రాఫిక్ పోలీసులను సంప్రదించగా, ఆ పని తమది కాదని, ఔట్‌పోస్ట్ వారే చూసుకోవాలని సమాధానమిచ్చారు. దీంతో చేసేదేమి లేక ఆర్టీసీ కంట్రోల్ రూమ్ అధికారులను సంప్రందించగా, తమకు సంబంధం లేదని, నువ్వే తీసుకెళ్ళమని సమాధానం ఇవ్వడంతో బిక్క మొహం వేసిన బాధితుడు చేసేదేమి లేక బ్యాగుతో ఇంటిబాట పట్టారు.

## ఒంగోలులో ఆటో మ్యూటేషన్ అమలు

- కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలో ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు మ్యూటేషన్ విధానం ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొస్తుందని కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానం ద్వారా పట్టణ ప్రాంతంలో భూములు, భవనాలు రిజిస్ట్రేషన్ అనంతరం ఆస్తి వివరాలు ఆటోమేటిక్‌గా సంబంధిత మునిసిపల్ కార్పొరేషన్ రికార్డులలో పేరు మార్పు అవుతాయని పేర్కొన్నారు. మునిసిపల్ శాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సమన్వయంతో ఈ విధానం అమలు కానుందని తెలిపారు. దీనివల్ల రిజిస్ట్రేషన్ తర్వాత ఆస్తిని మునిసిపల్ రికార్డుల్లో వేరుగా నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉండదన్నారు. ఆస్తి వివరాలు, పన్నుల నమోదు ఆటోమేటిక్‌గా చేరుతాయని తెలిపారు. పౌరులకు సమయం ఆదాతోపాటు అవినీతి రహిత సేవలు లభిస్తాయని, డిజిటల్ డేటా ఆధారంగా పారదర్శకతతో కూడిన సేవలు అందుబాటులో ఉంటాయిన కమిషనర్ పేర్కొన్నారు. పాత ఇంటి నెంబర్, ఆస్తి పన్ను, చెల్లించిన రశీదు, మార్పులు మ్యూటేషన్ లబ్ధి చేకూరుతుందని, ప్రజల తమ ఇంటి అసెస్‌మెంట్ వివరాలను సబ్‌రిజిస్ట్రార్ వారికి సరైన విధంగా అందించాలని ఆయన కోరారు.

## 27న ఎయిడెడ్ పోస్టుకు పరీక్ష

ఒంగోలు విద్య, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండలం వల్లాపల్లిలోని సీపీ అప్పర్ ప్రైమరీ ఎయిడెడ్ పాఠశాలలో ఖాళీగా ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టు భర్తీ చేసేందుకు ఈనెల 27న పరీక్ష జరుగుతుందని డీఈవో కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టును భర్తీ చేసేందుకు పాఠశాల విద్యా డైరెక్టర్ అనుమతి ఇచ్చారు. ఈక్రమంలో దరఖాస్తులు ఆహ్వానించి అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తున్నారు. నర్సరావుపేటలోని నర్సరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలోని బ్లాక్4లో రెండుసెషన్లలో పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9.30నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2నుంచి 4 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాట ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పరీక్షా కేంద్రానికి గంటముందుగా చేరుకోవాలన్నారు.

## 17,18 తేదీల్లో రాష్ట్ర మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ఏడవ మహాసభలు ఒంగోలులో వచ్చేనెల 17,18తేదీల్లో జరుగుతాయని సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ. ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముందుగా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఒంగోలులో రెండు రోజుల పాటు జరిగే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జీవాల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి సమగ్ర కార్యచరణను రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతిరావు, పూసపాటి వెంకట్రావు, బుర్రి ఆంజనేయులు, కె.జయరాం తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ అడ్మిషన్లలో వెనుకంజ

(5వపేజీ తరువాయి)

చూపలేదు. దీంతో కోర్ గ్రూపుల్లో సీట్లు భారీగా మిగిలిపోయాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు (2025-26 విద్యాసంవత్సరం) నిర్వహించిన ఎపీఈఏపీసెట్-25 సీట్ల కేటాయింపు బుధవారం రాత్రికి పూర్తయింది. ఉమ్మడి జిల్లాలోని 15 ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో సీట్లు మొత్తం 8,435 ఉన్నాయి. మొదటి విడత కౌన్సెలింగ్‌లో 56.46శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. అంటే 4,762 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 3,673 సీట్లు మిగిలిపోయాయి. రాష్ట్రంలో సగటున 78శాతం సీట్లు భర్తీ కాగా జిల్లాలో 22శాతం సీట్లు తక్కువగా భర్తీ అయ్యాయి. జిల్లాలో కేవలం మూడు కళాశాలల్లో మాత్రమే రాష్ట్ర సగటు కంటే ఎక్కువ సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిన 13 కళాశాలల్లో రాష్ట్ర సగటు కంటే తక్కువగా, మూడు కళాశాలల్లో అయితే కేవలం 6.7శాతం, 5.5శాతం, 3.8 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. జిల్లాలో వివిధ కళాశాలల్లో 89.49శాతం, 86.04శాతం, 79.13శాతం, 68.98శాతం, 65.70శాతం, 32.57శాతం, 28.82శాతం, 24.76శాతం, 24.19శాతం, 21.43శాతం, 17.08శాతం సీట్లు భర్తీ అయ్యాయి. జిల్లా విద్యార్థులు పొరుగున ఉన్న గుంటూరు, గోదావరి జిల్లాలు, విశాఖపట్నంతో పాటు పొరుగు రాష్ట్రాలైన చెన్నై, బెంగళూరుకు వెళ్లడంతో జిల్లాలో సీట్లు భర్తీ కాకుండా పోయాయి.

- ఏఐ కోర్సులకు భారీ డిమాండ్

కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. కంప్యూటర్ సైన్స్‌లో అడ్వాన్స్‌డు కోర్సులైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సైన్స్(ఏఐడీఎస్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ కోర్సుల్లో చేరుందుకు విద్యార్థులు మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. ఇవి అడ్వాన్స్‌డ్ కోర్సులు కావడంతో ఈ కోర్సుల్లో ఎక్కువ ఉద్యోగ అవకాశాలు ఉండటంతో వీటిల్లో చేరేందుకు విద్యార్థులు మొగ్గు చూపారు. అన్ని కళాశాలల్లో కోర్సుల సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ( ఐటీ)లో కూడా విద్యార్థులు తక్కువగా చేరారు. ఇంజనీరింగ్ సబ్జెక్టు గ్రూపులు సివిల్, మెకానికల్, ట్రిబుల్‌ఈ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపలేదు.

## పరిశుభ్రమైన తాగునీటినే తీసుకోవాలి

- ఫ్లోరోసిస్ నివారణ జిల్లా అధికారి అనిల్‌కుమార్



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

నాగులుప్పలపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఫ్లోరోసిస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని పరిశుభ్రమైన తాగునీటిని తీసుకోవాలని ఫ్లోరోసిస్ నివారణ జిల్లా అధికారి డాక్టర్ వి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం అమ్మనబ్రోలులోని గురుకుల పాఠశాల, రాపర్ల మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజు మనం తాగేనీటిలో అధిక మోతాదులో ఫ్లోరైడ్ ఉండటం ద్వారా దంతాలు రంగుమారడం, ఎముకలు పటుత్వం కోల్పోవడం, కీళ్ల నొప్పులు వస్తాయన్నారు. చ్ని వయసులోనే ముసలితనం కూడా వస్తుందని చెప్పారు. తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కోరారు. తొలుత ఆయా పాఠశాలల్లో తాగునీరు, ఆహార పదార్థాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. డాక్టర్ అబ్దుల్ రవూఫ్ విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల సురక్ష జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నాగార్జున , పీహెచ్‌సీ వైద్యులు ఎస్.ప్రసాద్, ఎంపీహెచ్‌వో గోరంట్ల విజయచంద్, ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓవర్ లోడింగ్ వద్దంటూ ధర్నా

ఒంగోలు క్రైం, జూలై24(ఆంధ్రజ్యోతి): కంకర, డస్ట్ రవాణా చేసే లారీలలో ఓవర్ లోడింగ్ చేయవద్దంటూ ఒంగోలు టిప్పర్ ఓనర్స్ అసోషియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. పేర్నమిట్ట వద్ద గురువారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, మోహనరావు మాట్లాడారు.

## ఎయిడెడ్ దోపిడీ

(5వపేజీ తరువాయి)

పాల్పడుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక గుర్తింపునకు ప్రభుత్వం డైస్‌కోడ్‌ను కేటాయిస్తుంది. ఎయిడెడ్ పాఠశాలలను తెలుగు మీడియంలో నిర్వహించుకునేందుకు ప్రభుత్వం మొదట డైస్‌కోడ్‌ను కేటాయించింది. కాలక్రమేణా తెలుగు మీడియం పాఠశాలలకు ఆదరణ తగ్గుతుండటంతో వాటి ఆవరణలోనే ఇంగ్లీషు మీడియం ప్రారంభించి విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడం ప్రారంభించాయి. నిబంధనల ప్రకారం ఇంగ్లీషు మీడియంకు ప్రత్యేక డైస్ కోడ్ తీసుకోవాల్సి ఉండగా అవేమీ లేకుండా పాత డైస్ కోడ్‌తోనే పాఠశాలలు నిర్వహిస్తూ వ్యాపారం చేస్తున్నాయి.

**అనర్హులకు ప్రభుత్వ రాయితీలు**

పాఠశాలల్లో అనర్హులైన విద్యార్థులకు కూడా ప్రభుత్వ రాయితీలు వర్తింపజేస్తూ యాజమాన్యాలు ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతున్నాయి. ఉదాహరణకు ఎయిడెడ్ యూపీ స్కూళ్లకు 1 నుంచి 7వ తరగతి వరకు మాత్రమే ప్రభుత్వ గుర్తింపు, గ్రాంటు ఇన్ ఎయిడెడ్ ఉంటుంది. అయితే ఆ పాఠశాలల్లో అన్ ఎయిడెడ్ సెక్షన్లుగా 8, 9, 10 తరగతులు నిర్వహిస్తూ ఆ విద్యార్థులకు ఎయిడెడ్ సెక్షన్లతో సమానంగా వారానికి మధ్యాహ్న భోజనం, విద్యా కిట్లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్సులు ఇస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో కూడా అవకతవకలు, అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంగ్లీషు మీడియం విద్యార్థులను కూడా ఎయిడెడ్ సెక్షన్లలో పేర్లు నమోదు చేసి తమకు అదనంగా టీచర్ పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

**పాఠశాల విద్య డైరెక్టర్ ఆగ్రహం**

జిల్లాలోని కొన్ని ఎయిడెడ్ పాఠశాలల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై పాఠశాల విద్యా డైరెక్టర్ విజయరామరాజు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. జిల్లాలోని ఒక ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టుకు హాజరయ్యేందుకు డైరెక్టర్ వచ్చారు. ఆ సమయంలో జిల్లాలోని కొన్ని ఎయిడెడ్ పాఠశాలల్లో జరుగుతున్న అవినీతి బాగోతం ఆయన దృష్టికి వచ్చింది. దీంతో అక్కడే ఉన్న పశ్చిమ ప్రాంత ఎంఈవో ఒకరిని మీరు ఎయిడెడ్ పాఠశాలలను విజిట్ చేస్తున్నారా.. తనిఖీలు నిర్వహిస్తున్నారా? అంటూ ప్రశ్నించినట్లు తెలిసింది. ఆ ఎంఈవో నీళ్ల నమలడంతో డైరెక్టర్ మండిపడ్డారు. దీంతో ఆ ఎంఈవో కొందరు యాజమాన్యాలు తమను పాఠశాలల్లోకి రానివ్వరని, వారు చెప్పిన వివరాలు రాసుకొని వస్తామని చెప్పడంతో డైరెక్టర్ ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. వెంటనే అన్ని పాఠశాలలను తనిఖీ చేయాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. ఆర్జేడీలను కూడా పాఠశాలలను తనిఖీ చేసి అవకతవకలను అరికట్టాలని డైరెక్టర్ ఆదేశించారు.

## బరితెగించిన వైసీపీ నేత

(5వపేజీ తరువాయి)

వారు వెనుతిరిగి వెళ్లారు. ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటుతున్న విషయాన్ని గ్రామస్థులు తహసీల్దార్ కిషోర్ కుమార్, వీఆర్‌వో షరీఫ్‌కు సమాచారం ఇచ్చారు. దాంతో ఆ భూమిని పరిశీలించగా అప్పటికే మొక్కలు నాటినట్లు గుర్తించారు. రెవెన్యూ అధికారులు మౌనంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ స్థాయిలో ముడుపులు తీసుకుని రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. 2.7 ఎకరాలను వైసీపీ నేత రూ.కోటికి ఓ ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగికి విక్రయించి సొమ్ము చేసుకున్నారు. అనంతరం బ్యాంకు ఉద్యోగితో జామాయిల్ మొక్కలు నాటించారు. వైసీపీ ప్రభుత్వంలో వందలాది ఎకరాలు ఆక్రమించుకున్న ఆ నాయకుల ఆగడాలు ప్రస్తుత ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికీ రెవెన్యూ అధికారుల అండదండలు వైసీపీ నాయకులకు ఉండడంతో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, మొక్కలు నాటిన నాయకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

- మొక్కలను పీకివేపిస్తా

కలుజువ్వలపాడు ఇలాకాలో ప్రభుత్వ భూమిలో జామాయిల్ మొక్కలు నాటిన మాట వాస్తవమే. గురువారం వెళ్లి ప్రభుత్వ భూమిని పరిశీలించగా జామాయిల్ మొక్కలు నాటి ఉన్నాయి. వేసిన మొక్కలను శుక్రవారం పీకేసి మరలా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తాం.

**- కేకే కిశోర్ కుమార్, తహసీల్దార్**

## ఉచిత సిలిండర్లకు నెలాఖరుదాకా గడువు

(5వపేజీ తరువాయి)

24 గంటల్లో రూ.29,84,38,752 కోట్లను ఖాతాల్లో జమ చేశారు. ఈ విడత ఉచిత సిలిండర్ల ప్రక్రియ ఈనెలాఖరులోపు ప్రక్రియ ముగియనుంది. ఇప్పటి వరకు సిలిండర్లు అందుకున్న లబ్ధిదారులకు మరో 7,174 మందికి మాత్రమే బ్యాంకుల్లో నగదు జమ కావాల్సి ఉంది. రెండో విడత సిలిండర్ బుకింగ్ కోసం మరో ఆరు రోజులు మాత్రమే గడువు ఉంది. ఈలోపు మిగిలిన లబ్ధిదారులకు కూడా సిలిండర్లు బుక్ చేసుకుంటే వారికి కూడా బ్యాంకుల్లో నగదు జమ అయ్యే అవకాశం ఉంది. ఆగస్టు 1 నుంచి నవంబరు ఆఖరు వరకు మూడో విడత ఉచిత సిలిండర్లను బుక్ చేసుకుంటే ఆ విడతలో కూడా లబ్ధిదారులకు వారి బ్యాంకు అకౌంట్లలో నగదు జమ కానుంది.

**బోడపాడు బడి టీచర్లకు అభినందనలు**

(5వపేజీ తరువాయి)

గురువారం ఎక్స్ వేదికగా అభినందించారు. నో అడ్మిషన్లు, బోడపాడు ఎంపీపీ పాఠశాల ఫుల్ అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 23వ తేదీన ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. విషయాన్ని తెలుసుకున్న విద్యా శాఖ మంత్రి లోకేష్ ఎక్స్‌లో ప్రభుత్వ పాఠశాలల ముందు నో అడ్మిషన్ బోర్డు కనపడాలనే నా కలని సాకారం చేసిన బోడపాడు గ్రామ మండల పరిషత్ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాలయాలకు అందించాలని ఆకాంక్షించారు.



# వరప్రదాయై నమః

● నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం ● వ్రతాలు, నోములు ఆచరించనున్న మహిళలు ● విరివిగా వివాహ ముహూర్తాలు

శ్రావణమాసం.. అత్యంత శుభకరమైనదిగా మహిళలు భావిస్తుంటారు. ఈ మాసంలో చేసే పూజలు, నోములు, వ్రతాలు అనంతమైన పుణ్యాన్ని ప్రసాదిస్తాయని నమ్మిక. అటు శ్రీ మహావిష్ణువుకు, శ్రీ మహాలక్ష్మికే కాక పరమశివుని పూజకు సైతం అత్యంత శ్రేష్ఠమైన మాసంగా భావిస్తారు. దీనిని ఆధ్యాత్మిక మాసం అని కూడా పిలుస్తారు. ఈ మాసంలో దేవాలయాలలో జరిగే ప్రత్యేక పూజలు, ఇళ్లలో మహిళలు ఆచరించే వ్రతాలతో ఆధ్యాత్మికత సంతరించుకుంటుంది. వివాహాది శుభకార్యాలకు సైతం ఈ మాసం ఎంతో ఉన్నతమైనదిగా భావిస్తారు. అటువంటి శ్రావణమాసం శుక్రవారం నుంచి ప్రారంభం అవుతున్నది. ఆగస్టు 23వరకు శ్రావణమాసం ఉంటుంది, 24 నుంచి భాద్రమాసం ప్రారంభం అవుతుంది.

– ఒంగోలు కల్చరల్, ఆంధ్రజ్యోతి

● తొలిరోజే విశిష్టత

శ్రావణమాసంలో వచ్చే మంగళ, శుక్రవారానికి ఎంతో ప్రాశస్త్యం ఉంటుంది. ఆ రోజులలో మహిళలు వ్రతాలను ఆచరిస్తారు. ఈ ఏడాది శ్రావణమాసం శుక్రవారంతో ప్రారంభం కావటం విశేషం. ఈ నెలలోనే జంధ్యాల పౌర్ణమి, రాఖీ పండుగ, కృష్ణాష్టమి, పోలాల అమావాస్య, నాగచతుర్థి, నాగపంచమి, పుత్రద ఏకాదశి, దామోదర ద్వాదశి, వరాహ జయంతి పండుగలు వస్తాయి. ఈ మాసంలో వచ్చే సోమవారాలలో శివభక్తులు ఉపవాసం ఉండి శివుడిని అభిషేకిస్తారు. పార్వతీదేవికి కుంకుమార్చనలు సైతం నిర్వహిస్తారు. శ్రావణ మంగళవారాలలో మహిళలు మంగళగౌరి వ్రతం ఆచరిస్తారు.

## వరప్రదాయిని వరలక్ష్మీ వ్రతం

శ్రావణమాసం పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. ఆరోజు ముత్తయిదువలు, కొన్ని ప్రాంతాలలో అవివాహితులైన యువతులు సైతం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. అమ్మవారి ప్రతిమను అలంకరించి, తమకు చేతనైన విధంగా ఆభరణాలు ధరింపజేసి, ముత్తయిదువులను తమ ఇంటికి ఆహ్వానించి భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఆగస్టు 8వ తేదీ వరలక్ష్మీ వ్రతం ఆచరించనున్నారు.

● మోగనున్న బాజాభజంత్రీలు

ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రావణ మాసంలో ముహూర్తాలు విరివిగా ఉండటంతో బాజాభజంత్రీలు మోగనున్నాయి. ఈ నెల 26 నుంచి ఆగస్టు ముహూర్తాలు ఉండటంతో వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు జరుగనున్నాయి. ఈ నెల 26, 30, 31 తేదీలు ఆగస్టు 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నట్లు పంచాంగకర్తలు చెబుతున్నారు. తర్వాత వచ్చే భాద్రపదమాసం శూన్య మాసం కనుక ముహూర్తాలు ఉండవు. కనుక ఈ శ్రావణ మాసంలోనే శుభకార్యాలు విరివిగా జరగనున్నాయి.



● అన్నాచెల్లెళ్ల అనుబంధ ప్రతీక రాఖీ పండుగ

శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమిని జంధ్యాల పౌర్ణమిగా భావించి చైత్ర, వైశాఖ మాసాలలో ఉపనయనం అయిన వారు ముంజవిడుపును ఆచరిస్తుండగా, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియులు జంధ్యాల పౌర్ణమిరోజు నూతన యజ్ఞోపవీతధారణ చేస్తారు. శ్రావణ పౌర్ణమిని రాఖీ పౌర్ణమిగా పిలుస్తూ ఆరోజు తమ తోడబుట్టిన అన్న లేదా తమ్ముడి చేతికి మహిళలు రాఖీని కట్టటం, వారికి అన్న లేదా తమ్ముడు స్వీట్లు, బహుమతులు ఇవ్వటం ఆనవాయితీ. ఆగస్టు 9వ తేదీ రాఖీ పండుగ.





ఏర్పాట్లను పరిశీలిస్తున్న గూడూరి ఎరిక్షన్ బాబు

## ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలి

ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం జేయాలని వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పిలుపిచ్చారు. స్థానిక నటరాజ్ కూడలిలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద ఈనెల 26వ తేదీన మండల టీడీపీ ఏర్పాటు చేయనున్న ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ పనులను ఎరిక్షన్ బాబు గురువారం పరిశీలించారు. పనుల వివరాలను నాయకులు తెలిపారు. అనంతరం దోర్నాల 1వ సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎరిక్షన్‌బాబు మాట్లాడారు. మహానేత ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం అందరి అదృష్టమన్నారు. కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, గుమ్మడి సంధ్యారాణి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, ఏలూరి, ఇంటూరి, ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్ విజయ్ కుమార్, ఎం.అశోక్ రెడ్డి, కందుల, కొండయ్య హాజరవుతున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు ర్యాలీ జరుగుతుందన్నారు. ఆ తర్వాత విగ్రహ ఆవిష్కరణ, 11.30గంటలకు పాలుట్లలో సోలార్ విద్యుత్‌ను వర్చువల్‌గా ప్రారంభోత్సవం, అనంతరం సీసీరోడ్ల ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు షేక్ మాబు, బట్టు సుధాకర్ రెడ్డి, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, వెచ్చా హరగోపాల్, చంటి, కె. సుబ్బారెడ్డి, షేక్ సమ్మద్ బాషా, దేసు నాగేంద్రబాబు, షేక్ మంజూర్, ఎలకపాటి చంచయ్య, చల్లా వెంకటేశ్వర్లు, దేవయ్య పాల్గొన్నారు.

## జాతీయ రెజ్లింగ్ పోటీలకు ప్రభుత్వ కాలేజీ విద్యార్థి



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రభుత్వ జూనియర్ కాలేజి విద్యార్థిని పైడిపాటి వెంకట సిరికీర్తన జాతీయ స్థాయి రెజ్లింగ్(గ్రాప్లింగ్) పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కొలకూరి ఆలీబాబు గురువారం తెలిపారు. స్థానిక పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సిరి కీర్తన ఈనెల 12, 13 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. దీంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యిందని చెప్పారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు ఛత్తీస్‌ఘర్‌లోని బిలాస్‌పూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటుందని, ఈ పోటీలో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

## రెండు రోజుల పోలీస్ కస్టడీకి ఆరుగురు

వైసీపీ మూకల దాడి కేసులో మేజిస్ట్రేట్ ఉత్తర్వులు

పొదిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గత నెల పొగాకు రైతుల పరామర్శ పేరిట జగన్‌పర్యట సందర్భంగా వైసీపీ అల్లరి మూకలు మహిళలపై రాళ్లు, చెప్పులు విసిరిన ఘటనలో పలువురిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే వారిలో ఆరుగురి నిందితులను పోలీస్ కస్టడీకి ఇస్తున్నట్లు గురువారం పొదిలి జూనియర్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్‌ఐ వి వేమన తెలిపారు. కోనేటి శివ, కోనేటి రాజశేఖర్, షేక్ సుభాని, కోనేటి వెంకటేశ్వర్లు, సాగం రవీంద్ర, చొప్పారపు వీరాంజనేయులను కస్టడీకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు.

## కంభంలో పట్టపగలే చోరీ

25 తులాల బంగారు, రూ.40వేల నగదు అపహరణ



పరిశీలిస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణం కాపవీధిలో గురువారం పట్టపగలే ఓ ఇంట్లో దొంగలుపడి 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదును చోరీ చేశారు. ఎస్సై నరసింహారావు కథనం ప్రకారం.. కాపవీధిలో నివాసం ఉంటున్న మద్దూరి పుల్లయ్య కుటుంబసభ్యులు ఊరికి వెళ్లడంతో ఇంటికి తాళం వేసి గురువారం ఉదయం పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి రాగా, తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు అపహరించి బీరువాలోని వస్త్రలన్నింటినీ చిందరవందరగా పడవేసినట్లు తెలిపారు. బాధితుడు పుల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించామని, ఒంగోలు నుంచి క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదే నెలలో 10 రోజుల కిందట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గాంధీ బజారులో 2 చోట్ల గృహాలలో పట్టపగలే చోరీ చేసిన విషయం విదితమే. ఈ ఘటనలో ఇళ్లకు తాళాలు వేసుకుని బయటకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు.

## విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఏపీసీపీడీసీఎల్ ఛైర్మన్ పుల్లారెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు

మార్కాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయిలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఏపీసీపీడీసీఎల్ ఛైర్మన్, ఎండీ పి.పుల్లారెడ్డి చెప్పారు. స్థానిక సౌజన్య ఫంక్షన్ హాలులో గురువారం డివిజన్‌లోని అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో మొత్తం రూ.43 కోట్ల ప్రైవేటు విద్యుత్ బకాయిలు ఉన్నాయన్నారు. వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ పరిధిలో 3,300 వ్యాపార సర్వీసులకు, 856 ప్రభుత్వ సర్వీసులకు స్మార్ట్ మీటర్లను త్వరితగతిన బిగించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 1,057 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను రైతులకు త్వరగా అందించాలని చెప్పారు. వినియోగదారులకు అత్యుత్తమ సేవలందించాలన్నారు. సేవా లోపం జరిగితే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఇడుపూరు గ్రామంలోని ఇండోర్ సబ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ స్టేషన్‌లో నెలవారీ మరమ్మతులు క్రమం తప్పకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఏపీసీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్, జిల్లా ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, మార్కాపురం ఈఈ పీవీ నాగేశ్వరరావు, డీఈఈ షియా నాయక్, అన్ని ప్రాంతాల డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణ, గ్రామీణప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు సమర్థంగా చేపట్టి మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో గురువారం సీజనల్ వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై జరిగిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పాశుధ్య పనులను సజావుగా చేపట్టి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున మలేరియా, డెంగ్యూ, మెదడువాపు వ్యాధి తదితర రకాల వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మలేరియా కేసులు గుర్తించే ప్రక్రియను మెరుగుపర్చాలని వైద్యాధికారులను ఆదేశించారు. దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ఉండేందుకు గంబూషియా, గుప్పి చేపలను వదిలిపెట్టాలని చెప్పారు. అన్ని గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో ఓవర్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జనావాసాలు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు వ్యర్థాలు, చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించారు. ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా గట్టి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి టి.వెంకటేశ్వర్లు, జిల్లా మలేరియా అధికారి దోమల నివారణకు క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మధుసూదనరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు బాలశంకరరావు, వరలక్ష్మీ, కిరణ్‌కుమార్, సువర్ణ, నారాయణ, శ్రీనివాసరావు, నిర్మలాజ్యోతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

● పేదరికం లేని సమాజం కోసం కలిసిరావాలి

పేదరికం లేని సమాజాన్ని రూపొందించడంలో కాంట్రాక్టర్లు కూడా కలిసి రావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్‌శాఖల పరిధిలో పనులు చేపట్టే కాంట్రాక్టర్లతో కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జడ్పీ సీఈవో చిరంజీవి ముందుగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న పీ4 పథకంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అభివృద్ధి పరంగా పైస్థాయిలో ఉన్న 10శాతం మంది ప్రజలు కింది స్థాయిలో పేదరికంతో బాధపడుతున్న 20శాతం కుటుంబాలకు పలు రకాలుగా చేయూతనివ్వాలని కోరారు. జిల్లాలో 74వేలకు పైగా పేద కుటుంబాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు స్వరూపరాణి, రవికుమార్, బాలశంకరరావు, వరలక్ష్మీ, రవినాయక్ పాల్గొన్నారు.

# నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ల గడువు పొడిగింపు

వచ్చే నెల 10వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం

కొనుగోళ్లను పటిష్టంగా చేపట్టాలి : జేసీ గోపాలకృష్ణ



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకు రైతులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో వచ్చేనెల 10వ తేదీ వరకు కొనుగోళ్ల గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందని జేసీ గోపాలకృష్ణ చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్ గురువారం జిల్లా స్థాయి పొగాకు కొనుగోలు కమిటీ సభ్యుల సమావేశంలో నల్లబర్లీ పొగాకు కొనుగోలుపై సమీక్షించి పలు అంశాలను ఆమోదించారు. గడువు పొడిగింపునకు అనుగుణంగా మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ కొనుగోలు చేయాలన్నారు. తొలి విడతలో ఒక రైతు నుంచి 2 మెట్రిక్ టన్నులు లేదా 20 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసిందన్నారు. తక్కువ నుంచి ఎక్కువ క్వింటాళ్లు కలిగిన రైతులను గుర్తించి ఆరోహణ క్రమంలో 20 క్వింటాళ్లకు మించకుండా కొనుగోలు చేయాలని చెప్పారు. జిల్లాలో 800 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇవ్వగా, ఇప్పటి వరకు జిల్లాలో 5.64 కోట్ల విలువైన 677 మెట్రిక్ టన్నుల పొగాకును 245 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశామన్నారు. ఎక్కడైనా కొత్త కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ప్రతిపాదనలు పంపితే ఆమోదిస్తామని చెప్పారు. 20శాతానికి మించి తేమ శాతం ఉండరాదని, ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పూర్తి మార్గదర్శకాలు వచ్చేంత వరకు గోడౌన్లలో నిల్వ ఉంచిన పొగాకు నాణ్యతను గోడౌన్ మేనేజర్‌కు, సొసైటీ ఇన్‌చార్జికి అప్పగించినట్లు జేసీ చెప్పారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ డీఎం శ్రీహరి కృష్ణ, జిల్లా సహకార శాఖ అధికారి ఇందిరాదేవి, వ్యవసాయశాఖ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, మార్కెటింగ్, ఎస్‌డబ్ల్యూసీ, సీడబ్ల్యూసీ మేనేజర్లు పాల్గొన్నారు.

# డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

డీఆర్డీఏ అధికారులకు కేంద్ర బృందం సూచన

పొదిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కేంద్ర బృందం అధికారులు సూచించారు. గురువారం మండలంలోని ఓబులక్కపల్లి గ్రామంలో డీఆర్డీఏ, డ్వామా, ఎన్‌ఆర్‌ఈజీఎస్, హౌసింగ్ ఇతర సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఈసందర్భంగా కేంద్ర బృందం సభ్యులు ప్రభాస్‌శర్మ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు సెల్ఫ్ గ్రూప్‌ల ద్వారా రుణాలు పొందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రుణాలు పొందినవారు ఏరకమైన వ్యాపారాలు చేస్తున్నారని గ్రూపు సభ్యులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధి పొందిన పలువురు మహిళలు కిరాణా దుకాణం, గేదెలు, టెంట్ హౌస్ వంటి వాటిని నడుపుతున్నామని అధికారులకు వివరించారు. అటువంటివి కాకుండా మహిళలు స్వతాహాగా తయారు చేసి ప్యాకింగ్ చేసుకొని మార్కెటింగ్ చేసేటువంటి వ్యాపారాలను ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. అనంతరం వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్‌లు తీసుకుంటున్న వారితో సమావేశం ఏర్పాటై పింఛన్‌లు నెలనెలా అందుతున్నాయా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతినెలా ఒకటవ తేదీనే మీ ఇంటికి పింఛన్ పంపుతుందని మీ ఇంటికి అధికారులు వచ్చి ఇస్తున్నారా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో ఒకటైన నీటి కుంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌ఎల్‌ఎం టీం సభ్యులు నందలాల్ గుర్జార్, డీఆర్‌డీఏ, డ్వామా ఏపీడీలు లక్ష్మీరెడ్డి, బసవ సుబ్బరాజు, ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు, ఏపీవో మమాలక్ష్మీ, ఏపీఎం గోపాలక్రిష్ణ, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ రామక్రిష్ణ, వివిధ శాఖల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు ప్రభాస్‌శర్మ, నందలాల్ గుర్జార్

తొలిరోజు మొక్కుబడిగా...

కేంద్ర బృందం సభ్యులు మండలంలో పర్యటన మొక్కుబడిగా సాగింది. తొలుత ఓబులక్కపల్లిలో ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామని చెప్పారు. అప్పటి నుంచి అధికారులు, సిబ్బంది, డ్వాక్రా గ్రూపు సభ్యులు, పింఛన్ లబ్ధిదారులు వేచిఉన్నా 12.40 గంటలకు వచ్చారు. 1.50 గంటలకు తిరిగి వెళ్లిపోయారు. దీంతో ఎందుకు వచ్చారో..ఎందుకు వెళ్లారో అని గ్రామస్థులు అంటున్నారు.

## బడిలోకి వెళ్లేదెలా..?

● వర్షపునీటితో ఇబ్బందిపడుతున్న విద్యార్థులు



వర్షపునీటిలో స్కూలు నుంచి వెళుతున్న విద్యార్థులు

మద్దిపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మద్దిపాడులోని కడియాల యానాదయ్య హైస్కూలు, జూనియర్ కళాశాల విద్యార్థులు దారి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల, కళాశాల ఒకే ప్రాంగణంలోనే ఉన్నాయి. అయితే స్కూలుకు వెళ్లే దారి వర్షపునీటితో నిండిపోవటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు నీటిలో జారి పడి పుస్తకాలు తడిసిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి గ్రావెల్ తోలి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నీటిని తప్పించుకుని వెళ్లేందుకు విద్యార్థినుల ప్రయత్నం

## ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2 షెడ్యూలు

ఒంగోలు(రూరల్), జూలై24(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో 13వరౌండ్ వేలానికి ప్రతి బ్యారన్‌కు మూడు చొప్పున బేళ్లు తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి జె.తులసి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న చీర్వానుప్పలపాడు, దొడ్డవరప్పాడు, వెంటరాజుపాలెం, ఏడుగుండ్లపాడు, ఉలిచి, 30న టి.అగ్రహారం, వలేటివారిపాలెం, మద్దిరాలపాడు, 31న చేకూరపాడు, ఇనమనమెళ్లూరు, ఆలూరు, గాదెపాలెం, ఆగస్టు 1న దశరాజుపల్లి, గుడిమెళ్లపాడు, బొద్దులూరివారిపాలెం, దేవరంపాడు, కరవది, త్రోవగుంట, పానకాలపాలెం గ్రామాల రైతులు బేళ్లను వేలానికి తీసుకురావాలన్నారు. బేలు 150కేజీలు మించకూడదని ఆమె స్పష్టం చేశారు.

## సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

సంతనూతలపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్టకు చెందిన కైలా సుబ్రహ్మణ్యంకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.2,48,457 చెక్కును ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ గురువారం ఒంగోలులోని తన నివాసంలో అందజేశారు. పేర్నమిట్టలో రంపతోటి శ్రీవిద్యకు వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి కింద రూ.40వేల చెక్కును పంపిణీ చేశారు. అనంతరం పేర్నమిట్టలో సీసీరోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. ప్రజా సంక్షేమ కోసం నిరంతరం కూటమి ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, నాయకులు వెంకటేశ్వర్లు, చిరంజీవి, పోలయ్య, బాబూరావు పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



శ్రేణులతో ఎమ్మెల్యే విజయ్‌కుమార్, కందుకూరి బాబు

సంతనూతలపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నటించిన హరిహరవీరమల్లు చిత్రం విజయవంతం కావాలని కోరుతూ గురువారం పేర్నమిట్ట సమీపంలోని పాలకేంద్రం నుంచి ఒంగోలు వరకు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి బాబు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్ కార్యాలయంలో జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి సత్కరించి సాయిసరోజ్‌మయూరి థియేటర్‌కు వెళ్లి సినిమాను వీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్‌కుమార్, కార్పొరేటర్లు మలగా మహేష్, నూకతోటి మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


● జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



శ్రీనివాసరావును సత్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేలా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఒంగోలులోని బీజేపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం నూతన పదాధికారుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ వికసిత్ భారత్-2047ను దృష్టిలో పెట్టుకొని అందరూ పార్టీ ఉన్నతికి పాటుపడాలన్నారు. నూతన కమిటీని అభినందించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్, మాజీ అధ్యక్షులు పీవీ.శివారెడ్డి, పీవీ.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాకంబరీదేవిగా వాసవీ అమ్మవారు



అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

ఒంగోలు కల్చరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం చివరిరోజు కావడంతో స్థానిక అమలనాధుని వారి వీధిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి గురువారం శాకంబరీ అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఫణిశర్మ మాట్లాడుతూ ప్రకృతిలో పండే పంటలను అమ్మవారికి సమర్పించి అలంకరించటం ద్వారా దేవి అనుగ్రహం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి తదియారాధన సంఘ ప్రతినిధులు తాతా రామకృష్ణ, పువ్వాడ విజయ్ కృష్ణ, రాము, గ్రంధి శ్రీనివాసులు, పబ్బిశెట్టి అశోక్, బాదం మురళి, శ్రీరామ్, ఆర్బీసీ సురేష్, అనిల్, సీహెచ్.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలన సర్వేపై శిక్షణ

సంతనూతలపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రామ పేదరిక నిర్మూలన ప్రణాళిక యాప్ సర్వేపై గురువారం సంతనూతలపాడులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్‌బాబు సర్వే గురించి వివరించారు. టాటా కన్సల్టెన్సీ ప్రతినిధి రంగారావు, ఎంఈవో వెంకారెడ్డి, ఏపీఎం టి.బాబూరావు సర్వే నిర్వహణపై అవగాహన కల్పించారు.

# వైసీపీ పాలనతో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తం



మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎస్

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తం చేశారని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు. గురువారం ఏడుగుండ్లపాడులో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే బీఎస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధిని కొనసాగిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే గుండ్లకమ్మ జలాశయం గేట్లు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించే విధంగా కృషి చేశామన్నారు. గ్రామంలో సైడుకాలువలు, రోడ్లు నిర్మాణాలు చేపట్టామన్నారు. సబ్ ప్లాన్ నిధులతో దళితవాడలో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు, పెద్దకొత్తపల్లి సొసైటీ చైర్మన్ మండవ హరిప్రసాద్, తుమ్మల సుధాకర్, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపీనాథ్, గట్టినేని అయ్యన్న, పోతినేని శ్రీనివాసరావు, టీడీపీ మండలాధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే అచ్యుత్‌కుమార్

కొండపి: కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తున్నదని



కరపత్రాన్ని అందజేస్తున్న అచ్యుత్‌కుమార్

మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా కె.ఉప్పలపాడు గ్రామంలో గురువారం ఉదయం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అచ్యుత్‌కుమార్ అన్నారు. ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండపనేని రామ్మూర్తినాయుడు, చిడిపోతు మల్లికార్జున, నేలపాటి బ్రహ్మయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పీ-4తో పేదలకు అండగా నిలవాలి

● డీఆర్‌డీఏ పీడీ నారాయణ

మద్దిపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4తో పేదరికంలో ఉన్న వారికి మన వంతుగా సహాయపడదామని డీఆర్‌డీఏ పీడీ నారాయణ పేర్కొన్నారు. గురువారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ మండలంలో సుమారుగా 1800 బంగారు కుటుంబాలను గుర్తించారని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ లోపు వారికి మెంటార్లు, స్పాన్సర్లను గుర్తించి వారి ద్వారా ఆయా కుటుంబాలకు చేయూతనందించటానికి కృషి చేయాలని చెప్పారు. బంగారు కుటుంబంలోని చిన్నారులకు చదువులు చెప్పించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. లక్ష్యాన్ని పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ అజయ్, మండల అధికారులు, గ్రామ కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ నారాయణ

- గ్రామాల్లో పేదరిక నిర్మూలన లక్ష్యంగా కార్యదర్శులు పనిచేయాలని ఎంపీడీవో వి.జ్యోతి ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పీ-4లో భాగంగా బంగారు కుటుంబాల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కె.రఘుబాబు పాల్గొన్నారు.

### పేదలను గుర్తించండి

ఒంగోలు(రూరల్): దశరాజుపల్లి గ్రామంలో గురువారం పీ-4 గురించి గ్రామ సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాలంపాటి యానాదినాయుడు మాట్లాడుతూ గ్రామంలో పేద విద్యార్థులను గుర్తిస్తే వారి కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. సంపన్నులతో సేవాకార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్వేత, నాయకులు మాలంపాటి ఆంజనేయులు, గణిపినేని శ్రీనివాసులు, పులిచర్ల మోహన్‌రెడ్డి, పాలెటి ప్రభాకర్, సుబ్బారెడ్డి, భాస్కరరెడ్డి, మాలంపాటి పద్మ పాల్గొన్నారు.

### మార్గదర్శకులను ఎంపిక చేయాలి

సంతనూతలపాడు: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పీ-4 సర్వేలో భాగంగా మండలంలో ఎంపిక చేసిన 1363 బంగారు కుటుంబాలను దత్త తీసుకునేందుకు మార్గదర్శకులను ఎంపిక చేసేందుకు ఎంపీడీవో సురేష్‌బాబు సమీక్ష చేశారు. తహసీల్దార్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలి

● సైకిల్ యాత్రికుడు ముత్తుసెల్వన్

పొన్నలూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని తమిళనాడుకు చెందిన ముత్తుసెల్వన్ అన్నారు. ఆక్సిజన్ ఆవశ్యకతను వివరిస్తూ ఆయన చేపట్టిన సైకిల్‌యాత్ర గురువారం పొన్నలూరుకు చేరుకుంది. తహసీల్దార్ పుల్లారావుతోపాటు స్థానికనేతలను ముత్తుసెల్వన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాకు తగినంత స్థాయిలో చెట్లులేవని, అందుకే ఆక్సిజన్ కొరత వచ్చిందని, కరోనా సమయంలో సకాలంలో ఆక్సిజన్ అందక ఎంతోమంది ఇబ్బంది పడ్డారని తెలిపారు. 2027 డిసెంబరు నాటికి 11 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు



ముత్తుసెల్వన్‌ను అభినందిస్తున్న తహసీల్దార్ పుల్లారావు, టీడీపీ నాయకులు

ముత్తుసెల్వన్ పేర్కొన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన తాను ఉద్యోగానికి రాజీనామా చేసి పర్యావరణ పరిరక్షణకోసం సైకిల్‌యాత్ర చేస్తున్నట్టు చెప్పారు. తహసీల్దార్‌తోపాటు మండల టీడీపీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నేతలు పిల్లి వెంకటనారాయణరెడ్డి, పల్లపోతు రమేష్, వెంకట్రావు, గట్టుబోయిన మల్లికార్జున, మాదాల ప్రసాదు, తాటియలమంద తదితరులు ముత్తుసెల్వన్‌ను అభినందించారు.

# సెక్యులర్ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): లాల్, నీల్ మైత్రితోనే భారత సెక్యులర్ రాజ్యాంగాన్ని కాపాడుకోవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో సెక్యులర్ భారత రాజ్యాంగం, లాల్, నీల్‌మైత్రి ఆవశ్యకత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో రిటైర్డ్ ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా మాట్లాడుతూ దేశంలో వ్యత్యాసాల నివారణకు కమ్యూనిస్టులు, అంబేడ్కరిస్టులు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందుతూ ఉంటే ఇప్పటికీ ప్రజలందరికి చదువు, సరైన విద్యా, వైద్యం అందడం లేదని ప్రశ్నించారు. రానున్న సీపీఐ రాష్ట్ర జాతీయమహాసభల్లో లాల్‌నీల్ మైత్రి అవశ్యతక ప్రధాన అజెండగా ఉంచినట్లు తెలిపారు. ముందుగా గుర్రం జాషువ వర్ధంతిని పురష్కరించుకొని నివాళులర్పించారు. అనంతరం ముప్పవరపు కిషోర్ రచించిన పాలపిట్ట పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, న్యాయవాది ముప్పవరపు కిషోర్, బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ పీకే.రాజేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పూర్ణగంటి తిరుమలయ్య, పందిటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో వక్తలు

## పాలనపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచాలి

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సేవల పట్ల ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచేలా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పి4 కార్యక్రమం అమలు, డాక్యుమెంట్ ఆఫ్ లోడ్, ప్రాజెక్టులకు భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, అధికారులు చిరంజీవి, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

కొత్తపట్నం, జూలై 24(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఒంగోలులోని శ్రీరామ్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారి నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు తులసికుమారి, పద్మావతి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గుర్రం జాషువాకు ఘన నివాళి

ఒంగోలు నగరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): కవికోకిల గుర్రం జాషువ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ప్రకాశంభవనం ప్రాంగణంలోని జాషువా కాంస్య విగ్రహానికి అధికారులు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేసు, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎం.లక్ష్మానాయక్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, చప్పిడి వెంగళరావు, కోటి మాదిగ, రవికుమార్, కత్తి కళ్యాణ్, ఎజ్రాశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ అడ్మిషన్లలో 'పేస్' ప్రభంజనం

ఒంగోలు విద్య, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంజనీరింగ్ అడ్మిషన్లలో ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రభంజనం సృష్టించింది. రాష్ట్ర సగటు కంటే 8శాతం అదనపు అడ్మిషన్లతో పేస్ ఇంజనీరింగ్ కళాశాల జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. కళాశాలలో కన్వీనర్ కోటాలో 1090 సీట్లు ఉండగా 938 సీట్లు (86శాతం) మొదటి విడత కౌన్సెలింగ్‌లోనే భర్తీ అయినట్లు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో విద్యార్థులకు మొదటి సంవత్సరం నుంచే పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో తమ కళాశాలను ఎంపిక చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి రెండు రోజుల పాటు తన నియోజకవర్గంలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 8గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 11 గంటలు వైపాలెం నియోజకవర్గ పరిధిలోని పెద్దదోర్నాలలో జరిగే సుపరిపాలన తొలి అడుగు, ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు హాజరవుతారు. అనంతరం మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని గొట్లగట్టులో జరిగే తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. ఆదివారం ఒంగోలులోని అంబేద్కర్‌భవన్‌లో జరిగే కార్గిల్ విజయ్‌దివస్ కార్యక్రమంలోను, సంతనూతలపాడు ఏఎంసీ ఆవరణలో జరిగే చైర్మన్ మన్నం రాజేశ్వరి పదవీ ప్రమాణస్వీకారోత్సవ సభలో ఎంపీ మాగుంట పాల్గొంటారు.

## 29న దేవస్థాన షాపుల బహిరంగ వేలం

ఒంగోలు కల్చరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం తూర్పుపాలెంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన షాపుల లీజుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో బోడపాటి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రంకురోడ్డులోని 37-1-264లో కేరళ బేకరీ పక్కన ఉన్న రెండు షాపులకు ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటల నుంచి దేవస్థానం ఆవరణలో దేవదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం జరుగుతుందన్నారు. ఆగస్టు 1 నుంచి మూడు సంవత్సరాల కాలపరిమితితో వేలం నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డ్ జిరాక్స్, రూ.20 వేల ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 7013830673 సెల్ నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

## రేపు సింగరాయకొండలో వైద్యశిబిరం

సింగరాయకొండ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని రైల్వేస్టేషన్‌రోడ్డులోని శ్రీవెంకటరమణ ఆప్టికల్స్ వద్ద శనివారం ఆర్థోపెడిక్ హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఈ క్యాంపునకు ఎముకల, కీళ్ల, వెన్నుముక శస్త్రకిత్స వైద్యనిపుణులు పెద్దినేని అనుదీప్ హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బీఎండీ పరీక్ష ఉచితంగా చేస్తారని వివరించారు.

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలి

నాగులుప్పలపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ప్రభుత్వం నిలుపుదల చేయాలని ప్రజాసంఘాల నాయకులు జె.జయంతిబాబు, తూబాటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. స్మార్ట్‌మీటర్లు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈ నెల 27,28 తేదీలలో ఉప్పుగుండూరు, అమ్మనబ్రోలు గ్రామాల్లో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులను విజయవంతం చేయాలని కోరుతూ వారు ఆయా గ్రామాల్లో కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రావెళ్ల వెంకట్రావు, యు.వెంకటేశ్వర్లు, జి.బసవపున్నయ్య, కండ్లగుంట శ్రీనివాసరావు, అత్తంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణ పరిశీలన



వర్మీకంపోస్టు తయారీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పొన్నలూరు, జూలై (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నుంచి వ్యర్థాల సేకరణ, అనంతరం వాటి నుంచి సంపద తయారీపై పంచాయతీ కార్యదర్శులకు గురువారం పొన్నలూరులో అవగాహన కల్పించారు. ఎంపీడీవో పి.సుజాత వారందరికీ పలు విషయాలను వివరించారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలన్నారు. కుళ్లిన వ్యర్థాలతో వర్మీ కంపోస్టు తయారుచేసే విధానాన్ని వివరించారు. స్థానిక వినాయకనగర్‌లో ప్రతి ఇంటికీ వెళ్లి చెత్తను వేరుచేసే విధానంపై ప్రజలకు పలు సూచనలు చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలతో ఆదర్శంగా నిలవాలి



విద్యార్థులతో సీఐ విజయ్‌కృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నాయకత్వ లక్షణాలతో విద్యార్థులు ఆదర్శంగా నిలువాలని తాలూకా సీఐ టి.వి జయ్‌కృష్ణ పేర్కొన్నారు. స్థానిక లాయర్‌పేటలోని నారాయణ సీవో అండ్ ఒలంపియాడ్ స్కూలులో గురువారం జరిగిన ఇన్వెస్టిట్యూర్ సెర్మనీలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని సమాజంలో బాధ్యతాయుతంగా నడవాలన్నారు. క్రమశిక్షణ, నైతికవిలువలు, సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని చెప్పారు. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, చెడు వ్యసనాల నుంచి దూరంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ సయ్యద్ నాసర్‌వలి, ప్రకాశం స్కూల్స్ ఏజీఎం నర్రావుల పెద్దిరెడ్డి, జిల్లా ఆర్ఎస్‌టి జీవన్ స్కూలులో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన వారికి బ్యాడ్జీలను, విధి నిర్వహణను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## క్రమశిక్షణతో చదువుకోవాలి

సంతనూతలపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎస్ఐ అజయ్‌బాబు కోరారు. కొనగానివారిపాలెం జడ్పీ హైస్కూల్లో గురువారం జరిగిన అవగాహన సదస్సులో గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్, సైబర్ క్రైంలపై అవగాహన కల్పించారు. ఎవరైన అసభ్యకంగా ప్రవర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం గుణప్రసాద్ పాల్గొన్నారు.

## గ్రంథాలయ ఉద్యమనేతకు నివాళి

సంతనూతలపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రంథాల ఉద్యమ నేత, పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య 135వ జయంతిని సంతనూతలపాడులో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుర్వేదవైద్యుడు కరుణాకరావు, గ్రంథ పాలకుడు సత్యనారాయణ, పాఠకులు పాల్గొన్నారు.

## స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కొండపి, జూలై24 (ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని డ్వాక్రా మహిళలు జీవనోపాధి పెంపొందించుకునేలా వీవోఏలు అవగాహన కలిగించాలని వెలుగు నెల్లూరు జోన్ డీజీఎం ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం సాయంత్రం కొండపిలోని వెలుగు కార్యాలయంలో వీవోఏలతో వెలుగు ఏపీఎం గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు, స్త్రీనిధి రుణాలు పొందిన మహిళలు రుణాలను సక్రమంగా చెల్లిస్తున్నారని, ఈ పద్ధతిని కొనసాగించాలని సూచించారు. రికవరీ సక్రమంగా ఉన్నందున అదనంగా మరో రూ.15 కోట్ల మేర స్త్రీనిధి రుణాలు మహిళలకు ఇచ్చే అవకాశం ఉందని, వీటిని పొంది సద్వినియోగం చేసుకోవాలని డీజీఎం సూచించారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి శిక్షణ

- 90 రోజుల పాటు ఉచిత తర్ఫీదు
- అనంతరం కుట్టు మిషన్‌ల పంపిణీ
- ఉత్సాహంగా నేర్చుకుంటున్న వైనం

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలు, యువతుల భవిష్యత్‌కు భరోసా కల్పించేందుకు వినూత్న పద్ధతులు అవలంబిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. మహిళలు, యువతులు ఆర్థికంగా వారి కాళ్లమీద వాళ్లు నిలబడి కుటుంబాన్ని పోషించుకోవడంతోపాటు వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు ఉచిత శిక్షణ కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. అందులో భాగంగా ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలోనూ ఏర్పాటు చేశారు. ఎర్రగొండపాలెం మండల కేంద్రంలోని సచివాలయం 3 భవనంలో ఏప్రిల్ 16 టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అధికారులతో కలసి ప్రారంభించారు. అప్పటి నుంచి నేటి వరకు ఈ భవనంలో 40 మందికి శిక్షణ ఇస్తున్నారు. 90 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని ఎంపీడీవో బీ శ్రీనివాసులు తెలిపారు. శిక్షణ అనంతరం వారికి కుట్టు మిషన్లు అందించనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో మండలంలోని నలుమూలల గ్రామాల నుంచి మహిళలు, యువతులు ఎంతో ఉత్సాహంగా వచ్చి కుట్టు శిక్షణను నేర్చుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. చక్కటి మెళుకువలు (దుస్తులు కత్తిరింపులు, కుట్లు వేయడం, హుక్సులు, గుండీలు కుట్టడం తదితర వాటిని) నేర్పుతున్నట్లు శిక్షణ పొందుతున్నవారు తెలిపారు. వీరికి అవసరమైన సామగ్రిని ప్రభుత్వమే సమకూర్చుతుంది. 90 రోజుల శిక్షణ అనంతరం వారు సొంతంగా గ్రామాల్లో ఉపాధిని పొందుతూ మరికొందరికి శిక్షణ ఇచ్చుకోవచ్చని తెలిపారు. శిక్షణలో చేరేందుకు వందల సంఖ్యలో దరఖాస్తులు చేసుకోగా, బ్యాచ్‌లవారీగా శిక్షణ తరగతులు ఇస్తామని అధికారులు తెలిపారు.


శిక్షణ కేంద్రంలో కుట్టును నేర్చుకుంటున్న మహిళలు

### శిక్షణతో ఉపాధి దొరుకుతుంది



మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి దొరుకుతుంది. కుట్టు మిషన్ నేర్చుకోవాలంటే సరైన శిక్షణ కేంద్రాలు లేవు. ఆడపిల్లలు బయటకు వెళ్లి నేర్చుకోవాలంటే తల్లిదండ్రులు పంపించరు. అందుకు నగదు కూడా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రజా ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో ఉచిత శిక్షణ ఇప్పిస్తుండడం సంతోషంగా ఉంది.

\- ఇటికల సరస్వతి

### చక్కటి మెళకువలు నేర్పిస్తున్నారు



ప్రభుత్వం మహిళల కోసం ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వడం మంచి పరిణామం. ఖాళీగా ఉండే మహిళలు, యువతులు వారి కాళ్ల మీద వారు నిలబడేందుకు ఇలాంటివి ఎంతగానో దోహదపడతాయి. నేను శిక్షణ కేంద్రంలో చేరాను. కుట్టులో అన్ని రకాల మెళకువలను నేర్పుతున్నారు.

\- కంచర్ల శ్రీదేవి


రమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

## గ్రంథాలయ పితామహుడికి నివాళి

గిద్దలూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో గురువారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుస్తకం విలువను సమాజానికి పరిచయం చేసిన రమణయ్య జీవితాన్ని నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు కోరారు. గ్రంథాలయ ఉద్యమానికి రమణయ్య చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ఎన్.ప్రసన్న కుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి


మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీ నాయక్

మార్కాపురం రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ ఏడీఏ బాలాజీ నాయక్ కోరారు. వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద విశ్రాంత ఉద్యోగుల భవనంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా వాతావరణం కలుషితం కాకుండా ఉండడంతోపాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారి తెలిపారు. సంవత్సరం అంతా భూమిలో ఏదో ఒక పంటను సాగుచేయడం ద్వారా తేమ ఆవిరి కాకుండా ఉంటుందని తెలిపారు. ఘన, ద్రవ, జీవామృతం తయారు విధానాన్ని తెలియజేసి ఎలా ఉపయోగించాలో తెలిపారు. కార్యక్రమంలో ఏవోలు బుజ్జిబాయి, లక్ష్మీనారాయణ, జోత్స్న, మహమ్మద్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు : ప్రకృతి వ్యవసాయంపై గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులు, పట్టుపరిశ్రమ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో 4 మండలాలకు చెందిన వివిధ శాఖల సహాయకులకు జరిగిన శిక్షణలో వ్యవసాయ ఇన్‌చార్జి సహాయ సంచాలకులు షేక్ మహబూబ్‌భాషా మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాల గురించి రైతులకు తెలియచెప్పి ప్రకృతి వ్యవసాయంపై వారి దృష్టిని మళ్లించాలని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేసే విధానం, గన, ద్రవ జీవామృతాలు, కషాయాల వాడకం గురించి, వాటి తయారీ గురించి వివరించడమే కాకుండా ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మద్దిరెడ్డి, టెక్నికల్ వ్యవసాయాధికారి మెర్సీ గిద్దలూరు, బేస్తవారపేట, కొమరోలు మండలాల వ్యవసాయాధికారులు విజయభాస్కర్‌రెడ్డి, అబ్దుల్ రఫీ, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## వరి సాగుపై రైతులకు అవగాహన


తురిమెళ్ల రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ రమేష్

కంభం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వరి పంటలో డైరెక్ట్ సీడింగ్ అనగా వరి విత్తనాలను యదపెట్టి పంటను సాగు చేసే విధానంపై శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ తురిమెళ్ల రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చెరువులోకి నీరు సకాలంలో రానపుడు, నారు అందుబాటులో లేనపుడు ఈ పద్ధతి చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే నారును పెంచే ఖర్చు, నాట్లు వేసే ఖర్చు ఎకరానికి రూ.10వేల వరకు పెట్టుబడి తగ్గించుకోవచ్చన్నారు. దిగుబడులు కూడా 10శాతం అధికంగా వస్తాయన్నారు. ఈ పద్ధతిని రైతులందరూ ఆచరించాలని, పంట కాలం 15 రోజులు ముందుగా పూర్తవుతుందనన్నారు. కలుపు మందులను ఏఏ దశలో వాడాలో రైతులకు వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుడు బాలాజీనాయక్, వ్యవసాయాధికారి షేక్ మహమ్మద్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## ఫిక్సడ్ డిపాజిట్లపై అధిక వడ్డీకి కొటేషన్ల స్వీకరణ

రాచర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీచెరువు సమీపంలోని నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానానికి సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద అత్యధిక వడ్డీ రేట్లకు బ్యాంకర్ల నుంచి కొటేషన్లు కోరుతున్నామని దేవస్థాన కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న బ్యాంకులు ఈనెల 27వ తేదీ ఉదయం 11గంటలకు కొటేషన్లు అందజేయాలని, పూర్తి సమాచారం కోసం 9603322656కు సంప్రదించాలని ఈవో కోరారు.

# తల్లికి వందనం చరిత్రాత్మక పథకం

మార్కాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం చరిత్రాత్మక పథకమని ఎమ్మెల్యే సతీమణి వసంత లక్ష్మి అన్నారు. 8వ వార్డులో గురువారం తల్లికి వందనం లబ్ధిదారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కత్తిరించి చిన్నారులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంట్లో ఎంతమంది అర్హులైన విద్యార్థులుంటే అందరికీ రూ.13వేల చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న ఘనత ప్రభుత్వానిదే అన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని విమర్శలు చేసినా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వం పాలనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, మాజీ కౌన్సిలర్ షేక్ బషీరున్నీషాబేగం, టీడీపీ నాయకులు జాబీర్, రమణ, చిన్ననాగిరెడ్డి, తల్లికి వం దనం లబ్ధిదారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

మార్కాపురం పట్టణ, మండల పరిధిలో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను వసంత లక్ష్మి గురువారం పంపిణీ చేశారు. గతంలో కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్స పొంది కోలుకున్న వారికి ఆమె స్వయంగా ఇంటికి వెళ్లి మంజూరైన చెక్కులను అందజేశారు. పట్టణ పరిధిలో ఐదుగురు, మండల పరిధిలో ఇద్దరికి మొత్తం రూ.5.34లక్షల చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో టౌన్ మహిళా విభాగం అధ్యక్షురాలు మర్రి ఝాన్సీరాణి, ఆయా వార్డుల, గ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

గిద్దలూరు టౌన్ : సంజీవరాయుని పేట గ్రామంలో జరిగిన తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాధవ తేజశ్వినికి మంజూరైన 24వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందచేశారు. ఈకార్యక్రమంలో జడ్‌పిటిసి బుడత మధుసూదన్, మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


వాటర్ ట్యాంక్ వద్ద గ్రామస్థులు

## వాటర్ ట్యాంక్‌కి లీకులు

- నిర్మించిన ఏడాదికే మరమ్మతులు
- పట్టించుకోని అధికారులు

బేస్తవారపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలం పూసలపాడు పంచాయతీలోని ఒందుట్ల గ్రామంలో ఏడాది కిందట నిర్మించిన వాటర్ ట్యాంకికి అప్పుడే లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతుంది. ఈ విషయాన్ని గ్రామస్థులు అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని అంటున్నారు. జల జీవన్ మిషన్ కింద ఒందుట్ల గ్రామంలో రూ.26లక్షలతో నీటి ట్యాంక్‌ను నిర్మించారు. గ్రామంలోని 130 కొళాయిలకు నీటి సరఫరా అయ్యేలా ఈ పథకాన్ని నిర్మించారు. నిర్మించి ఏడాది కాక ముందే ట్యాంక్‌కి లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతుంది. ట్యాంక్ నిర్మించిన ప్రాంతంలో తీసిన గుంతలను పూడ్చకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ఒంగోలు వారి వీధిలో రక్షిత తాగునీటి పథకం పైపు పగిలి వృథాగా పోతున్న నీరు

## పగిలిన తాగునీటి పైపు

- వృథాగా పోతున్న నీరు
- మరమ్మతులు చేయని అధికారులు

ఎర్రగొండపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం టౌన్ ఒంగోలు వారి వీధిలో రక్షిత తాగునీటి పథకం పైపు లైన్ పగిలిపోయింది. రెండురోజులుగా తాగు నీరు వృథాగా రోడ్డు వెంబడి పోతోంది. నీరు వృథాగా పోతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడా చూడలేదు. స్థానిక డీఈ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే తాగు నీటికి కటకటలాడుతున్న క్రమంలో ఇలా నీరు పోతుండడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా రోడ్డుపై నీరు నిలిచి ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



## చౌడేశ్వరీదేవికి పుట్టినరోజు వేడుక

బేస్తవారపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట బీసీ కాలనీలోని చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో గురువారం అమ్మవారి పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసంలోని అమావాస్య రోజున ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతతం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాము, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆలయాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వినతి

మార్కాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పెద్దారవీడు మండలంలోని వేనూతల కాటమరాజు దేవస్థాన అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని దేవస్థాన కమిటీ గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్ మాట్లాడుతూ ఆలయ భూముల పరిధిని డ్రోన్ సర్వే చేపట్టి నిర్ణయించాలని ఏప్రిల్ 24న స్థానిక కార్యాలయంలో అర్జీ అందజేశామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే మార్కాపురం వైపు నుంచి ఆలయానికి వెళ్లే దారిలేనందున ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపాలని కోరామన్నారు. అంతేగాక ప్రతి గురు, ఆదివారాల్లో ఆలయానికి వేలాదిగా భక్తులు వస్తుంటారని తెలిపారు. ఈ విషయమై సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఫారెస్ట్ అధికారులకు కూడా విన్నవించామని తెలిపారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ముఖ్య బాధ్యులు పీఎల్‌పీ యాదవ్, బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు ఇల్లూరి రంగస్వామిగౌడ్ పాల్గొన్నారు.


డీఏవో రవీందర్‌రెడ్డితో మాట్లాడుతున్న కాటమరాజు దేవస్థాన కమిటీ సభ్యులు


ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న చెత్తాచెదారం

## ప్రమాదం జరిగితే!

- ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి కంప
- పట్టించుకోని అధికారులు

గిద్దలూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ మెయిన్ బ్రాంచి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదం అంచున ఉన్నది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి కంప మొలవడమేకాక చుట్టుపక్కల వారు చెత్తాచెదారాన్ని అక్కడే పడవేస్తున్నారు. పక్కనే ఏటీఎం, మెయిన్ బ్రాంచి కార్యాలయంతోపాటు వివిధ విద్యా సంస్థలు, వ్యాపార సముదాయం ఉన్నది. తెలిసి తెలియక సిగరేట్ పీక ఆ చెత్తా చెదారంలో వేస్తే మంటలు అంటుకుని ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయే ప్రమాదం ఉందని, ఆ మంటలు పక్కనే ఉన్న బ్యాంక్‌కు కూడా అంటుకునే అవకాశం ఉన్నందున ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న చెత్తాచెదారాన్ని, కంపచెట్లను తొలగించాలని బ్యాంక్‌కి వచ్చే ఖాతాదారులు పక్కనే ఉన్న విద్యా సంస్థల విద్యార్థులు కోరుతున్నారు.

## సీసీ కెమెరాల బహూకరణ

కంభం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : బాలికోన్నత పాఠశాలకు ప్రవాస భారతీయులు రూ.36వేలు విలువ చేసే 6 సీసీ కెమెరాలను బహూకరించినందుకు వారికి ప్రధానోపాధ్యాయిని అమూల్య కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలోని భౌతికశాస్త్ర ఉపాధ్యాయినిగా పని చేస్తున్న సుబ్బలక్ష్మి బంధువులు ఆస్ట్రేలియాలో నివాసం ఉంటున్న దీపక్ రాచర్ల, శ్రీక్రిష్ణ బురుజుపల్లి సమకూర్చినట్లు తెలిపారు.

## వలంటీర్లకు ధ్రువపత్రాల పంపిణీ

ఎర్రగొండపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సేవా సంస్థలో వలంటీర్లుగా సేవలు అందించిన విద్యార్థులకు స్థానిక మోడల్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ గుత్తా శ్రీధరనాయుడు ధ్రువీకరణ పత్రాలు గురువారం పంపిణీ చేశారు. కళాశాల ఉత్తమ వలంటీరుగా కాలేజీలో బీకాం రెండవ సెమిస్టర్ చదువుతున్న డీ అరవింద్ ఎంపిక అయ్యారు. ఉత్తమ వలంటీరు అరవింద్‌ను ప్రిన్సిపాల్ శ్రీధరనాయుడు, అధ్యాపకులు డాక్టర్ ప్రదీప్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

## జగదాంబకు నింబార్చన



మార్కాపురం వన్‌టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో వెలసిన జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆషాఢ అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేలూరి అంజనేయశర్మ, రెంటచింతల వరుణ్ తేజ శర్మలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. జగదాంబ మాతకు 1008 నిమ్మకాయలతో నింబార్చన కార్యక్రమం నిర్వహించారు. లలిత సహస్ర నామం, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి వెలుగురూప దర్శనం నిర్వమించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

## దివ్యాంగులను ఆదరించాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల పట్ల ఆదరణ కలిగి ఉండాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొంతల కృష్ణ అన్నారు. స్థానిక స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో బొంతల కృష్ణ తన పుట్టిన రోజు పురస్కరించుకుని పిల్లలకు పలకలు, బలపాలు, స్వీట్లు, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొంతల ప్రదీప్, పాఠశాల ప్రిన్సిపాల్ సైరా భాను తదితరులు పాల్గొన్నారు.


## అమరా సురేష్‌కు పురస్కారం



అవార్డును అందుకుంటున్న సురేష్ కుమార్

మార్కాపురం వన్‌టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణానికి చెందిన డా.అమరా సురేష్‌కు ప్రతిష్టాత్మకమైన వాస్తు విద్వన్మణి గౌరవ పురస్కారం లభించింది. వాస్తు శాస్త్రంలో విశేష సేవలు అందించిన జ్యోతిష్య సిద్ధాంతి సురేష్ కుమార్‌కు చిక్కడపల్లిలోని పరాషరస్ అకాడమీ ఆఫ్ ఆస్ట్రో సైన్సెస్ ఆధ్వర్యంలో వాస్తు సదస్సులో సత్కారం నిర్వహించి పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు పుర ప్రముఖులు సురేష్‌ను అభినందించారు.

## ఏడాది పాలనపై ఇంటింటి ప్రచారం


ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ శ్రేణులు

రాచర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఏడాది పాలనపై టీడీపీ మండల నాయకులు రాచర్ల గ్రామంలో ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలను వివరించారు. ప్రజలు చెప్పిన సమస్యలను తెలుసుకుని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దప్పిలి కాశిరెడ్డి, పఠాన్ సనావుల్లా ఖాన్, సొటం కల్యాణ్ రెడ్డి, సాయి, ఎన్.రాజా పాల్గొన్నారు.

## పొదిలికి ట్రాఫిక్ మొబైల్ వాహనం



పొదిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆధ్వర్యంలో పొదిలి పోలీస్ స్టేషన్‌కు ట్రాఫిక్ మొబైల్ ద్విచక్ర వాహనాన్ని ఇచ్చినట్లు ఎస్ఐ వేమన గురువారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పర్యవేక్షణలో ఈ ద్విచక్ర వాహనం ఉంటుందని తెలిపారు.

## ప్రతి ఇంటికీ 'సంక్షేమం'

పామూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని టీడీపీ నాయకుడు బద్దిపూడి మార్క్ అన్నారు. గురువారం మండలంలోని సట్టుమడుగు గ్రామంలో సుపరిపాలనలో తొలిఏడాది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరుగుతుఊ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.ఏలీషా, బిస్తాలిన్, కె.నారాయణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలో 272 బూత్‌లో జరిగిన కార్యక్రమంలో షేక్ చిన్న హజరత్, మాచర్ల రహిమాన్, తాడి కొండ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## నోటు పుస్తకాల పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనికాలపల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు చింతపూడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గుంటిమడుగు శ్రీనివాసవర్మ ఆర్థిక సహకారంతో అందజేసిన నోటు, గణితం, పలకలు, పెన్నులు, తదితర వస్తువులను గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా హెచ్ఎం జె.భారతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో అలేఖ్య, షేక్ అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు నిఘా

సీఎస్‌పురం(పామూరు), జూలై 24(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో నేరాలు జరగకుండా గట్టి నిఘా పెట్టాలని సీఐ ఎం.భీమానాయక్ సూచించారు. గురువారం సీఎస్‌పురం పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను తనిఖీచేసి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితిగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. నేరాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'అన్నదాత సుఖీభవ'లో పేరు లేకపోతే దరఖాస్తు చేసుకోవాలి

పీసీపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులై ఉండి జాబితాలో లేనివారు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.రంగాక్రిష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత రైతుసేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయ అధికారికి దరఖాస్తు అందజేయాలన్నారు. ఈనెల 31లోగా పంటల బీమా చేయించుకోవాలన్నారు.

## రోడ్లకిరువైపులా చిల్లచెట్ల తొలగింపు

దొనకొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్లకిరువైపులా చిల్లచెట్లను తొలగించారు. దొనకొండ నుంచి మార్కాపురం వెళ్లే రహదారిలో కెజీబీవీ పాఠశాల వద్ద గల మలుపు వద్ద బుధవారం ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈక్రమంలో ఎస్ఐ త్యాగరాజు గురువారం ఉదయం ఎక్స్‌కవేటర్‌తో రహదారి మలుపుల వద్ద అడ్డుగా పెరిగిన చిల్లచెట్లను తొలగించారు. మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులతో పాటు స్పీడు బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

## గుర్రం జాషువాకు నివాళి

కురిచేడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నమశ్శివాయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గుర్రం జాషువా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మాలకొండయ్య ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలను పారద్రోలేందుకు నడుం బిగించిన వ్యక్తి జాషువా అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏసుదాసు, శ్రీనివాసరావు, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

## శాకంబరీగా కనకదుర్గమ్మ

దర్శి, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శాకంబరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. భక్తులు అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఆకులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధికసంఖ్యలో మహిళలు పాల్గొని పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. భక్తి పాటలతో, నృత్యాలతో అలరించారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

దర్శి, జూలై 24(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపేలా ప్రోత్సహించాలని ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో వీఏఏలకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరైతు కొంత పొలంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేసేలా చూడాలన్నారు. భవిష్యత్తులో ఎరువులకు ప్రభుత్వాలు సబ్సిడీ ఎత్తివేయటం జరుగుతుందన్నారు. దీంతో పెట్టుబడులు తగ్గించుకునేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరి సాగుకు సన్నద్ధం

### బోర్ల కింద నారుపోస్తున్న రైతులు



చెరువుకొమ్ముపాలెంలో బోర్ల కింద వరినారు

దర్శి, జూలై 24(ఆంధ్రజ్యోతి): సాగర్ ఆయకట్టు రైతులు వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పూర్తిస్థాయిలో కురవకపోవటంతో అధికశాతం భూములు ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం శ్రీశైలం డ్యాం నిండటంతో పాటు సాగర్ జలాశయానికి పుష్కలంగా నీరు చేరటంతో కుడి కాలువకు నీరు విడుదలచేశారు. ఆగస్టు మొదటి వారంలో రెండవ జోన్‌కు కూడా నీరు విడుదలచేసే అవకాశాలు ఉన్నాయి. దీంతో సాగర్ ఆయకట్టు రైతులు వరిసాగుకు సిద్ధమవుతున్నారు. ముందుగా వరినాట్లు వేసేందుకు బోర్ల వసతి ఉన్న రైతులు ముమ్మరంగా నార్లు పోస్తున్నారు. సాగర్ జలాలు విడుదలయ్యే సమయానికి ఈనారు అదునుకు వస్తుంది. ఈక్రమంలో ముందుగా వరినాట్లు వేసుకోవచ్చనే ఉద్దేశంతో రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. బోర్ల వసతి లేని రైతులు ఆయకట్టు భూములను దున్ని సిద్ధం చేస్తున్నారు. సాగర్ జలాలు రాగానే వరినారు పోసుకునేందుకు వీలుగా మాగాణి భూములను చదును చేస్తున్నారు.

గత 20 ఏళ్ల కాలంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది జలాశయాలకు ముందుగానే నీరు చేరింది. వరి పంటకు ఢోకా లేదనే ధీమాతో రైతులు వరి సాగుపైనే దృష్టి సారించారు. దర్శి ఎన్ఎస్‌పీ డివిజన్ పరిధిలో లక్ష ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. సాధారణంగా 60 వేల ఎకరాల్లో వరిసాగు, మిగిలిన భూముల్లో ఆరుతడి పంటలను సాగు చేస్తారు. ఈఏడాది చివరి ఆయకట్టు భూములకు నీరు అందే అవకాశాలు ఉండటంతో వరిసాగు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# చెట్ల కింద చదువులు

- గదులు లేక విద్యార్థుల అగచాట్లు
- ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ కావటంతో కొరత
- సుంకరవారిపాలెం ఉన్నత పాఠశాల తీరు ఇది



గదులు లేకపోవటంతో చెట్ల కింద చదువుకుంటున్న విద్యార్థులు



గదులు లేక పోవటంతో రేకుల షెడ్డు కింద పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ముండ్లమూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకరవారిపాలెం ఉన్నత పాఠశాలలో గదులు కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని గదులతో చెట్ల కింద, రేకుల షెడ్డు కింద విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ పాఠశాలను ఇటీవలే హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో గదుల కొరత ఏర్పడింది. ఒకటి నుంచి 9వ తరగతి వరకు 164 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి కేవలం నాలుగైదు గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో పాఠశాల ఆవరణలో ఉన్న చెట్టు కింద చదువు కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా, పాఠశాలకు ఆనుకొని రేకుల షెడ్లు ఏర్పాటుచేశారు. అవీచాలక గదులు పక్కన ఉన్న వరండాలో విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లులేక పాఠశాల ఆవరణలోనే ఇరుకు గదుల్లో విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు. గతంలో సుంకరవారిపాలెం యూపీ పాఠశాల వరకు ఉండటంతో అందుకనుగుణంగా గదులు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం పాఠశాల స్థాయి పెరగటంతో గదుల కొరత ఏర్పడింది. విద్యాశాఖ అధికారులు స్పందించి అదనపు గదులు మంజూరు చేయించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# అడుగుకో గుంత..!

- అధ్వానంగా తూర్పుకట్టకిందపల్లి రోడ్డు
- పట్టించుకోని గత పాలకులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అడుగుకో గుంతలా తయారైన రహదారి

పామూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామూరు - తూర్పుకట్టకిందపల్లి రహదారి అధ్వానంగా తయారైంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ రహదారిలో అడుగుకో గుంత ఏర్పడటంతో ప్రయాణం చేయాలంటే గ్రామస్థులు భయపడుతున్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద 2009లో మొదటి విడత రూ.25 లక్షలు, రెండో విడత రూ.45 లక్షలతో తారు రోడ్డు నిర్మించారు. 2014లో రూ.20 లక్షలతో మరమ్మతులు చేశారు. గత పది సంవత్సర కాలంలో రోడ్డుపై దమ్ము చక్రాలు తిరగడంతో తారురోడ్డు గుంతలమయమైంది.

పామూరు జాతీయ రహదారి 167-బి నుంచి తూర్పుకట్టకిందపల్లి, కరోళ్లపాడు గ్రామం వరకు సుమారు 5 కిలో మీటర్లు ఉంది. కదిరి బాబురావు హయాంలో ఉప్పువాగు నుంచి కరోళ్లపాడు గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.కోటి 80 లక్షలు మంజూరుచేశారు. పనులు పొందిన కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి రెండు చప్టాలను కూడా నిర్మించారు. అంతలోనే ఎన్నికలు రావడం టీడీపీ ప్రభుత్వం మారడంతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆప్రభుత్వం నిర్మాణ పనులను అర్ధంతరంగా నిలిపివేసింది. సుమారు పది అడుగుల ఎత్తుగా నిర్మించిన చప్టాలు దాటలేక డ్రైవర్షన్ రోడ్డు సక్రమంగా లేకపోవడంతో గ్రామస్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. కట్టకిందపల్లి రోడ్డు మోకాటిలోతు గుంతలతో ఛిద్రంగా తయారైంది. గ్రామస్థుల అభ్యర్థన మేరకు ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక పంపారు. రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు మంజూరైతే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.



ఛిద్రమైన కట్టకిందపల్లి రహదారి

### ఆరు కిలోమీటర్ల రోడ్డు నిర్మిస్తే 16 గ్రామాలకు ప్రయోజనం

కేవలం ఆరు కిలోమీటర్ల ఛిద్రమైన రోడ్డును పాలకులు నిర్మిస్తే ప్రకాశం, నెల్లూరు జిల్లాల మధ్య ఉన్న 16 గ్రామాలకు ప్రత్యామ్నాయ రోడ్డుగా రవాణ సౌకర్యం మెరుగుపడుతుంది. ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు, కొండాపురం, వింజమూరు, మండలాలలో పాటు ప్రకాశం జిల్లాలోని పామూరు మండలంలో ఆరు గ్రామాలు, మొత్తం 16 గ్రామాలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. తూర్పురొంపిదొడ్ల పంచాయతి పరిధిలోని ఉప్పువాగు వంతెన మీదుగా మండలంలోని తూర్పుకట్టకిందపల్లి, కరోళ్లపాడు మీదుగా 30 మైలు వరకు ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేయవచ్చు.

నెల్లూరు జిలాలోని పది గ్రామాల ప్రజలు రెవిన్యూ డివిజన్‌గా ఉన్న కందుకూరుకు, ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాలకొండకు, జిల్లా కేంద్రమైన ఒంగోలుకు వెళ్లేందుకు ఈ మార్గం వీలుగా ఉంటుంది. చుట్టూ తిరిగి కందుకూరు వెళ్లే బదులు ఈమార్గంలో ప్రయాణిస్తే సుమారు 25 కిలో మీటర్లు దూరం తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుంది. పాలకులు ఆలోచించి కట్టకిందపల్లి రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి తమ కష్టాలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# పంటకు బీమా.. రైతుకు ధీమా

- కరువుతో పాటు విపత్తుల్లోనూ పరిహారం
- 31తో ముగియనున్న దరఖాస్తు గడువు

పీసీపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పేరుతో పంటలకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం జరిగినప్పుడు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఈ బీమా పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి ఈ పథకాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో లబ్ధి పొందేందుకు రైతులు సీఎస్‌సీ సెంటర్లు, మీసేవ పోర్టల్‌లలో ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు తమవాటా కింద కొంతనగదును చెల్లించి బీమా నమోదు చేయించుకోవాలి.

### పథకం అమలు ఇలా..

ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజనలో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన కంది, వరి, మినుములు, ఎండు మిరప, నువ్వులు, సజ్జ, పత్తి తదితర పంటలన్నింటికీ ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు ధర చెల్లించి బీమా చేయించుకోవాలి. పంట సాగుచేసిన తరువాత బీమా చేయించుకునేందుకు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదై ఉండాలి. అవసరమైన పత్రాలు జతపరుస్తూ ప్రభుత్వం అనుమతించిన మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ల ద్వారా ఈ పథకంలో చేరవచ్చు. ఈనెల 31వరకు ఖరీఫ్‌కు సంబంధించి బీమా చేయించుకుని పంటల సాగు అనంతరం ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

### బీమా పొందేదిలా..

అధిక లేదా అకాల వర్షం, అధిక ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులతో చీడపీడలు, ఈదురుగాలులతో పంటలు దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన జిల్లా, మండల, గ్రామాల యూనిట్ ప్రాతిపదికన పంటలు దెబ్బతింటే బీమా చేయించుకున్న రైతులకు నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుంది. బీమా కోసం ఎంపిక చేసిన పంటలకు బ్యాంకుల నుంచి రుణాలు పొందిన రైతులకు ఆయా బ్యాంకులు కూడా రైతులకు బీమాను నమోదు చేస్తున్నాయి. రుణాలు తీసుకోని రైతులు, కౌలు రైతులు ఫసల్‌బీమా చేసుకోవాలంటే దరఖాస్తును పూర్తిచేసి సంబంధిత పత్రాల ద్వారా సీఈసీ సెంటరులో ఆన్‌లైన్ ద్వారా బీమా చేయించుకోవాలి.

### విపత్తులకూ బీమా సౌకర్యం

దిగుబడి నష్టంపై ఆధారపడి అగ్నిప్రమాదం, గాలివాన, వడగండ్లు, తుఫాన్, అనావృష్టి, తెగుళ్లు వంటి ప్రతికూల వాతావరణం వల్ల కలిగే పంటనష్టాలకు సీసీఎస్ ద్వారా వచ్చు దిగుబడి ఆధారంగా ఆయా బీమా సంస్థలు నష్టపరిహారాన్ని అందజేస్తాయి. అలాగే, పంట కోతల తర్వాత పొలంలో ఆరబెట్టిన పంటలకు వర్షాలు, తుఫాన్, అకాల వర్షాల వల్ల పంటనష్టం జరిగినప్పుడు అధికారుల అంచనా మేరకు రైతులకు నష్టపరిహారం అందజేస్తారు.

# బాల్య వివాహాలు చేస్తే కఠినచర్యలు

కనిగిరి, జూలై 24(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేసేవారికి రెండేళ్ళు కఠిన కారాగార శిక్ష తప్పదని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలను చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ళు జైలుశిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించటం జరుగుతుందన్నారు. తహసీల్దార్ రవిశంకర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతుంటే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. 1098, 100, 112 నెంబర్లకు అయినా ఫోన్‌చేసి సమాచారం తెలపవచ్చునన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, పి.రమణారెడ్డి, గుడ్‌హెల్ప్ రమేష్, నవకుమార్, ఎలీషా, పవన్, సూరె రాజు, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, బారాయిమాం, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు




సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సిబ్బంది ప్రతిరోజు గ్రామాలను సందర్శించాలని డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ముండ్లమూరు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించి త్వరితగతిన పెండింగ్ కేసులు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. రహదారుల ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. మండలంలో ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు పి.హనుమంతరావు, వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదరికంలేని సమాజం కోసం పాటుపడాలి

పామూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): పేదరికంలేని సమాజం కోసం పాటుపడాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పీ- 4 పథకాన్ని చేపట్టిందన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈపథకంలో పేదలను ఆదుకొనేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, కార్యదర్శులు జీవీ అరవిందరెడ్డి, ఇండ్ల హరినారాయణ, గుత్తి రాజగోపాల్, కృష్ణమూర్తి, జి.నాగేశ్వరరావు, షేక్ జానీ ఆదాంబి, తదితరులు పాల్గొన్నారు.

**వెలిగండ్ల:** పేదరికాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో పీ4 విధానానికి ప్రభుత్వం రూపకల్పన చేసిందని ఎంపీడీవో మహబూబ్ బాషా అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో యానిమేటర్స్, డ్వాక్రా మహిళలకు పీ4 పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 1200కుపైగా పేదరిక కుటుంబాలను గుర్తిం చినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.

## అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ముండ్లమూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్లంపల్లి గ్రామానికి చెందిన నిరుపేద ఐన కుంటా అంజలి ఇటీవల గ్రామానికి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా వచ్చిన సమయంలో తమగోడు వెళ్లబోసుకున్నారు. ఈక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆకుటుంబాన్ని దత్తత తీసుకుంటానని హామీ ఇచ్చి కొంత ఆర్థిక సాయాన్ని అందజేశారు. గురువారం అంజలి కుటుంబాన్ని తహసీల్దార్ సందర్శించి కొన్నినెలలకు సరిపడ నిత్యావసర సరుకులను అందజేశారు. అధైర్య పడొద్దు, కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దివ్యాంగ చిన్నారితో పాటు మిగతా ముగ్గురు చిన్న పిల్లలను కూఆ చదివించాలని అంజలికి సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని సాకారం చేసుకొనేందుకు కష్టపడి చదవాలని ఎస్ఐ కె.కమలాకర్ సూచించారు. గురువారం మారెళ్లలోని పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ళ చేతిలో మోసపోవద్దన్నారు. విద్యార్థులు ఏదైనా ఆపదలో ఉంటే 100, 112కు డయల్ చేయాలన్నారు. విద్యార్థినులైతే వారి సెల్‌ఫోన్‌లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు షేక్ కాలేషావలి, కె.వెంకటేశ్వర్లు, వైద్యాధికారి మణిశంకర్, రాంబాబు, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## బాగుపడిన రోడ్డు



తాత్కాలిక మరమ్మతులుచేసిన ప్రభుత్వకార్యాలయాల ప్రాంగణంలోని రోడ్డు

కనిగిరి, జూలై 24(ఆంధ్రజ్యోతి): చిత్తడిగా ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం బాగుపడింది. కనిగిరి పట్టణంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, అగ్రికల్చర్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారింది. చిత్తడిగా ప్రభుత్వకార్యాలయాలు శీర్షికన ఈనెల 22న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద డస్ట్‌తో కూడిన సిమెంట్ చిప్స్‌ను వేయించేందుకు తహసీల్దార్ చర్యలు చేపట్టారు. రెండు రోజుల పాటు చేసిన పనులతో బురదమయంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం బాగుపడింది.

## కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కనిగిరి, జూలై 24(ఆంధ్రజ్యోతి): బదిలీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పీసీ కేశవరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. సమ్మెలో పాల్గొన్న కార్మికులను విధుల్లోకి తీసుకోకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు చార్లెస్, నరేంద్ర, లక్ష్మయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి

కనిగిరి, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠ్యాంశాల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని డిప్యూటీఈవో శ్రీనివాసులరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్, హైస్కూల్, కేజీబీవి పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న బోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జీసీడీవో కె.హేమలత, ఎంఈవోలు పెద్దిరాజు, యూవీ నారాయణరెడ్డి, రామిరెడ్డి, ఆర్.కొండారెడ్డి, సంజీవి, హెచ్ఎం కలవ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రావణమాస పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 24(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి గ్రామంలో శ్రీదేవి-భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి శ్రావణమాస విశేషపూజలు అర్చకులు మురళీకృష్ణ ఆచార్యులు ఆధ్వర్యంలో జరుగుతాయని ఆలయ ధర్మకర్త పిడుగు విజయ బాబురావు, తెలిపారు. ఈమాసంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## రేపు సత్యదేవుని జయంతి

పామూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరమా సమేత వీర వెంకట సత్యనారాయణస్వామి జయంతిని శనివారం పామూరు పట్టణంలో నిర్వహిస్తున్నట్లు సత్యనారాయణస్వామి సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా పంచతీర్థ కలశాలతో అభిషేకం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## స్మార్ట్‌మీటర్లపై అపోహలు నమ్మవద్దు

అద్దంకి, జూలై24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగాన్ని మించి అధిక బిల్లులు వస్తాయనే అపోహలను వినియోగదారులు నమ్మవద్దని విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. అద్దంకి డివిజన్ పరిధిలోని పలుగ్రామాలలో ఆయన స్మార్ట్ మీటర్లను పరిశీ లించారు. ప్రస్తుతం ఉన్న మీటర్లు, స్మార్ట్ మీటర్లను పోల్చి వివరించారు. రీడింగ్‌లలో ఎలాంటి మార్పులేదన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ద్వారా ప్రతి నెలా ఖచ్చితమైన తేదీకి ఆటోమాటిక్‌గా బిల్లింగ్‌తీసే అవకాశం ఉంటుందన్నారు.



బంగారుకుటుంబాల వారితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

# గిరిజనుల్లో పీ-4 వెలుగులు

### u పది కుటుంబాలను దత్తత తీసుకున్న కలెక్టర్

చెరుకుపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో పనులు, పొలాల్లో ఎలుకలు, పాములు పట్టడంతో కడుదుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న ఆ గిరిజనుల కుటుంబాల్లో పీ-4 వెలుగులు నింపనున్నది. పేదరిక నిర్మూలన దిశగా పీ-4 పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సంపన్నులు పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి ఆర్థిక స్థోమతకు సహకరించనున్నారు. ఈ క్రమంలో మండలంలోని బలుసులపాలెం, కామినేనివారిపాలెం గ్రామాలకు చెందిన పది గిరిజన కుటుంబాలకు కలెక్టర్ వెంకటమురళి మార్గదర్శిగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన గురువారం చెరుకుపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పది బంగారు కుటుంబాలతో కలెక్టర్ మాట్లాడారు. దత్తత తీసుకున్న వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పీ-4 పథకంతో తమ స్థితిగతులు మారుతాయని గిరిజన కుటుంబాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. తమకు మార్గదర్శిగా ఉన్న కలెక్టర్ సూచనలు పాటించి అభివృద్ధి చెందుతామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 కార్యక్రమం పూర్తిస్థాయిలో అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పది కుటుంబాలకు ఉపాధి జాబ్ కార్డులు మంజూరు చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ పది కుటుంబాల మహిళలతో డ్వాక్రా గ్రూప్ ఏర్పాటు చేసి, వారి స్వయం సమృద్ధికి తోడ్పడతామన్నారు. ఈ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసి, ఈ నెలాఖరులోపు వారి ఖాతాల్లో నగదు జమ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ మొత్తానికి మార్గదర్శిగా తాను మరో రూ.50 వేలు అందజేస్తానని కలెక్టర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ ప్రణయ్, ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో షేక్ మహబూబ్‌సుబాని, ఈవోపీఆర్డీ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

# జంట హత్యల నిందితుల కోసం వేట

1 హైదరాబాద్, బెంగళూరులకు వెళ్లిన పోలీసులు 1 చిలకలూరిపేటలో కారు వదిలి.. గుంటూరు వెళ్లి పరారీ

సంతమాగులూరు, అద్దంకి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సంతమాగులూరు మం డలం పాతమాగులూరు సమీపంలో హత్యకు గురైన తండ్రితనయులు వీరాస్వామిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. బెంగళూరులో రియల్ వ్యాపారం చేసుకునే తండ్రి తనయులు పల్నాడు జిల్లా నరసరావుపేటలో కోర్టు వాయిదాకు రాగా కిడ్నాప్ చేసి పాతమా గులూరులో బుధవారం నిందితులు హతమార్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిందితు లను పట్టుకునేందుకు పోలీసు బృందాలు వేట ప్రారంభించాయి. హత్య చేసిన తర్వాత నిందితులు కారులో చిలకలూరిపేట వద్దకు వెళ్లి అక్కడ వాహనాన్ని వదిలి మరో వాహనంలో గుంటూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అక్కడ నుంచి ఆ సమయంలో స్టేషన్‌లో ఉన్న రైలు ఎక్కి పారిపోయినట్లు అనుమానిస్తున్నారు. ఆ సమయంలో హుబ్లీ వైపు ఒక ట్రైన్, హైదరాబాద్ వైపు మరో ట్రైన్ ఉందని, వీటిలో ఏదో ఒక ట్రైన్ లో నిందితులు వెళ్లి ఉంటారని భావిస్తున్నారు. నిందితుల కదలికలకు సంబంధించి పోలీసులు కొంత సీసీ ఫుటేజ్ సేకరించినట్లు సమాచారం. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలలో నిందితుల కోసం గాలించేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు వెళ్లినట్లు బాపట్ల డీఎస్పీ సీతారామాంజనేయులు తెలిపారు. గతంలో ఫ్యాక్షన్ గొడవలతో హత్యలు, ప్రతీకార హత్యలతో అట్టుడికిన సంతమాగులూరు కొన్నేళ్లుగా కొంత ప్రశాంతంగా ఉంది. ఈ సమయంలో పాతమాగులూరు వద్ద రియల్ వ్యాపారులు హత్యతో ప్రజలు ఉలిక్కిపాటుకు గురయ్యారు.




నిందితులు వినియోగించిన స్కార్పియో

**పోస్టుమార్టం పూర్తి... బెంగళూరుకు మృతదేహాలు**

హత్యకు గురైన వీరాస్వామిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డిల మృతదేహాలకు గురువారం నరసరావుపేట వైద్యశాలలో పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు. మృతదేహాలను బంధువులు బెంగళూరుకు తీసుకువెళ్లారు.

# డ్రోన్లు డౌటే

సొమ్ము చెల్లించినా అందని వైనం

### u 121 డ్రోన్లకు 48 మాత్రమే పంపిణీ
### u చోద్యం చూస్తున్న వ్యవసాయ శాఖ



వ్యవసాయంలో యాంత్రీకరణ గణనీయంగా పెరుగుతోంది. ఆధునిక సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెరిగిన కూలి రేట్లు, కూలీల కొరతను అధిగమించేలా.. సాగుదారులకు ఊరట లభించేలా.. స్థానికంగా పలువురు ఉపాధి పొందేలా.. వ్యవసాయ యాంత్రీకరణ జరగాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన డ్రోన్లతో సాగు చేపట్టేలా రైతుల్లో అవగాహన పెంచుతోంది. ఆయా డ్రోన్లను సబ్సిడీపై అందిస్తోంది. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో డ్రోన్లను సంఘాలకు అందజేయడంపై వ్యవసాయశాఖ నిర్లక్ష్యం వహిస్తోంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ పద్ధతులను ఆధునికీకరించడం.. ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం యాంత్రీకరణను వేగవంతం చేస్తోంది. పురుగు మందులు పిచి కారితో పాటు ఎరువులు చల్లేందుకు డ్రోన్లు అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు అటు ఖర్చులు, ఇటు కూలీల బాధలు తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎంతోకాలంగా స్థోమత ఉన్న రైతు లు పలువురు డ్రోన్లను విని యోగిస్తూ సాగులో లబ్ధి పొందుతున్నారు. అయితే అందరూ వ్యక్తిగతంగా డ్రోన్లను సమకూర్చుకునే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో సబ్సిడీపై అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డ్రోన్ల వినియోగంపై ఆయా గ్రామాల్లోని రైతు సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చి తద్వారా కొందరికి ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంది. ఎరువులు, పురుగు మందుల పిచికారిలో డ్రోన్లను విరివిగా వినియోగించాలని ప్రభుత్వం భావిస్తోంది. 80 శాతం సబ్సిడీపై డ్రోన్లు పంపిణీకి ఆదేశాలు జారీ చేసింది. పల్నాడు, గుం టూరు, బాపట్ల జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారం భంలోనే 121 డ్రోన్లను పంపిణీ చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ప్రభుత్వ లక్ష్యం ఘనంగా ఉన్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. నిర్ణయించిన వాటా ధనం చెల్లించి నెలలు గడుస్తున్నా సంఘాలకు డ్రోన్ల సరఫరా చేయలేదు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో రైతులకు అందించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. రైతు సంఘాలు 89 డ్రోన్లకు వాటా ధనం కూడా చెల్లించాయి. అయితే ఇప్పటికి 48 డ్రోన్లను మాత్రమే పంపిణీ చేశారు. ప్రస్తుతం సాగు పనులు విరివిరిగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో డ్రోన్లు పంపిణీపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో డ్రోన్లు అందుబాటులోకి వస్తాయన్న నమ్మకం రైతుల్లో సన్నగిల్లుతోంది. డ్రోన్ల పంపిణీలో జాప్యం జరుగుతున్నా చర్యలు లేవు. డ్రోన్లు కోసం వాటా ధనం చెల్లించిన సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సీజన్ పూర్తయ్యాక డ్రోన్లు ఇచ్చి ప్రయోజనం ఉండదంటున్నారు.

జిల్లాల వారీగా డ్రోన్ల పంపిణీ ఇలా..

| జిల్లా | లక్ష్యం | పంపిణీ |
|---|---|---|
| పల్నాడు | 43 | 14 |
| గుంటూరు | 42 | 21 |
| బాపట్ల | 36 | 13 |

## ఐదు లారీలకు రూ.12 లక్షలు

### మరో 14 గ్రానైట్ లారీల లెక్క తేల్చని అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రానైట్ అక్రమ రవాణాపై వాణిజ్య పనులు శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్న గ్రానైట్ లారీలపై దాడి చేసి తనిఖీలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలో ఇటీవల పల్నాడు జిల్లా పరిధిలో 19 లారీలను అధికారులు సీజ్ చేశారు. వీటిలో ఐదు లారీల నుంచి గ్రానైట్ విలువ ఆధారంగా సుమారు రూ.12 లక్షలు జరిమానా వసూలు చేశారు. 14 లారీలకు సంబంధించి ఇంకా వసూలు కాలేదని అధికారులు తెలిపారు. ఆయా లారీలకు సంబంధించి గ్రానైట్ సంస్థలకు నోటీసులు జారీ చేశారు. లారీలో ఎంత విలువైన గ్రానైట్ ఉందో అంతే మొత్తంలో పన్ను చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. గ్రానైట్ విలువపై 18 శాతం పన్ను చెల్లిస్తామని రాజకీయ నేతలతో అధికారులపై అక్రమార్కులు ఒత్తిడి తెస్తున్నారు. అయితే గ్రానైట్ విలువ ఆధారంగా పన్ను చెల్లించాల్సిందేనని అధికారులు తేల్చి చెబుతున్నారు. లేకుంటే స్వాధీనం చేసుకున్న గ్రానైట్‌ను వేలం ద్వారా విక్రయిస్తామంటున్నారు.



## అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్?

ప్రకాశం జిల్లాలో కలిపేందుకు మార్గం సుగమం

అద్దంకి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానున్నది. ఒంగోలు కేంద్రంగా ఉండే ప్రకాశం జిల్లా పరిధిలోకి అద్దంకి చేర్పు ఖాయంగా భావిస్తున్నారు. జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దుల మార్పులు, చేర్పులు కోసం అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ఉన్నత స్థాయిలో తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో ఎట్టి పరిస్థితుల్లో డివిజన్ కేంద్రంగా అద్దంకి మారుతుందని నియోజకవర్గ ప్రజల్లో బలంగా ఉంది.



## పేరుకే.. అగ్రి టెస్టింగ్ ల్యాబ్

### రెండేళ్లుగా నిరుపయోగంగా కేంద్రం

వేమూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అగ్రి టెస్టింగ్ ల్యాబ్ అందుబాటులోకి వచ్చినా రైతులకు రెండేళ్లుగా సేవలు అందడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ కేంద్రంలో టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. దానిని 2023లో ప్రారంభించారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి వ్యవసాయ సంబంధ పరీక్షలకు వెళ్లే అవసరం లేకుండా సమీపంలోనే ఆ సేవలు పొందవచ్చని రైతులు ఆశించారు. అయితే ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చరల్ ల్యాబ్ నిరుపయోగంగా ఉండటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ల్యాబ్‌లో కేవలం ఫర్టిలైజర్, సీడ్‌కు సంబంధించిన పరీక్షలు మాత్రమే నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. ఫర్టిలైజర్ పరీక్ష పరికరాలు ఉన్నా రెండేళ్ల నుంచి నీటి సరఫరా లేని కారణంగా సంబంధిత పరీక్షలు చేయడం లేదు. రెండేళ్లలో కేవలం 160 మాత్రమే సీడ్ పరీక్షలు చేశారు. ఈ ప్రాంతానికి సంబంధించిన పరీక్షలు మాత్రం వేరే ప్రాంతంలోని ల్యాబ్‌లకు పంపుతుండటంతో జాప్యం జరుగుతోంది. మట్టి పరీక్షల విషయానికి వస్తే గతంలో లాగానే బాపట్ల, గుంటూరు పరీక్ష కేంద్రాలకు పంపుతున్నారు. ల్యాబ్‌లో తగిన పరికరాలతో పాటు సిబ్బందిని నియామకంపై అధికారులు, ప్రజా ప్రతినిధులు శ్రద్ధ చూపాలని రైతులు కోరుతున్నారు.

### జనసురక్ష పథకంతో
# ఆర్థిక భద్రత

బాపట్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జనసురక్ష పథకం కుటుంబానికి ఆర్థికపరమైన భద్రత ఇస్తుందని ఎల్‌డీఎం శివకృష్ణ తెలిపారు. మండలంలోని బేతపూడి గ్రామంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 నుంచి 70 ఏళ్ల వయస్సు కలిగిన వారికి పీఎమ్ఎస్‌బీవై పథకం రూ.20తో ప్రమాద బీమా అందిస్తుందన్నారు. 18 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన వారికి రూ.436కి సహజ మరణం బీమా అందుతుందన్నారు. 18 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన వారికి అటల్‌పెన్షన్ యోజన అందుతుందన్నారు. ఈ పథకంలో 60 ఏళ్లు దాటిన తర్వాత పెన్షన్ రూపంలో నగదు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెదుళ్లపల్లి యూనియన్ బ్యాంక్ మేనేజర్ విజయ్‌సందీప్‌కుమార్, ఉదయం, బీసీ రత్నం, మహేంద్ర, మమత తదితరులు పాల్గొన్నారు.




ఖాతాదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎల్‌డీఎం శివకృష్ణ

### ఔచిత్యం పాటించే కవిత్వం పాఠకులను
# రంజింప చేస్తుంది

### రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ



బాపట్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఔచిత్యం పాటించే కవిత్వం ఏదైనా ప్రేక్షకులను, పాఠకులను రంజింప చేస్తుందని సాహితీవేత్త, సినీ గేయ రచయత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ తెలిపారు. మండలంలోని వెదుళ్లపల్లిలో గురువారం జరిగిన వివేకా సర్వీస్ సొసైటీ, ధృతి సాహిత్య సాంస్కృతిక సామాజిక సంస్థ ఆధ్వర్యంలో నెలనెల నందివర్ధనం 103వ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎలాంటి సాహిత్యానికైనా, ఎంతటి మహాతత్వానికైనా, గొప్పకవిత్వానికైనా ఔచిత్యభంగం కలగకూడదన్నారు. సాహిత్యం ప్రజల చెవిని, హృదయాన్ని తాకేవిధంగా మంచి ఎత్తుగడలతో ముందుకు సాగాలన్నారు. శ్రమశక్తి గొప్పతనాన్ని తెలియజేసే కవిత్వం, మానవజీవన సౌందర్యాన్ని, సంబంధాల గొప్పతనాన్ని, ప్రత్యేకతను తెలియజేసే కవిత్వం తన నుంచి వచ్చాయన్నారు. సినీగేయ సాహిత్యం అనే శీర్షికతో నెలనెల నందివర్ధనం కార్యక్రమాల ప్రసంగ పాఠాల సంచికను డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివేకాసర్వీస్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వి. నాగరాజు, అంబటి మురళికృష్ణ, ధృతి అధ్యక్షుడు కళ్లం హరినాధరెడ్డి, కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# కట్టడి మరిచి వసూళ్లు

### ఆదాయ వనరుగా బెల్ట్ షాపులు
### కీలక అధికారి కనుసన్నల్లో ఇష్టారాజ్యం
### వసూళ్లే లక్ష్యంగా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

అద్దంకి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రాంతంలో వేళలతో నిమిత్తం లేకుండా ఎక్కడంటే అక్కడ మద్యం అందుబాటులో ఉంటోంది. అక్రమ విక్రయాలను కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ విభాగం దానిని మరిచి కాసుల వసూళ్లే లక్ష్యంగా పని చేస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బెల్ట్ షాపులు నియంత్రించాల్సిన అధికారులే ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ కారణంగానే గతంలో కంటే మూడింతలుగా బెల్ట్ షాపులు వెలిశాయి. పెరిగిన బెల్ట్ షాపులను అధికారులు ఆదాయవనరుగా మలుచుకున్నారు. అద్దంకి ఎక్సైజ్ సీఐ భవాని రెండున్నర నెలల క్రితం దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. దీంతో గతంలో అన్నీ తానై వ్యవహరించిన అధికారికి అడ్డు అదుపు లేకుండా పోయింది. అద్దంకి మున్సిపాలిటీతో పాటు 100కు పైగా పంచాయతీల్లో 34 అధికార మద్యం షాపులు ఉండగా అనధికారికంగా 500కుపైగానే బెల్ట్‌షాపులు ఉన్నాయి. నియోజకవర్గం పరిధిలోని ప్రతి గ్రామంలో 5 నుంచి 10 వరకు బెల్ట్ షాపులు ఉన్నాయి. వీటికి అదనంగా నామ్ రోడ్డు, జాతీయ రహదారి వెంబడి దాబాల్లోనూ ఏనిటైం మద్యం అందుబాటులో ఉంటుంది. ఒక్కో బెల్ట్ షాపు నుంచి రూ.10 వేల నుంచి 20 వేల వరకు నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. దాబాల నిర్వాహకులు నెలకు రూ.25 వేలకుపైగా ముట్టచెప్తున్నట్లు సమాచారం. నియంత్రించాల్సిన అధికారే వసూళ్లలో ఉండటంతో మద్యం వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం అధికారం మొత్తం చేజిక్కడంతో అడ్డుఅదుపు లేకుండా వసూళ్ల పర్వం సాగిస్తున్న ట్లు విమర్శలు వస్తున్నాయి. బెల్ట్ షాపుల్లో బార్ అండ్ రెస్టారెంట్లను మించి సకల వసతులు కల్పిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బెల్ట్ షాపులకు అడ్డుకట్ట పడేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.




అద్దంకిలోని ఎక్సైజ్ స్టేషన్



జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ విభాగాలను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ దామోదర్ తదితరులు

## పోలీసు సేవలు ప్రజలకు చేరువ కావాలి

- గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి
- సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి
- జిల్లా పోలీసు కార్యాలయంలో వార్షిక తనిఖీలు

ఒంగోలు క్రైం,జూలై24(ఆంధ్రజ్యోతి): పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ విభాగాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకొని విధులు నిర్వహించి ప్రజలకు పోలీసు సేవలను చేరువ చేయాలని కోరారు. నూతన సాంకేతిక పద్ధతులపై పోలీసులకు నిరంతరం అవగాహన కలిగించేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు. డిజిటలైజేషన్ ద్వారా పారదర్శకత, సమర్థత పెరిగి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అదే విధంగా సిబ్బందికి సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పోలీసుల పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎస్పీ ఏఆర్ దామోదర్, అదనపు ఎస్పీ కే.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏవో రామ్మోహనరావు, సీఐలు రాఘవేంద్ర, దేవప్రభాకర్, సూర్యనారాయణ, దుర్గా ప్రసాద్ ,విజయకృష్ణ, మేడా శ్రీనివాసరావు, నాగరాజు, శ్రీకాంత్ బాబు, సుధాకర్, షమీముల్లా, సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో చినఓబులేషు

## రెండు ఓట్లు ఉంటే నిబంధనల ప్రకారం నేరం

- డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలని, రెండో ఓటు కలిగి ఉంటే నేరమని డీఆర్వో చిన ఓబులేషు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేసి ఓట్లు కలిగిన వారు వెంటనే ఒక ఓటును రద్దు చేసుకోవాలన్నారు. నివాసం ఉన్న చోట మాత్రమే ఓటును కలిగి ఉండాలని చెప్పారు. ఎవరైనా రెండో ఓటును రద్దు చేసుకోకుంటే కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నేరంగా పరిగణిస్తారని స్పష్టం చేశారు. అటువంటి వారికి సెక్షన్31 పీఆర్ఎ1950 ప్రకారం ఒక ఏడాది జైలు శిక్ష లేదా జరిమానా ఉంటుందని తెలిపారు. అలాగే ఓటుకు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని కోరారు. 18 ఏళ్ళు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు పొందాలని చెప్పారు. ఒంగోలు నగరంలో పాటు జిల్లాలోని వివిధ పట్టణాల్లో డోరు నెంబర్లు లేకపోతే వెంటనే వేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన పలు అంశాలపై డీఆర్వో స్పందిస్తూ వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, ఎం.కేశవర్ధనరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్.జాన్సన్, ఎ.కుమార్, ఎస్.వరకుమార్, ఎంవీ.సత్యనారాయణ, కె.రవీంద్రారెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, కార్పొరేషన్ డీపీవో బాబురావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంకటరావు, క్రాంతికుమార్, రసూల్, గుర్రం సత్యనారాయణ, రఘురాం, సుదర్శన్, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సాగుపై రైతుల్లో సందిగ్ధం

- సీజన్ మొదలైనా ముందుకురాని వైనం
- గత ఏడాది పంటలకు దక్కని గిట్టుబాటు ధరలు
- ఇంకా అమ్ముడుపోని పొగాకు
- ఆశాజనకంగా లేని శనగ దిగుబడి
- బీడులుగా సాగు భూములు

పర్చూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు పండిన పంటలు కొనే దిక్కులేని పరిస్థితి. మరో వైపు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఈ ఖరీఫ్‌లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. జూన్ - జూలై నెలల్లో ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుంటాయి. అయితే ఈ ఏడాది పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఎక్కడా సాగు ఊసే కనిపించడం లేదు. పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ ఖరీఫ్‌లో కూరగాయల తోటలు మినహా పైర్లు సాగుచేసిన దాఖలాలు కనిపిం లేవు. దీనికి కారణం పొగాకు అమ్ముడుపోకపోవడం ఒకటైతే, ధరలు లేక మిర్చి కూడా కొనేవారు లేకపోవడంతో రెండోది. రైతుల వద్దే నిల్వలు పేరుకుపోయాయి. మరో వైపు గతేడాది శనగల దిగుబడులు ఆశించిన మేర లేకపోవడంతో శనగ సాగు అంత ఆశాజనకంగా లేదు. దీంతో ప్రస్తుతం రైతులు మేడిపట్టాలంటే వెనకడుగు వేస్తున్నారు. మరో వైపు రైతాంగాన్ని అప్పులు సతమతం చేస్తున్నాయి. బయట తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక తల్లడిల్లిపోతున్నారు. దీంతో సేద్యపు పనులు ప్రారంభించకపోవడంతో పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. ఇక పొలాలు కౌలుకు చేసేందుకు కౌలుదారులు కూడా ముందుకు రావడం లేదు. దీంతో యజమానులే దుక్కులు దున్ని ఎవరో ఒకరు కౌలుకు తీసుకోక పోతారా..? అని ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత స్థితిలో ఖరీఫ్ సంగతేమో కానీ, రబీలోనైనా ఏ పంటను సాగుచేయాలో రైతులకు అర్థంకాని పరిస్థితి ఉంది. అయితే వ్యవసాయ అధికారులు మాత్రం రైతులను ఖరీఫ్ సాగుకు సన్నద్ధం చేసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

### భూములను ఖాళీగా ఉంచొద్దు

ఖరీఫ్‌లో వ్యవసాయ భూములను సాగుచేయకుండా ఖాళీగా ఉంచవద్దని పర్చూరు ఏడీఏ ప్రవీణ అన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గుచూపాలన్నారు. ఒకే పంటను అధిక విస్తీర్ణంలో సాగుచేయకుండా వివిధ రకాల పంటలను సాగుచేసుకోవాలన్నారు. నీటివసతి ఉన్న రైతులు మొక్కజొన్న, జొన్న వంటి పంటలను సాగుచేసుకోవాలన్నారు. పొగాకును ఎట్టి పరిస్థితుల్లో సాగుచేయవద్దన్నారు.



పర్చూరులో సాగు చేయక పోవటంతో చిల్లచెట్లతో బీడుగా మారిన వ్యవసాయ భూమి

## రహదారికి సరిహద్దు ఇక్కట్లు

- తిమ్మాయపాలెం- మారెళ్ల రోడ్డు రెండు జిల్లాల సరిహద్దు కావడమే శాపం
- కనీస మరమ్మతులు కూడా చేయని వైనం



రామాయపాలెం సమీపంలో గోతులమయంగా ఉన్న తిమ్మాయపాలెం-మారెళ్ల రోడ్డు

అద్దంకి, జూలై24(ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాల సరిహద్దు కావడంతో తిమ్మాయపాలెం- మారెళ్ల గ్రామాల మధ్య రహదారి అభివృద్ధికి ఆటకంగా మారింది. ఈ రోడ్డుకు కనీసం మరమ్మతు కూడా లేకపోవడంతో రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు. బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి మండలం తిమ్మాయపాలెం నుంచి ముండ్లమూరు మండలం మారెళ్ల మీదుగా మక్కెనవారిపాలెం వరకు ఆర్అండ్‌బీ రోడ్డు ఉంది. ఈ రోడ్డును సుమారు రెండు దశాబ్దాల క్రితం బీటీగా అభివృద్ధి చేశారు. అయితే జిల్లాల విభజన తరువాత అద్దంకి మండల పరిధిలోని రోడ్డు బాపట్ల పరిధిలోకి, ముండ్లమూరు మండలం పరిధిలోని రోడ్డు ప్రకాశం జిల్లా పరిధిలోకి వెళ్లాయి. ఈ నేపథ్యంలో రోడ్డు మరమ్మతులకు ప్రకాశం జిల్లా పరిధి వరకు కేటాయించారు. దీంతో అంతవరకు మాత్రమే మరమ్మతులు చేపట్టారు. బాపట్ల జిల్లా పరిధిలోని రోడ్డును పూర్తిగా గాలికి వదిలివేశారు. దీంతో బాపట్ల జిల్లా పరిధిలోని సుమారు 5 కి.మీ దూరంలోని రోడ్డు పూర్తిగా శిథిలమై కొన్ని చోట్ల తారు రోడ్డు ఆనవాళ్లు కూడా కోల్పోయింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పూర్తిగా దెబ్బతిని గోతులమయం కావడంతో అద్దంకి నుంచి తిమ్మాయపాలెం, రామాయపాలెం, మారెళ్ల మీదుగా మక్కెనవారిపాలెం నడిపే బస్సును రూటు మార్చి శంకరాపురం మీదుగా నడుపుతున్నారు. ఇటీవల మంత్రి రవికుమార్ రామాయపాలెం పర్యటనకు వెళ్లినప్పుడు గ్రామస్థులు రోడ్డు దుస్థితిని వివరించారు. వెంటనే పొదిలి డీఈతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే రోడ్డు మరమ్మతులకు అంచనాలు తయారు చేయాలని కోరారు.



శింగరకొండపాలెం సమీపంలో అద్దంకి కొండ వద్ద స్థలాల కేటాయింపు హద్దులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, టౌన్‌సర్వేయర్ శ్రీనివాసరావు

## మినీ బైపాస్ నిర్మాణంపై కసరత్తు

- కాలువ కట్టలపై నివాసం ఉండే పేదలకు స్థలాల కేటాయింపునకు కసరత్తు

అద్దంకి, జూలై24(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి కసరత్తు వేగవంతమైంది. రోడ్డు నిర్మాణానికి కాలువకట్టలపై ఏర్పాటు చేసుకున్న నిర్మాణాలే ప్రధాన అడ్డంకిగా మారాయి. దీంతో ఆయా కుటుంబాలకు ఇళ్లస్థలాల కేటాయింపు పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 100 కుటుంబాలు ఉండగా ఇప్పటికే బొమ్మనంపాడు రోడ్డులోని లే-అవుట్‌లో 36 మందికి గతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఉండడంతో మిగిలిన సుమారు 70 మందికి శింగరకొండపాలెం సమీపంలో అద్దంకికొండ వద్ద 3 ఎకరాల భూమిని కేటాయించారు. ఇప్పటికే ఆ ప్రాంతం మొత్తం ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేసి చదును చేశారు. గురువారం స్థలం చుట్టూ హద్దులు నిర్ధారించారు. శుక్రవారం నుంచి ప్లాట్ల విభజన చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. హద్దురాళ్ల ఏర్పాటు పనులను కమిషనర్ రవీంద్ర, పట్టణ సర్వేయర్ శ్రీనివాసరావు, టీపీవో లక్ష్మీ తదితరులు పరిశీలించారు. రోడ్లు, బోర్లు ఏర్పాటు, విద్యుత్ వసతి తదితర మౌలిక వసతుల కల్పన పనులు వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇప్పటికే రేణింగవరం రోడ్డు నుంచి నామ్ రోడ్డు వరకు అద్దంకి మేజర్ కాలువ రెండు కట్టలను సీసీ రోడ్లుగా మార్చడం, సైడ్ డ్రైన్ల నిర్మాణం తదితర పనులకు రూ.15 కోట్లు మంజూరు కాగా, టెండర్లు పిలిచేందుకు రంగంసిద్ధం చేస్తున్నారు. దీంతో త్వరలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం కానున్నాయి.

## వైసీపీ నేత బరితెగింపు

- రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు పీకివేత
- ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటిన నాయకుడు

తర్లుపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో బరితెగించి రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి మొక్కలు నాటాడు. ప్రభుత్వ భూమి హంపట్ శీర్షికతో ఈనెల 19న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి 20న జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈమేరకు సర్వే నెంబర్ 132-3లో 1.55ఎకరాలు, 129-11లో 52 సెంట్ల ప్రభుత్వ భూమిగా సర్వే చేసి గుర్తించి మంగళవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. దానిని లెక్కచేయని వైసీపీ నేత బోర్డును పీకేసి బుధవారం జామాయిల్ మొక్కలను సాగు చేశారు. పలువురు గ్రామస్థులు అడ్డుకొనగా వారిని భయభ్రాంతులకు గురిచేయడంలో వారు వెనుతిరిగి వెళ్లారు. ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటుతున్న విషయాన్ని గ్రామస్థులు తహసీల్దార్ కేకే కిషోర్ కుమార్, వీఆర్‌వో షరీఫ్‌కు సమాచారం ఇచ్చారు. దాంతో ఆ భూమిని పరిశీలించగా అప్పటికే మొక్కలు నాటినట్లు గుర్తించారు. రెవెన్యూ అధికారులు మౌనంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ స్థాయిలో ముడుపులు తీసుకుని రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. 2.7ఎకరాలను వైసీపీ నేత రూ.కోటికి ఓ ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగికి విక్రయించి సొమ్ము చేసుకున్నారు. అనంతరం బ్యాంకు ఉద్యోగితో జామాయిల్ మొక్కలు నాటించారు. వైసీపీ ప్రభుత్వంలో వందలాది ఎకరాలు ఆక్రమించుకున్న ఆ నాయకుల ఆగడాలు ప్రస్తుత ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికీ రెవెన్యూ అధికారుల అండదండలు వైసీపీ నాయకులు ఉండడంతో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటిన నాయకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ప్రభుత్వ భూమిలో సాగు చేసిన మొక్కలు

### మొక్కలను పీకివేపిస్తా

కలుజువ్వలపాడు ఇలాకాలో ప్రభుత్వ భూమిలో జామాయిల్ మొక్కలు నాటిన మాట వాస్తవమే. గురువారం వెళ్లి ప్రభుత్వ భూమిని పరిశీలించగా జామాయిల్ మొక్కలు నాటి ఉన్నాయి. వేసిన మొక్కలను శుక్రవారం పీకేసి మరలా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తాం.

- కేకే కిశోర్ కుమార్, తహసీల్దార్



ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న పోలీస్ ఔట్‌పోస్ట్

## ఆర్టీసీ పోలీస్ ఔట్‌పోస్ట్‌లో ఆలకించే వారేరీ ?

- బ్యాగు మారిపోవడంతో ఇబ్బందిపడిన ప్రయాణికుడు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్‌పోస్ట్‌లో ప్రయాణికుల గోడు ఆలకించేవారు కరువయ్యారు. ప్రయాణ సమయంలో ఇబ్బందులు ఎదురైనపుడు సహకారం అందించాల్సిన పోలీసులు ఔట్‌పోస్‌లో సమాధానం చెప్పడం లేదని బాధితులు తెలిపారు. గురువారం గుంటూరు నుంచి ఒంగోలుకు వచ్చిన ఓ ప్రయాణికుడు బస్సు దిగే సమయంలో తన బ్యాగు వేరే ప్రయాణికుడు తీసుకెళ్ళగా, అతని బ్యాగు వదిలేసి వెళ్ళారు. అయితే ఆ బ్యాగు తనది కాదని, తనలాగే బ్యాగు మరిచిపోయే వ్యక్తి ఇబ్బంది పడకూడదని పోలీసులు స్వాధీనం చేసుకోవాలని కోరారు. అయితే తనను సుమారు గంటసేపు ఎవరూ పట్టించుకోలేదని బాధిత ప్రయాణికుడు వాపోయారు. దీంతో ఆర్టీసీ ట్రాఫిక్ పోలీసులను సంప్రదించగా, ఆ పని తమది కాదని, ఔట్‌పోస్ట్ వారే చూసుకోవాలని సమాధానమిచ్చారు. దీంతో చేసేదేమి లేక ఆర్టీసీ కంట్రోల్ రూమ్ అధికారులను సంప్రందించగా, తమకు సంబంధం లేదని, నువ్వే తీసుకెళ్ళమని సమాధానం ఇవ్వడంతో బిక్కమొహం వేసిన బాధితుడు చేసేదేమి లేక బ్యాగుతో ఇంటిబాట పట్టారు.

## ఎయిడెడ్‌లో దోపిడీ

- అర్హత లేని వారికి ప్రభుత్వ రాయితీలు
- ప్రభుత్వ ఖజానాకు కన్నం
- ఒకే డైస్‌కోడ్‌తో మోసం
- ఉన్నతాధికారుల దృష్టికి వ్యవహారం

ఒంగోలు విద్య, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొన్ని ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో దోపిడీ ఎక్కువైంది. అర్హత లేని విద్యార్థులకు కూడా ప్రభుత్వం ఇచ్చే రాయితీలను వర్తింపజేస్తూ యాజమాన్యాలు ఖజానాకు కన్నం వేస్తున్నారు. పాఠశాలకు ఒకే డైస్ కోడ్‌తో మోసం చేస్తున్నారు. జిల్లాలోని సుమారు 15 పాఠశాలల్లో ఈ దందా ఏళ్లతరబడి యథేచ్ఛగా సాగుతుంది. ఈ పాఠశాలల వైపు కన్నెత్తి చూసేందుకు క్షేత్రస్థాయిలోని అధికారులు జంకుతున్నారు. జిల్లాలోని ఒక ఎయిడెడ్ పాఠశాల విషయంలో హైకోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన పాఠశాల విద్య డైరెక్టర్ దృష్టికి ఈ వ్యవహారం రావడంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అధికారుల ఉదాసీనతను అలుసుగా తీసుకున్న కొన్ని ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా దోపిడీని కొనసాగిస్తున్నారు. అధికారులెవ్వరు వారి జోలికి పోయేందుకు సాహసించడం లేదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు విద్యాబుద్ధులు నేర్పేందుకు సేవాతత్పరతతో కొన్ని యాజమాన్యాలు ముందుకు వచ్చి పాఠశాలలను ప్రారంభించాయి. తర్వాత వాటికి ప్రభుత్వం గ్రాంటు ఇన్ ఎయిడెడ్ ఇచ్చి టీచర్లకు జీతాలు చెల్లించడంతోపాటు పాఠశాలల నిర్వహణకు నిధులు ఇచ్చేది. కాలక్రమేణ సేవాలక్ష్యంతో ప్రారంభమైన పాఠశాలలు కొందరు స్వార్థపరులైన యాజమాన్యాల నిర్వాకంతో వ్యాపార సంస్థలుగా మారిపోయాయి. ధనార్జనకు ఎయిడెడ్‌లు ఒక ఆయుధంగా మారాయి.

### ఒకే డైస్ కోడ్‌తో మోసం

కొన్ని ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు ఒకే డైస్‌కోడ్‌తో మోసానికి పాల్పడుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక గుర్తింపునకు ప్రభుత్వం డైస్‌కోడ్‌ను కేటాయిస్తుంది. ఎయిడెడ్ పాఠశాలలను తెలుగు మీడియంలో నిర్వహించుకునేందుకు ప్రభుత్వం మొదట డైస్‌కోడ్‌ను కేటాయించింది. అయితే కాలక్రమేణా తెలుగు మీడియం పాఠశాలలకు ఆదరణ తగ్గుతుండటంతో వాటి ఆవరణలోనే ఇంగ్లీషు మీడియం ప్రారంభించి విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడం ప్రారంభించారు. నిబంధనల ప్రకారం ఇంగ్లీషు మీడియంకు ప్రత్యేక డైస్ కోడ్ తీసుకోవాల్సి ఉండగా అవేమీ లేకుండా పాత డైస్ కోడ్‌తోనే పాఠశాలలు నిర్వహిస్తూ వ్యాపారం చేస్తున్నారు.

### అనర్హులకు ప్రభుత్వ రాయితీలు

పాఠశాలల్లో అనర్హులైన విద్యార్థులకు కూడా ప్రభుత్వ రాయితీలు వర్తింపజేస్తూ ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతున్నారు. ఉదాహరణకు ఎయిడెడ్ యూపీ స్కూళ్ళకు 1 నుంచి 7వతరగతి వరకు మాత్రమే ప్రభుత్వ గుర్తింపు, గ్రాంటు ఇన్ ఎయిడెడ్ ఉంటుంది. అయితే ఆ పాఠశాలల్లో అన్ ఎయిడెడ్ సెక్షన్లుగా 8, 9, 10 తరగతులు నిర్వహిస్తూ ఆ విద్యార్థులకు ఎయిడెడ్ సెక్షన్లతో సమానంగా వారానికి మధ్యాహ్న భోజనం, విద్యా కిట్లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బూట్లు. సాక్సులు ఇస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో కూడా అవకతవకలు, అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఇంగ్లీషు మీడియం విద్యార్థులను కూడా ఎయిడెడ్ సెక్షన్లలో పేర్లు నమోదు చేసి తమకు అదనంగా టీచర్ పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

### పాఠశాల విద్య డైరెక్టర్ ఆగ్రహం

జిల్లాలోని కొన్ని ఎయిడెడ్ పాఠశాలల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై పాఠశాల విద్యా డైరెక్టర్ విజయరామరాజు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. జిల్లాలోని ఒక ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టుకు హాజరయ్యేందుకు డైరెక్టర్ వచ్చారు. ఆ సమయంలో జిల్లాలోని కొన్ని ఎయిడెడ్ పాఠశాలల్లో జరుగుతున్న అవినీతి భాగోతం ఆయన దృష్టికి వచ్చింది. దీంతో అక్కడే ఉన్న పశ్చిమ ప్రాంత ఎంఈవో ఒకరిని మీరు ఎయిడెడ్ పాఠశాలను విజిట్ చేస్తున్నారా.. తనిఖీలు నిర్వహిస్తున్నారా? అంటూ ప్రశ్నించినట్లు తెలిసింది.

ఆ ఎంఈవో నీళ్ళు నమలడంతో డైరెక్టర్ మండిపడ్డారు. దీంతో ఆ ఎంఈవో కొందరు యాజమాన్యాలు తమను పాఠశాలల్లోకి రానివ్వరని, వారు చెప్పిన వివరాలు రాసుకొని వస్తామని చెప్పడంతో డైరెక్టర్ ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. వెంటనే అన్ని పాఠశాలలను తనిఖీ చేయాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. ఆర్‌జేడీలను కూడా పాఠశాలలను తనిఖీ చేసి అవకతవకలను అరికట్టాలని డైరెక్టర్ ఆదేశించారు.

### 27న ఎయిడెడ్ పోస్టుకు పరీక్ష

ఒంగోలు విద్య, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండలం వల్లాపల్లిలోని సీఏ అప్పర్ ప్రైమరీ ఎయిడెడ్ పాఠశాలలో ఖాళీగా ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టు భర్తీ చేసేందుకు ఈనెల 27న పరీక్ష జరుగుతుందని డీఈవో కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టును భర్తీ చేసేందుకు పాఠశాల విద్యా డైరెక్టర్ అనుమతి ఇచ్చారు. ఈక్రమంలో దరఖాస్తులు ఆహ్వానించి అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తున్నారు. నర్సరావుపేటలోని నర్సరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలోని బ్లాక్4లో రెండుసెషన్లలో పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9.30నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2నుంచి 4 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాట ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పరీక్షా కేంద్రానికి గంటముందుగా చేరుకోవాలన్నారు.

## ఒంగోలులో ఆటో మ్యూటేషన్ అమలు

- కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలో ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు మ్యూటేషన్ విధానం ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొస్తుందని కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానం ద్వారా పట్టణ ప్రాంతంలో భూములు, భవనాలు రిజిస్ట్రేషన్ అనంతరం ఆస్తి వివరాలు ఆటోమేటిక్‌గా సంబంధిత మునిసిపల్ కార్పొరేషన్ రికార్డులలో పేరు మార్పు అవుతాయని పేర్కొన్నారు. మునిసిపల్ శాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సమన్వయంతో ఈ విధానం అమలు కానుందని తెలిపారు. దీనివల్ల రిజిస్ట్రేషన్ తర్వాత ఆస్తిని మునిసిపల్ రికార్డుల్లో వేరుగా నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉండదన్నారు. ఆస్తి వివరాలు, పన్నుల నమోదు ఆటోమేటిక్‌గా చేరుతాయని తెలిపారు. పౌరులకు సమయం ఆదాతోపాటు అవినీతి రహిత సేవలు లభిస్తాయని, డిజిటల్ డేటా ఆధారంగా పారదర్శకతతో కూడిన సేవలు అందుబాటులో ఉంటాయిన కమిషనర్ పేర్కొన్నారు. పాత ఇంటి నెంబర్, ఆస్తి పన్ను, చెల్లించిన రశీదు, మార్పులు మ్యూటేషన్ లబ్ధి చేకూరుతుందని, ప్రజల తమ ఇంటి అసెస్‌మెంట్ వివరాలను సబ్‌రిజిస్ట్రార్ వారికి సరైన విధంగా అందించాలని ఆయన కోరారు.

### 17,18 తేదీల్లో రాష్ట్ర మహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ఏడవ మహాసభలు ఒంగోలులో వచ్చేనెల 17,18 తేదీల్లో జరుగుతాయని సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ.అంజనేయులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముందుగా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఒంగోలులో రెండు రోజుల పాటు జరిగే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతిరావు, పూసపాటి వెంకట్రావు, బుర్రి ఆంజనేయులు, కె.జయరాం పాల్గొన్నారు.

## మహిళపై ఎంపీడీవో లైంగిక వేధింపులు

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు , కేసు నమోదు

తర్లుపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న మహిళపై తర్లుపాడు ఎంపీడీవో ఎంకే చక్రపాణి ప్రసాద్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. బుధవారం సాయంత్రం మహిళను తన చాంబర్‌లోకి పిలుచుకుని బాత్‌రూమ్ శుభ్రంగా క్లీన్ చేయాలని చెప్పాడు. ఆమె క్లీన్ చేస్తుండగా ఎంపీడీవో బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఆ మహిళను చేయి పట్టుకుని బలవంతం చేసేందుకు యత్నించాడు. దీంతో ఆ మహిళ పెనుగులాడి అతడిబారి నుంచి కేకలు వేస్తూ బయటకు వచ్చింది. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు అక్కడికి చేరడంతో ఆ మహిళ బోరున విలపిస్తూ వారికి చెప్పింది. గతంలో కూడా ఎంపీడీవో తన చాంబర్‌లో పని ఉందని పిలిపించుకుని చేయిపట్టుకొని బలవంతం చేయబోయినట్లు ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కాగా ఎంపీడీవో వెంటనే రెండు రోజులపాటు సెలవు చీటీ రాసి ఈవోఆర్డీ సుకుమార్‌కు వాట్సాప్ చేసి వెళ్లిపోయారు. ఎంపీడీవో లైంగిక వేధింపులకు పాల్పడడంతో మహిళ గురువారం సాయంత్రం తర్లుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ బ్రహ్మానాయుడుకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విచారణ చేసి అనంతరం ఎంపీడీవోపై లైంగిక వేధంపుల కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# పొగాకు నిల్వలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం

## ఆర్‌డీవో చంద్రశేఖర్ నాయుడు

పంగులూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద నిల్వ ఉన్న నల్లబర్లీ పొగాకును పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చీరాల ఆర్‌డీవో చంద్రశేఖర్ నాయుడు అన్నారు. మండలంలోని తూర్పుకొప్పెరపాడులోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు గురువారం సాయంత్రం పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పంగులూరు రెవెన్యూ కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. పొగాకు కొనుగోళ్ల విషయమై స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నల్లబర్లీ కొనుగోళ్ల విషయంలో రైతులు, అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేపడతామన్నారు. తూర్పు కొప్పెరపాడులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద గోడౌన్ మూడురోజులకే నిండిందన్నారు. దీంతో శుక్రవారం నుంచి కొనుగోలు కేంద్రాన్ని అద్దంకి మార్కెట్ యార్డ్‌కు మార్చుతున్నట్లు ఆర్డీవో తెలిపారు. రైతులు తాము తరలించే పొగాకు బేళ్లకు సంబంధించి రవాణా ఖర్చులు చెల్లించే విషయం ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా నల్లబర్లీ పొగాకు మొత్తం ప్రభుత్వం తప్పక కొనుగోలు చేస్తుందన్నారు. అనంతరం జాతీయ రహదారి పక్కన


చినగంజాంలో పొగాకు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు పరిశీలించారు. ప్రభుత్వ భూమి ఉన్నచోట తగు సమాచారంతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సింగారావును ఆదేశించారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్.ఐ.శ్వేత, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : రైతులు వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకును వేగంగా కొనుగోలు చేయాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు అధికారులను ఆదేశించారు. ఇంకొల్లు మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న పొగాకు కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. చివరి ఆకు వరకు పొగాకును పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలన్నారు. కొనుగోళ్లలో జాప్యం లేకుండా వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటివరకు 32.5 టన్నుల పొగాకును కొనుగోలు చేశామన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఆయన వెంట తహసీల్దారు శ్రీనివాస్, ఏవో మీరమ్మ, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.


పొగాకు గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు

**పొగాకు కొనుగోలు కేంద్రం పరిశీలన**

చినగంజాం : చినగంజాంలోని పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్‌లో నిర్వహిస్తున్న నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్నా, మార్క్‌ఫెడ్ జిల్లా డీ.ఎం. కరుణశ్రీలు గురువారం ఆకస్మికంగా సందర్శించి, పొగాకు కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. తగిన నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం పరిశీలించి కొనుగోళ్లు సజావుగా జరిగేట్లు చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తేమ శాతం 18-20 మధ్య ఉండాలని, పైఆకు, మధ్యస్థ ఆకులు గ్రేడ్ చేయాలని సూచించారు. 20 క్వింటాళ్ల లోపు ఉన్న చిన్న, సన్న కారు రైతుల ఉత్పత్తులను ముందుగా కొనుగోలు చేయాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 49 మంది రైతుల దగ్గర 900 క్వింటాల పొగాకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల వద్ద ఉన్న చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామన్నారు. రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, మార్క్‌ఫెడ్ మేనేజర్ వెంకట్, ఏవో ఆర్.చంద్రశేఖర్, చింతగుంపల్లె పీఏసీఎస్ సీఈవో శేఖర్, టీడీపీ నాయకులు కొండ్రగుంట శ్రీహరి, కొనుగోలు కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# టౌన్‌హాల్ నిర్మాణానికి స్థలం పరిశీలన

అద్దంకి,జూలై24(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ఎట్టకేలకు టౌన్‌హాల్ నిర్మాణానికి అడుగులు ముందుకు పడుతున్నాయి. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విజ్ఞప్తి మేరకు ఆదాని కంపెనీ సహకారంతో సుమారు రూ.3.5 కోట్లతో భవానిసెంటర్‌లోని పాత రీడింగ్ రూమ్ స్థలంలో టౌన్ హాల్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆదానీ కంపెనీ ప్రతినిధులు స్థలాన్ని పరిశీలించారు. సుమారు 17 సెంట్ల స్థలంలో టౌన్‌హాల్ నిర్మాణం చేయనున్నారు. దీంతో ఇప్పటి వరకు నిరుపయోగంగా ఉన్న పాత రీడింగ్ స్థలం వినియోగం లోకి రావడంతో పాటు పలు రకాల కార్యక్రమాలకు టౌన్‌హాల్ అందుబాటులోకి రానుంది. ప్రధానంగా పౌరాణిక కళాకారులకు పుట్టినిల్లుగా ఉన్న అద్దంకిలో ప్రదర్శనలకు సరైన వేదిక లేక ఇబ్బంది పడుతున్నారు. అదేసమయంలో స్వచ్ఛంధ సంస్థలు, సేవాసంస్థలు, సాంస్కృతిక సంస్థలు కూడా కార్యక్రమాలు ఏదో ఒక ప్రాంతంలో నిర్వహించుకోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో టౌన్‌హాల్ నిర్మాణం పై మంత్రి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆదానీ కంపెనీ చేపట్టే సేవా కార్య క్రమాలలో బాగంగా టౌన్‌హాల్ నిర్మాణం చేపట్టనున్నారు.


టౌన్‌హాల్ నిర్మించనున్న స్థలం ఇదే

## నవయుగ వైతాళికుడు గుర్రం జాషువా

అద్దంకిటౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తన రచనల ద్వారా నాటి సమాజంలోని ఛాందస వాదంపై సామాజిక రుగ్మతలపై పోరాటం చేసిన మహాకవి, నవయుగ వైతాళికుడు గుర్రం జాషువా అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గుర్రం జాషువా 54వ వర్ధంతి సందర్భంగా కొత్త పసుమర్తి పాలెంలోని గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ల ర్పించారు. ఈ సందర్భంగా జాషువా రచనలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బాచిన శివధర పూర్ణచంద్రరావు, అలహరి హరిప్రసాద్, జాషువా కళాపీఠం అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య, చప్పిడి వీరయ్య, దేవపాలన, చంద్రమౌళి, లేవి ప్రసాద్, శ్రీనివాసరావు, లక్ష్మరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


జాషువా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సభ్యులు

## 46 మందికి ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ప్రణయ్

ఇంకొల్లు, జూలై 24, (ఆంధ్ర జ్యోతి) : జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మారుతీ ఐటీఐ కళాశాల సంయుక్తంగా గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 46 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలిపారు. మరో 17 మందిని షార్ట్‌లిస్టులో ఉంచినట్లు తెలిపారు. మొత్తం 184 మంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందడానికి హాజరుకాగా ఎలక్ట్రోసర్క్యూట్ సిస్టమ్స్, స్కిల్‌క్రాఫ్ట్, గుంటూరు హెటిరో ల్యాబ్స్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, యాక్సిస్‌బ్యాంకు, బ్రహ్మసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ, హీరో మోటర్స్ ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ కారుమూడి శ్రీనివాస రావు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఐటీఐ సిబ్బంది రాఘవరావు, సుధాకర్ పాల్గొన్నారు.

## నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

సంతమాగులూరు జులై 24 (ఆంధ్రజ్యోతి ) : నేడు శుక్రవారం మండలంలోని మక్కెన వారి పాలెం గ్రామంలో జరిగే సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొంటారని తెలుగుదేశం పార్టీ నాయకులు మక్కెన జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9:30 గంటలకు కొమ్మాలపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బాల బాలికలకు ఉచిత సైకిళ్లను పంపిణీ చేస్తారన్నారు. అనంతరం మక్కెన వారి పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల బాలికలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేసి , అనంతరం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు పట్ల వివరిస్తారని ఆయన తెలిపారు.

## చిన్న చిన్న సమస్యలను పెండింగ్‌లో చూపవద్దు

అద్దంకిటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రామాలల్లో చిన్న చిన్న సమస్యలను కూడా రోజుల తరబడి పెండింగ్‌లో పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని ఎంపీడీవో సింగయ్య సచివాలయం సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని వేలమూరిపాడు గ్రామం లో ఆయన పర్యటించారు. ఈ సందర్భం గా గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు. క్లాప్ మిత్రలకు గౌరవ వేతనం చెల్లించడంలో జాప్యాన్ని గుర్తించి వెంటనే చెల్లించాలని ఆదేశించారు. గ్రామంలో కొత్త వీధిలైట్లు బిగించకుండా పెండింగ్‌లో పెట్టడం ఏమిటని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. వారం రోజుల్లో పూర్తిచేయాలన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, కేంద్రం శుభ్రంగా ఉండడం పట్ల సిబ్బందిని అభినందించారు. పిల్లల హాజరు శాతాన్ని పరిశీలించారు. 16 మంది చిన్నారులకు 13 మంది ఉన్నారు గ్రామంలో ఉపాధి హమీ పనులు చేపట్టక పోవడంతో పీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఉపాధి హమీ పనులు చేయించాలన్నారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ గోపనబోయిన అంజయ్య, పంచాయతీ కార్యదర్శి రామరాజు తదితరులు ఉన్నారు.


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

## ఆర్టీసీ బస్‌ను ఢీకొన్న టిప్పర్

● ప్రయాణికులకు స్వల్ప గాయాలు

అద్దంకి, జూలై24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న ఘటన మండలంలోని జార్లపాలెం సమీపంలో గురువారం చోటుచేసుకొంది. విజయవాడ- బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి వద్ద ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం ఉదయం ఇంకొల్లు నుంచి అద్దంకి వస్తోంది. అదే సమయంలో జాతీయ రహదారి నిర్మాణానికి గ్రావెల్ అన్‌లోడ్ చేసి అద్దంకి-రేణింగవరం రోడ్డు పైకి వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదం లో బస్ అద్దాలు పగిలి ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. అనంతరం ప్రయాణికులు అక్కడి నుంచి వెళ్లి పోయారు.


ప్రమాదానికి గురైన బస్సు, టిప్పర్

## గనులలో భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీలలో పనులు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని మైన్స్ అండ్ సేఫ్టీ డిప్యూటీ డెరెక్టర్ జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. గురువారం బల్లికురవ మండలం వీర్లకొండ వద్ద శ్రీశ్రీనివాస, కొణిదెన గ్రామంలోని సాయిశ్రీనివాస, సంతమాగులూరు మండలం గురిజేపల్లిలోని ముంజునాథ గ్రానైట్ క్వారీలను డీడీఎంస్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా క్వారీలలో రికార్డులను తనిఖీలు చేశారు. అనంతరం కార్మికులు పనులు చేసే క్వారీ ప్రదేశాలను పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతు కార్మికుల భద్రతకు యజమానులు చర్యలు చేపట్టాలన్నారు. కార్మికులకు ఏటా వైద్యపరీక్షలు చేయించాలన్నారు. అలానే పనులు నిర్వహించే సమయంలో పనుల వద్ద ఫస్ట్‌క్లాస్ మేనేజర్ మేనేజర్ అందుబాటులో ఉండాలన్నారు. బ్లాస్టింగ్‌లను నిర్ణిత సమయాల్లో మాత్రమే చేయాలన్నారు. క్వారీలలో దుమ్ము లేకుండా ప్రతి రోజు నీటిని చల్లించాలన్నారు. పనుల వద్దకు వెళ్లే రోడ్డును సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఉండాలన్నారు. ఈ తనిఖీలో క్వారీల మేనేజర్లు పాల్గొన్నారు.

## దాతల తోడ్పాటును అందిపుచ్చుకోవాలి


నోటుపుస్తకాలను అందజేస్తున్న దాతలు

పంగులూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దాతలు అందిస్తున్న తోడ్పాటును అంది పుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని నూజెళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం జే.వెంకట్రావు అన్నారు. మండలంలోని నూజెళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయిని చిన్నం విజయలక్ష్మి, బదిలీపై వెళ్లిన కేమా శ్రీనివాసరావు, నరసింహమూర్తి, శ్యాంసుందర్‌తో పాటు కైలాసబాబు, మనోరమ, శ్రావణిలు రూ.8 వేల విలువైన పలు పుస్తకాలను సమకూర్చారు. దాతలు సమకూర్చిన నోట్ పుస్తకాలు, తెలుగు, ఇంగ్లీష్ కాపీరైట్ పుస్తకాలను గురువారం పాఠశాల విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంట్యాల అరుణ, ఎస్ఎంసీ చైర్మన్ మద్దినేని శోభ, ఉపాధ్యాయులు కేమా వీరాంజనేయులు, ఏడుకొండలు, బత్తుల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పుట్టంరాజు కృషి


దాతలు అందించిన పలకలు, నోట్ పుస్తకాలతో విద్యార్థులు

అద్దంకిటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తమ తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి పుట్టరాజు శ్రీరామచంద్రమూర్తి చేసిన కృషి అభినందనీయమని హెచ్ఎం బీమని వెంకటరత్నం అన్నారు. గురువారం మండలంలోని గోపాలపురం డీపీఈపీ పాఠశాలలోని పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మనుమడు సాయిహర్ష పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు పలకలు, రాతపుస్తకాలు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులను హెచ్‌యం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

## శింగరకొండలో దశసహస్ర కదళీఫలార్చన

అద్దంకి, జూలై24 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా గురువారం రూ.10 వేల అరటిపండ్లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలు, భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితీ ఆధ్వర్యంలో అమవాస్య సందర్భంగా గురువారం అద్దంకి పట్టణంలోని పాత బస్టాండ్‌లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాసు, తిరుపతిరెడ్డి, పెద్దన్న, రామాంజనేయులు, తన్నీరు సురేష్, కొండ్రగుంట శ్రీనివాసరావు, మంగమూరి సురేష్, సుబ్రహ్మణ్యం, కురిచేటి వెంకటసుబ్బారావు, గార్లపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

## స్మార్ట్‌మీటర్లపై అపోహలు నమ్మవద్దు

అద్దంకి, జూలై24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగాన్ని మించి అధిక బిల్లులు వస్తాయనే అపోహలను వినియోగదారులు నమ్మవద్దని విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. అద్దంకి డివిజన్ పరిధిలోని పలు గ్రామాలలో ఈఈ మస్తాన్‌రావు స్మార్ట్ మీటర్లను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న మీటర్లు, స్మార్ట్ మీటర్లను పోల్చి వివరించారు. రీడింగ్‌లలో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ద్వారా ప్రతి నెల ఖచ్చితమైన తేదీకి ఆటోమాటిక్‌గా బిల్లింగ్ తీసే అవకాశం ఉంటుందన్నారు. స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుకు వినియోగదారులు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, విద్యుత్ సంస్థలే ఉచితంగా ఏర్పాటు చేస్తాయన్నారు.

## అవీ..ఇవీ..

### ఓటర్ల జాబితాల పరిశీలనకు సహకరించాలి

● రాజకీయ పార్టీ నేతల సమావేశంలో ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు

చీరాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు జరుగుతున్న ఓట్లు పరిశీలన ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ గోపీకృష్ణ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 218 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. అయితే ప్రతి బూత్‌లో 1200కుపైగా ఓట్లు ఉన్నట్లయితే అదనంగా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు ఉన్నట్లు వివరించారు. వీటిపై వారి నుండి అభ్యంతరాలు సేకరించారు. మరో రెండు లేక మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసి ఎలక్షన్ కమిషన్‌కు పంపనున్నట్లు చెప్పారు.

### సామాజిక తనిఖీలపై అవగాహన ర్యాలీ

బల్లికురవ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఉపాధి హమీ పథకం ద్వారా రోజు వారీ కూలీలకు ఉపాధి అందుతున్న విధానంపై మండలంలోని కొణిదెన గ్రామాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గురువారం గ్రామంలో జరుగుతున్న సామాజిక తనిఖీపై ప్రజలకు అర్థం అయ్యేలా అవగాహన చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధి ఆడిట్ డీఆర్పీ విజయబాస్కర్ మాట్లాడుతూ ఉపాధి శ్రామికులకు ఉపాధి హమీ పథకం హక్కులు, రాజీలేని అంశాలను ఎంపిక చేసిన పనులు సామాజిక తనిఖీ గురించి వివరిస్తున్నామన్నారు. ఈ ర్యాలీలో ఎంపీపీ శ్రీలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### చురుగ్గా పారిశుధ్య కార్యక్రమాలు


బల్లికురవ బస్టాండ్ కూడలిలోని వ్యర్థాలను తొలగిస్తున్న కూలీలు

బల్లికురవ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలను శరవేగంగా చేపడుతున్నామని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రోడ్ల వెంబడి ఉన్న వ్యర్థాలను తొలగించి గ్రామానికి దూరంగా పడవేస్తున్నామన్నారు. అలానే చెత్తసంపద కేంద్రాలకు వ్యర్థాలను తరలించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. బల్లికురవ చెన్నుపల్లి రోడ్డులోని వ్యర్థాలను ఎంపీడీవో పరిశీలించి తక్షణమే చెత్తను తొలగించాలని పంచాయితీ కార్యదర్శిని కోరారు. బస్టాండ్ కూడలిలో కుండీలలో ఉన్న వ్యర్థాలను కార్మికులతో తీసి వేయించారు. ఎవరైన రోడ్లపై చెత్తవేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ఉపాధి పనుల నిర్వహణపై విచారణ

పంగులూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో నిర్వహించిన ఉపాధిహామీ పనులపై బాపట్ల ఏపీడీ సువార్త గురువారం క్షేత్రస్థాయిలో విచారించారు. ఉపాధిపనులకు సంబంధించి హాజరు విషయంతో పాటు చెల్లింపులపై ఏపీడీ రికార్డులు పరిశీలించారు. ఇందుకు సంబంధించి ఫిర్యాదుదారులు, సదరు సిబ్బందిని విచారించారు. విచారణకు సంబంధించిన అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో సంతోషం, ఎఫ్ఏ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు మంత్రి, ఎమ్మెల్యే పర్యటన


పర్చూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలంలో శుక్రవారం రాష్ట్రఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పనులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావులకేశవ్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివ రావులు పర్యటించనున్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాగులపాలెం గ్రామాల్లో పర్యటిస్తారని టీడీపీ పర్చూరు మండల అధ్యక్షులు షేక్ షంషుద్దీన్ తెలిపారు. పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారు ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై పర్యటను విజయవంతం చేయాలని కోరారు.

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5




శ్రీ పొట్టిశ్రీరాములు
# నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 25 జూలై 2025

## 'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి వరద ప్రవాహం రోజురోజుకు పెరుగుతోంది. బుధవారం 5,054 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగగా గురువారం నాటికి 8,928 క్యూసెక్కులకు పెరిగింది. అదేస్థాయిలో డ్యాంలోనూ నీటినిల్వ సామర్థ్యం పెరుగుతోంది. ప్రస్తుతం 27.880 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 3,900 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.




## ఎక్కడి వాళ్లు అక్కడే
# గప్‌చుప్!

- కేసుల భయంతో మాజీ మంత్రి అనిల్ అనుచరుల పరార్
- మొబైళ్లు స్విచ్ఛాఫ్ చేసి అజ్ఞాతంలోకి..
- ముమ్మరంగా జల్లెడ పడుతున్న పోలీసులు

నెల్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : క్వార్ట్జ్ అక్రమ రవాణా వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అనుచరులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ వ్యవహారంలో అనిల్ తన చేతికి మట్టి అంటకుండా తన అనుచరుల ద్వారా వ్యవహారం చక్కబెట్టుకున్నట్లు పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అనిల్ అనుచరులుగా వ్యవహరించిన వారి జాబితా ఇప్పటికే పోలీసులు సిద్ధం చేశారు. అనిల్ ముఖ్య అనుచరుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని అరెస్టు చేయడం, అతను క్వార్ట్జ్ అక్రమ రవాణా వ్యవహారంలో మాజీ మంత్రులు అనిల్, కాకాణి పాత్రతోపాటు సహకరించిన వారి పేర్ల జాబితాను సైతం పోలీసులకు తెలియజేశారు. దీంతో తమ అరెస్టు తప్పదని భావించిన అనిల్ అనుచరులు జిల్లా విడిచి పరారయ్యారు.

### ● తప్పించుకున్న జిమ్ శ్రీకాంత్

క్వార్ట్జ్ అక్రమ సంపాదన మొత్తం అనిల్ అనుచరుల చేతుల మీదుగా నడిచినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే అదుపులోకి తీసుకున్న బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల బ్యాంక్ స్టేట్‌మెంట్లు సంపాదించిన పోలీసులు, ఇతర అనుచరుల ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించారు. ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన జిమ్ శ్రీకాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించారు. అయితే అతను త్రుటిలో తప్పించుకొని విదేశాలకు పరారయినట్లు ప్రచారం జరుగుతోంది. క్వార్ట్జ్ అక్రమ రవాణాలో అనిల్‌కు శ్రీకాంత్‌రెడ్డి కుడిభుజంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. క్వార్ట్జ్ క్వారీలు విస్తారంగా ఉన్న గూడూరు డివిజన్‌లో మొత్తం వ్యవహారాలను జిమ్ శ్రీకాంత్‌రెడ్డే చూసేవాడని ప్రచారం. ఈ క్రమంలో అక్రమ క్వార్ట్జ్ విక్రయాల ద్వారా వచ్చిన కోట్లాది రూపాయాల లావాదేవీలు శ్రీకాంత్‌రెడ్డి ద్వారానే జరిగినట్లు తెలుస్తోంది. దీనికి తోడు గూడూరు డివిజన్ పరిధిలో లీజుదారుల నుంచి టన్నుకు పది వేలు వసూళ్లు చేసే వ్యవహారాలను జిమ్ శ్రీకాంత్‌రెడ్డే చూసేవాడని అంటున్నారు. దీంతో ఆయన్ను అదుపులోకి తీసుకోవాలని ప్రయత్నించారు. అజ్ఞాతంలోకి వెళ్లిన ఈయన్ను వెనక్కు రప్పించే మార్గాలను పోలీసులు అన్వేషిస్తున్నారు.

### ● ముమ్మరంగా గాలింపు

ఏడాదిన్నర కాలంపాటు అడ్డూ అదుపులేకుండా జరిగిన ఈ క్వార్ట్జ్ అక్రమ రవాణాలో బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, జిమ్ శ్రీకాంత్‌రెడ్డిలతోపాటు ఇంకా పలువురు అనిల్ మనుషులుగా వ్యవహరించారు. ప్రధానంగా క్వార్ట్జ్ కొనుగోలు కంపెనీల నుంచి నగదును తమ అకౌంట్లలో వేసుకొని, వాటిని మరో రూపంలో అనిల్‌కు, తాడేపల్లి ప్యాలెస్‌కు చేర్చిన వ్యక్తులు పదుల సంఖ్యలో ఉన్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. వీరిందరి కోసం గాలింపు చర్యలు మొదలయ్యాయి. అయితే బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి అరెస్టు, ఆయన ఇచ్చిన వాఙ్మూలంతో క్వార్ట్జ్ అక్రమాల్లో భాగస్వామ్యులైన అనిల్ అనుచరులంతా అప్రమత్తం అయ్యారు. అందరూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వీరి మొబైల్ ఫోన్లు కూడా స్విచ్ ఆఫ్ అయి ఉన్న విషయం ప్రస్తుతం నెల్లూరులో హాట్ టాపిక్‌గా మారింది.



ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

## పారిశుధ్య పనుల టెండర్లు
# రద్దు చేయాల్సిందే!

- ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు
- నగరంలో మున్సిపల్ కార్మికుల భారీ ప్రదర్శన

నెల్లూరు (వైద్యం) జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్‌లో పారిశుధ్య పనులకు టెండరు పిలిచే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గాంధీబొమ్మ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వర్క్ అవుట్‌సోర్సింగ్ పేరుతో పారిశుధ్య కార్మికులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడం, ఇది కూడా మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సొంత నియోజకవర్గంలో శ్రీకారం చుట్టడం అన్యాయమన్నారు. 279 జీవోకు వ్యతిరేకంగా గతంలో ఆందోళన చేయడంతో వెంటనే అప్పటి ప్రభుత్వం జీవోను రద్దు చేసిందని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు భద్రత లేకుండా, జీతాలు సక్రమంగా ఇవ్వకుండా ఉండే కాంట్రాక్టర్‌లకు టెండరు ద్వారా అప్పగించే విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ నిరసనలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, రాష్ట్ర కోశాధికారి జ్యోతిబసు, సీపీఎం నేతలు కత్తి శ్రీనివాసులు, కొండాప్రసాద్, పెంచల నర్సయ్య, సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, సుధాకర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ శ్రీపూజ ఎదుట వాపోతున్న గ్రామస్థులు

## మా ప్రాణాలు తీసి
# మైనింగ్ తవ్వుకోండి!

- గతంలోనే హెచ్చరించినా మారరా!?
- అధికారులపై జంగంరెడ్డిపల్లి వాసుల ఆగ్రహం
- భారీ బందోబస్తు నడుమ ప్రజాభిప్రాయ సేకరణ
- గ్రామస్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు : సబ్‌కలెక్టర్

8లో..



బొప్పాయి రైతుకు
# ఊరట

- కేజీ రూ.4 నుంచి రూ.13లకు పెరిగిన ధర

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధర పెరగడంతో సాగుదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత నెల ఇదే సమయానికి కేజీ రూ.4 పలకగా.. నేడు రూ.10 నుంచి 13లకు చేరడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అనంతసాగరం మండలంలోని అగ్రహారం, సంజీవనగరం, గౌరవరం, బొమ్మవరం తదితర గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో బొప్పాయి సాగులోం ఉంది. ఒక ఎకరా సాగు కోసం రూ. లక్ష నుంచి 1.2 లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. రెండు నెలలుగా దిగుబడి చేతుకొందుతోంది. ఈక్రమంలో గత నెలలో దిగుబడికి సరైన గిట్టుబాటు లేక సాగుదారులు ఆందోళనకు గురయ్యారు. క్రమేణా మార్కెట్ ధర పుంజుకోవడంతో పెట్టుబడి పోను మిగులు ఆదాయం సమకురుతున్నట్లు రైతులు చెబుతున్నారు. కాయలను పేపర్లలో చుట్టి లారీల ద్వారా పూణె, ముంబాయి, నాగపూర్ మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు.

## పథకాల అమలు
# ఎలా ఉంది?

- నేటి నుంచి జాతీయ పర్యవేక్షణ బృందం పర్యటన

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ, సామాజిక పింఛన్లు, గృహ నిర్మాణం మొదలైన పథకాల అమలు తీరును పరిశీలించేందుకు శుక్ర వారం నుంచి జాతీయ స్థాయి బృందం పర్యటించనుంది. ఆ బృంద సభ్యులు డాక్టర్ ప్రశాంత్‌కుమార్, డాక్టర్ మణికందన్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను మర్యాద పూర్వ కంగా కలిశారు. అనంతరం జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ సమా వేశం నిర్వహించారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన బృంద సభ్యులకు సహాయ సహకా రాలు అందించాలని, క్షేత్రస్థాయిలో అమల వుతున్న సంక్షేమ పథకాలను సభ్యులకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ గంగాభవానీ, జడ్పీ సీఈవో మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ పథకాల అమలు తీరును ఢిల్లీ బృంద సభ్యులు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. వచ్చే నెల 2వతేదీ వరకు జిల్లాలో వీరి పర్యటన కొనసాగనుంది.

## సీఎస్ఈకి
# జై!

జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో తొలివిడత సీట్ల కేటాయింపు జాబితాను ఏపీ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో చేరేందుకు సన్నద్ధమవుతున్నారు. మరికొంత మంది విద్యార్థులకు తాము కోరుకున్న కళాశాలల్లో సీట్లు రాకపోవడంతో మలివిడత కౌన్సెలింగ్‌కు సమాయత్తమవుతున్నారు. మరోవైపు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) వైపు అత్యధిక శాతం మంది మొగ్గు చూపారు. కోర్సు పూర్తి చేసి పెద్ద కంపెనీల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొంది రూ.లక్షల్లో జీతాలు అందుకోవచ్చన్న ఆశతో విద్యార్థులు సీఎస్ఈనే ఎంచుకున్నారు.

- తొలివిడత ఇంజనీరింగ్ సీట్ల భర్తీ పూర్తి
- 9,715 సీట్లకు 6,409 భర్తీ
- అత్యధికశాతం మంది కంప్యూటర్ సైన్స్‌పైనే మొగ్గు
- వచ్చే నెల 4న తరగతుల ప్రారంభం
- త్వరలో మలివిడత కౌన్సెలింగ్

నెల్లూరు(విద్య), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు 2025-26 విద్యాసంవత్సరానికి 11,560 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంజనీరింగ్‌లో 5,993 మంది, వ్యవసాయ, ఫార్మసీ విభాగంలో 2,263 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని 13 ఇంజనీరింగ్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ సీట్లు, కన్వీనర్ కోటా సీట్లు కలిపి 9,715 సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి అనుమతులిచ్చింది. గతేడాది 8,722 సీట్లకుగాను 6,788 సీట్లు (81.03 శాతం) భర్తీ అయ్యాయి. ఈ విద్యా సంవత్సరంలో 9,715 సీట్ల భర్తీకి అనుమతులివ్వగా తొలి విడతలో 6,409 సీట్లు భర్తీ అయ్యాయి. కొంతకాలంగా ఇంజనీరింగ్ కళాశాలల్లో క్యాంపస్ ఎంపికలను నిర్వహిస్తుండటం, పలు ఎంఎన్‌సీ కంపెనీలు విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తుండటంతో ఇతర జిల్లాలకు చెందిన విద్యార్థులు కూడా జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరుతున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 26వ తేదీ లోపు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేసుకుని అడ్మిషన్లను నిర్ధారించుకోవాలి. అనంతరం ఆగస్టు 4వ తేదీన తరగతులు ప్రారంభమవుతాయి.

### ● జిల్లాలో భర్తీ అయిన సీట్లు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 13 ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ వివరాలను అధికారులు ప్రకటించారు. నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో 912 సీట్లకు 900 సీట్లు భర్తీ అయ్యాయి. గూడూరులోని నారాయణ కళాశాలలో 792 సీట్లకు 776, ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో 216 సీట్లకు 205 సీట్ల భర్తీతో వరుస మూడు స్థానాల్లో నిలిచాయి. వాకాడులోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 1104 సీట్లకు 1026 సీట్లు, గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో 768 సీట్లకు 677, ఏఎస్ఈటీలో 456 సీట్లకు 327, ఆర్ఎస్ఆర్ఎన్ కళాశాలలో 624 సీట్లకు 440 సీట్లు భర్తీ

- మిగతా 7లో..

**ముఖ్య కోర్సుల్లో భర్తీ అయిన సీట్లు**

| కోర్సులు | సీట్లు | భర్తీ |
|---|---|---|
| సీఎస్ఈ | 3972 | 2672 |
| ఏఐఎంఎల్ | 1296 | 985 |
| సీఎస్‌డీ | 216 | 22 |
| సీసీ/ఏడీ | 768 | 697 |
| ఈసీఈ | 1632 | 1132 |
| ఈఈఈ | 372 | 177 |
| ఏఐ/సీఏఐ | 715 | 581 |
| ఎంఈసీ | 276 | 113 |
| సివిల్ | 228 | 98 |
| ఐఎన్‌ఎఫ్/డీఎస్/సీఎస్‌వో/ఐవోటీ | 192 | 12 |
| ఈవీటీ | 48 | 0 |

## నెల్లూరు మీదుగా షిరిడికి ప్రత్యేక రైళ్లు

ఆగస్టు 3 నుంచి సెప్టెంబరు 29 వరకు..



నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ని సాయినాధుడి భక్తులకు దక్షిణ మధ్య రైల్వే తీపిక బురు అందించింది. తిరుపతి నుంచి నెల్లూరు మీదుగా షిరిడికి ఆగష్టు 3వ తేదీ నుంచి ప్రతి ఆదివారం 9 ప్రత్యేక రైళ్లన నడవనున్నట్లు రైల్వే ప్రకటించింది. తిరుపతిలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు రైలు (నెం.07637) బయలుదేరి సోమవారం ఉదయం 10.45 గంటలకు సాయినగర్ (షిరిడి)కి చేరుకుంటుంది. అదేవిధంగా సాయినగర్ నుంచి ప్రతీ సోమవారం రాత్రి 7.35 గంటలకు రైలు (నెం.07638) బయలుదేరి మం గళవారం అర్ధరాత్రి 1.30 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. ఉమ్మడి నెల్లూరు జి ల్లాలో నెల్లూరు, గూడూరు స్టేషన్లలో మా త్రం ఈ రైళ్లు ఆగుతాయి. సెప్టెంబరు 29 తేదీ వరకు ఈ రైళ్లు నడవనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## బియ్యం భోక్తల
# గుట్టు రట్టు!

రేషన్ తీసుకోకపోయినా తీసుకున్నట్లు లెక్కలు

ఐవీఆర్ఎస్ సర్వేలో అక్రమాలు వెలుగులోకి

- 10 వేల మందికి కాల్స్.. 1,138 మంది తీసుకోలేదని సమాధానం
- రేషన్ దుకాణాల తనిఖీకి ప్రభుత్వం ఆదేశం
- మాఫియా ఆగడాలకు ఇకనైనా చెక్ పడేనా!?

నెల్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రేషన్ దుకాణాల కేంద్రంగా జరుగుతున్న అక్రమాల గుట్టు రట్టయ్యింది. పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి పడుతున్నట్లు ప్రభుత్వ సర్వేలో తేలింది. కార్డుదారులకు సరుకులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు లెక్కలు రాస్తున్నట్లు నిర్ధారణ జరిగింది. జిల్లాలో రేషన్ పంపిణీ తీరును ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ప్రభుత్వం ఇటీవల ఐవీఆర్ఎస్ సర్వేను చేపట్టింది. ఒక్కో మండలంలో కొంత మంది కార్డుదారులను ర్యాండమ్‌గా సెలక్ట్ చేసుకొని వారికి కాల్స్ చేసింది. జిల్లాలో సుమారు 10 వేల మంది కార్డుదారుల వరకూ ఫోన్ చేసినట్లు తెలిసింది. అందులో 1,138 మంది కార్డుదారులు తాము సరుకులు తీసుకోలేదని సమాధానమిచ్చారు. అంటే కార్డుదారులకు సరుకులు ఇవ్వకపోయినా దుకాణాల్లో మాత్రం ఇచ్చినట్లు లెక్కలు చూపిస్తున్నారన్న మాట. అయితే ఐవీఆర్ఎస్ సర్వే వందకు వంద శాతం కరెక్టుగా ఉంటుందని చెప్పలేం గానీ, అయితే అందులో చాలా వరకూ వాస్తవికత ఉంటుందన్నది నిజం. దీనిని బట్టి చూస్తే జిల్లాలోని రేషన్ దుకాణాల కేంద్రంగా అవకతవకలు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ దుకాణాల కేంద్రంగా రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు వస్తున్న ఆరోపణలకు ఈ ఐవీఆర్ఎస్ సర్వే బలాన్ని చేకూరుస్తోంది.

### ● తనిఖీలకు ఆదేశం

జిల్లాలో ఏడు లక్షల రేషన్ కార్డులు ఉండగా, సుమారు 20 లక్షల మంది రేషన్ బియ్యాన్ని తీసుకుంటున్నారు. ప్రతి నెలా సుమారు 10 వేల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. నెలలో సరాసరి 87 శాతం మంది బియ్యం తీసుకుంటున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే, ఈ బియ్యంలో చాలా వరకూ మాఫియా చేతుల్లోకి వెళుతున్నాయి. గతంలో ఇళ్ల వద్దకు వచ్చి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసుకొని తీసుకెళ్లేవారు. కానీ ఇప్పుడు ఏకంగా రేషన్ దుకాణాల వద్దనే బేరం జరుగుతోంది. రేషన్ పంపిణీ చేసే వ్యక్తులే.. మీకు బియ్యం కావాలా..? డబ్బులు కావాలా..? అని అడుగుతున్నారు. డబ్బులు కావాలని చెబితే కిలోకు రూ.15 చొప్పున ఇచ్చేసి బియ్యం ఆపేస్తున్నారు. అయితే తాజాగా ఐవీఆర్ఎస్ సర్వేలో కొందరు కార్డుదారులకు సరుకులు ఇవ్వకనే ఇచ్చినట్లుగా నమోదు చేస్తున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో రేషన్ దుకాణాల్లో తనిఖీలకు ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం మేరకు జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ గత వారం పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. రేషన్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి తనకు నివేదిక అందజేయాలని జేసీ ఆదేశించారు.

### ● ఇకనైనా దృష్టి పెడతారా!?

రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బియ్యం పక్కదారి పడుతున్న జిల్లాల్లో నెల్లూరు కూడా ముందు వరుసలో ఉందన్నది నిఘా వర్గాల సమాచారం. ఇక్కడ రేషన్ బియ్యాన్ని తరలించి, రీసైక్లింగ్ చేసి మళ్లీ మార్కెట్లో తీసుకొచ్చే వ్యక్తులు.. అలానే ఇతర దేశాలకు ఎగుమతులు చేసే వ్యక్తులు ఒక మాఫియాగా ఏర్పాటై ఉన్నారన్నది బహిరంగ రహస్యం. ప్రతి నెలా రెండు వేల టన్నుల వరకూ రేషన్ బియ్యాన్ని పక్కదాని పట్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకుగానూ సంబంధిత శాఖలకు మామూళ్లు కడుతున్నట్లు మాఫియా బహిరంగంగా చెప్పుకుంటోంది. గుడిపల్లిపాడు, అల్లీపురం కేంద్రాలుగా ఉన్న కొన్ని మిల్లుల్లో నిరంతరం రేషన్ బియ్యం రీసైక్లింగ్ ప్రక్రియ జరుగుతోంది. కానీ అటు వైపు ఏ అధికారీ కన్నెత్తి చూడరన్న విమర్శలు ఉన్నాయి. అయితే ఇప్పుడు ప్రభుత్వమే ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించి జిల్లా అధికారులను అప్రమత్తం చేసింది. మరి ఇకనైనా రేషన్ మాఫియాపై దృష్టి పెడతారో.. లేదో.. చూడాలి.



### తనిఖీలు నిర్వహించమన్నారు

రేషన్ పంపిణీపై లబ్ధిదారుల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించిన మాట వాస్తవమే. ఇందులో కొంత మంది లబ్ధిదారులు సరుకులు తీసుకోలేదని చెప్పారు. ఈ అంశంపై జాయింట్ కలెక్టర్ మీటింగ్ పెట్టి, రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నివేదిక ఇవ్వమని ఆదేశించారు.

**- విజయ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి**

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 134 |
| స్కిన్ చికెన్ | 240 |
| స్కిన్‌లెస్ | 264 |

కోడిగుడ్ల ధర (100): 475

## 'వీరమల్లు' సంబరాలు



జలదంకి, జూలై24(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు చిత్రం విడుదలను పురస్కరించుకుని స్థానిక నిమ్మలపల్లి శ్రీనివాసులు రైస్‌మిల్లు ఆవరణలో గురువారం జనసేన, టీడీపీ నాయకులు, పవన్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను నియోజకవర్గ జనసేన నాయకుడు రామ్‌చైతన్య, టీడీపీ యువనేత గంటా అశోక్, మండల జనసేన అధ్యక్షుడు తోట మురళి కట్ చేశారు. కార్యక్రమంలో పవన్ అభిమానులు రేవంత్, నవన్, సుబాని, కళ్యాణ్, నందు, చైతన్య, రంజిత్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

# మూడేళ్లుగా ఆటల్లేవు!

- వ్యాయామ ఉపాధ్యాయుల్లేక క్రీడలు బంద్
- బదిలీపై వెళ్లినవారి స్థానంలో జరగని నియామకాలు
- ఆగస్టులోనైనా భర్తీ అయ్యేనా ?

కొండాపురం, జూలై24(ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఆనందాన్ని పెంపొందించుతాయని అనాది నుంచి వస్తున్న నానుడి. క్రీడల ప్రాముఖ్యతను గుర్తించిన విద్యాశాఖ పాఠశాలల్లో కాలపట్టికలోనూ ప్రత్యేకంగా సమయం కేటాయించింది. దీంతో ప్రతిరోజూ క్రీడలను ఆడించేవారు. క్రీడలలో రాణించిన విద్యార్థులకు అందచేసే సర్టిఫికెట్ వారికి ఉన్నత చదువులు, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు దోహదపడుతున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన క్రీడలను నేర్పించేందుకు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించడం లేదు.

**● వ్యాయామ ఉపాధ్యాయులేరీ..?**

మండలంలో 9 జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక ఆదర్శ, ఓ కేజీబీవీ పాఠశాలలతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. ఆరు నుంచి ఇంటర్ వరకు సుమారు 1200 మంది వరకు చదువుతున్నారు. గతంలో మండలం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన క్రీడల



ఆదర్శ పాఠశాల క్రీడామైదానంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

లో విద్యార్థులు రాణించారు. రోప్ స్కిప్పింగ్, రన్నింగ్ రేస్ తదితర క్రీడల్లో ఈ ఘనతను సాధించారు. అలాగే కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థులూ ఉన్నారు. సుమారు మూడేళ్ల నుంచి పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. దీంతో మైదానాల్లో ఆటలు కరువయ్యాయి. కాగా ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో అర్హులయిన వారికి ఆగస్టులో నియామక పత్రాలు అందనున్నాయి. వారితోనైనా వ్యాయామ ఉపాధ్యాయుల భర్తీ జరుగుతుందని పాఠశాలలల హెచ్‌ఎంలు అంటున్నారు.

## నేడు ఆధార్ కేంద్రం ఏర్పాటు

వలేటివారిపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గ్రామ సచివాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో నరేంద్రదేవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులోని పేర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర మార్పులు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## నోటు పుస్తకాల పంపిణీ

కందుకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు భోజనం ప్లేట్లు, నోట్‌పుస్తకాలు,పెన్సిళ్లు, వాటర్‌బాటిల్స్‌ను గురువారం మేక్ ఏ చేంజ్ సొసైటీ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సొసైటీసభ్యులు విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు తోడ్పాటునందిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రవ్వా శ్రీనివాసులు, చిన్ని వెంకటసాయిపూర్ణతేజ, కోట వెంకటేశ్వర్లు, గుర్రం చిన అల్లూరయ్య, ఉపాధ్యాయులు కె. పద్మజ, ఎం. శేషమ్మ, సీఆర్‌పీ ప్రతిభ పాల్గొన్నారు.

## వైసీపీ నేత వెంట మండల రిసోర్స్ కోఆర్డినేటరు



వైసీపీ ఇన్‌చార్జి రాజగోపాల్‌రెడ్డి వెంట ఉన్న మురళి

కొండాపురం, జూలై24(ఆంధ్రజ్యోతి): మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ఎం. మురళి తూర్పుఎర్రబల్లిలో రెండు రోజులక్రితం జరిగిన వైసీపీ కార్యక్రమంలో పాల్గొనగా, గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన మురళిని గత ప్రభుత్వంలో కలెక్టరు ఉత్తర్వుల మేరకు కాంట్రాక్ట ప్రాతిపదికన మండల రిసోర్స్ కోఆర్డినేటర్‌గా నియమించారు. ఆయన భార్య గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. గ్రామంలో ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ వైసీపీ కార్యక్రమంలో పాల్గొనడమేమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

## నేడు మంత్రి కొలుసు పార్థసారథి రాక

ఉలవపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణశాఖామంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం మండలంలోని భీమవరం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి వస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## ఎవరివాటా ఎంతో నిగ్గు తేల్చండి : ప్రతాప్

కావలి(టౌన్), జూలై24(ఆంధ్రజ్యోతి) పట్టణంలో జరిగిన మనీ స్కామ్ కుంభకోణం రూ. 800కోట్ల పైమాటేనని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి డిమాండ్ తెలిపారు. గురువారం ముసునూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ మొత్తంలో ఎవరెవరు... వాటాలు పంచుకున్నారో... కేసు ఎందుకు మరుగనపడిందో నిగ్గు తేల్చాలని ఆయన ప్రశ్నించారు. ఈ స్కాంలో కావలి ఎమ్మెల్యే క్రిష్టారెడ్డికి రూ.100 కోట్ల వరకు చేరిందని, సీబీఐ విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన చెప్పారు. ఈ స్కామ్‌లో కానిస్టేబుల్ రాధాకృష్ణ, అయోధ్య, ఎస్ఐ తిరుమలరెడ్డి పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తున్నదన్నారు. కేసు నీరు గార్చేందుకు రూరల్ సీఐ రాజేశ్వరరావు, డీఎస్పీ ప్రయత్నాల్లో భాగంగా, సుభానీని తెలంగాణ పోలీసులకు అప్పజెప్పి చేతుల దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## బదిలీ అయిన టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలి

**బీటీఏ గౌరవాధ్యక్షుడు**

కందుకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులందరికీ తక్షణం జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె. మోహనరావు కోరారు. బదిలీలు జరిగి రెండునెలలైనా నేటికీ ఆ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవటం బాధాకరమన్నారు. జీతాలు చెల్లించకుంటే పోరాటం తప్పదన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో బీటీఏ డివిజన్ కమిటీ సమావేశం షేక్ అబ్దుల్లా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న బీటీఏ నాయకులు పలు ఉపాధ్యాయ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. సమావేశంలో బీటీఏ నాయకులు కె.రమేష్, ఎం. రమణయ్య, చొప్పర కొండలరావు, ఉప్పుటూరి సుబ్రహ్మణ్యం, ధన్యాసి కోటేశ్వరరావు, మెండా వెంకటరావు, కేపై కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలన సీఎం చంద్రబాబుకే సాధ్యం



సీసీడ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించగలిగిన ఏకైక నాయకుడు సీఎం చంద్రబాబునాయుడేనని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని మక్కామసీదు ప్రాంతంలో గురువారం సాయంత్రం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డులోని ప్రతిఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకుంటూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా ఆరాతీశారు. ఈ సందర్భంగా మక్కామసీదు వద్ద నిర్మించతలపెట్టిన సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు. కందుకూరును అత్యంత సుందరంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. అనూష, డీఈ గణపతి తోపాటు పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, షేక్ నాయబ్‌రసూల్, మున్నా, ఫిరోజ్, అహ్మద్‌బాషా, నసీర్, తదితరులు పాల్గొన్నారు.

**● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

కందుకూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 25మందికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 11.66 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి గురువారం బాధిత కుటుంబాల వారికి అందజేశారు.

**● ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి**

కందుకూరు నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకులు ఇష్టారీతిగా మాట్లాడుతున్నారని, వారు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడకపోతే చట్టం తన పనితాను చేస్తుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో గత 40 సంవత్సరాలలో ఎన్నడూ జరగనంత వేగంగా ఈ ఏడాదిలో అభివృద్ధి జరిగిందన్నారు. ఈతరుణంలో ఓర్వలేని ప్రతిపక్షాల నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని అలాంటి వారంతా ఒళ్లుదగ్గర పెట్టుకుని మాట్లాడకపోతే తగిన పరిణామాలు చూస్తారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమిట్ల గురునాథం, జనిగర్ల నాగరాజు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలే ప్రభుత్వాల అజెండా



సభలో మాట్లాడుతున్న దామా అంకయ్య

కావలి(టౌన్), జూలై(ఆంధ్రజ్యోతి) ప్రజావ్యతిరేక విధానా లే అజెండాగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ఆరోపించారు. పట్టణంలోని షాదీమంజిల్‌లో గురువారం సీపీఐ నియోజకవర్గ 25వ మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి దాసోహంగా పనిచేస్తుందని అన్నారు. బ్రిటీష్ పాలకులకు వత్తాసు పలికిన బీజేపీ నేడు నిజమైన దేశభక్తులమని చెప్పుకుంటూ పాలిస్తున్నదన్నారు. కరేడ్ రైతుల నుంచి 8వేల ఎకరాల పంట పొలాలు బలవంతంగా లాక్కోవాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ఈ సభలో జిల్లా సహాయ కార్యదర్శి మాలకొండయ్య, నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ సాగుపై వీఏఏలకు శిక్షణ



వీఏఏ, వీహెచ్ఏలకు శిక్షణనిస్తున్న ఉద్యానశాఖాధికారులు

కలిగిరి, జూలై24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేటలో గురువారం ఆయిల్‌పామ్ సాగుపై వీఏఏ, వీహెచ్ఏలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతోపాటు పంటలకు ఆశించే చీడపీడలు, మార్కెటింగ్ ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సాంప్రదాయ పంటలను సాగుచేస్తున్న రైతులకు ఆదాయం ఆశించినంత రావడంలేదన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఆయిల్‌ఫామ్ సాగు ఆశాకిరణంగా మారిందన్నారు. జిల్లాలో1400 హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీహెచ్ అనూరాధ, వింజమూరు ఏడీఏ శేషగిరిరావు, ఉద్యానశాఖాధికారులు రాజశేఖర్, కార్తీక్‌భరద్వాజ్, సుధామయి, జయశ్రీ, ఆయిల్‌ఫామ్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల్లో రెడ్‌క్రాస్‌ను ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ

కావలి, జూలై24(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ప్రతీ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ శాఖలను ప్రారంభించాలని ఆర్డీవో, కావలి రెడ్‌క్రాస్ అధ్యక్షుడు ఎం. సన్నీవంశీ క్రిష్ణ పిలుపునిచ్చారు. ఆర్డీవో కార్యాలయ సమావేశమందిరంలో గురువారం డివిజన్‌లోని హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లకు జూనియర్, యూత్ రెడ్‌క్రాస్‌లపై అవగాహన కల్పించారు. తొలుత రెడ్‌క్రాస్ స్థాపకులు సర్ జీన్ హెన్రీడునాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి, జూనియర్ రెడ్‌క్రాస్ నోడల్ ఆఫీసర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ ఎవరికైనా గుండె కొట్టుకోవటం ఆగినపుడు చేట్టాల్సిన ప్రాథమిక చికిత్స(సీపీఆర్)ప్రక్రియను ప్రతి విద్యార్థికి నేర్పించాలన్నారు. అందుకు కావలి రెడ్‌క్రాస్ సహకారం అందిస్తోందన్నారు. రెడ్‌క్రాస్ రీసోర్స్‌పర్సన్ షేక్ అబ్దుల్‌కలాం రెడ్‌క్రాస్‌ల పని విధానం, మార్గదర్శకాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు ఏ. రమేష్‌రెడ్డి, స్థానిక రెడ్‌క్రాస్ చైర్మన్ డీ. రవిప్రకాష్, వైస్ చైర్మన్ కే.హరినారపరెడ్డి. కోశాధికారి ఏ.మధుసూదనరావు, పాలక మండలి సభ్యులు డాక్టర్ పీ. శ్రీధర్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఇలింద్ర శ్రీవాణి, జనిగర్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీటి పారుదలకు ఆటంకం లేకుండా చర్యలు

కావలి,జూలై24(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలు, రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని కాలువల్లో వర్షపునీరు, మురుగునీరు పారుదలకు ఆటంకాలు లేకండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన బాలక్రిష్టారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక నేతలతో కలిసి పర్యటించారు. ఎక్కడా వర్షపునీరు నిల్వ ఉండకుండా కాలువలను,డ్రైనేజీలను పూడికలు తీసి శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. కచ్చా రోడ్లపై కూడా నీరు నిలబడకుండా తొలగించాలని ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల వారికి ఆదేశాలుజారీ చేశామన్నారు.



మురుగు కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, తదితరులు

## 9 మంది పేకాట రాయుళ్ల అరెస్టు



పోలీసులకు పట్టుబడిన పేకాటరాయుళ్లు

గుడ్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాలిపేట గ్రామ సమీపంలోని పొలాల్లో రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు గ్రామస్థులు కొందరు పోలీసులకు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్ఐ వెంకట్రావు తమ సిబ్బందితో వెళ్లి గురువారం 9మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,720 స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిదిమందిపై కేసు నమోదుచేసి, కందుకూరు కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

## పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న దాతలు

కావలి(టౌన్),జూలై24(ఆంధ్రజ్యోతి): శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షురాలు పొన్నగంటి మాధవి అధ్యక్షతన గురువారం పేద మహిళలకు కుట్టుమిషన్లు అందచేశారు. అనంతరం ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రిటైర్డ్ హెచ్ఎం స్వర్గీయ చిడిపోతు పాపయ్య-కృష్ణకుమారి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తెలు, అల్లుళ్లు అనిత-రామకృష్ణనాయుడు, కవిత- కిరణ్‌కుమార్ దాతృత్వంతో ఐదుగురికి కుట్టుమిషన్లు అందించారన్నారు. కార్యక్రమంలో అతిథులుగా మున్సిపల్ మేనేజర్ ఫణికుమార్, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఎస్కె ఖాదర్‌బాష, మాజీ కౌన్సిలర్ పులి రజని, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పులిచక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## కత్తి పద్మారావు జయంతిని జయప్రదం చేయండి



నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

అల్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కారంచేడు దుర్ఘటన పై న్యాయం కోసం ఉద్యమాన్ని చేపట్టిన కత్తి పద్మారావు జయంతిని విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్ రాజు అన్నారు. స్థానిక పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం కారంచేడు ఘటనపై దళితులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల27న బాపట్ల జిల్లా పొన్నూరులో జరగనున్న పద్మారావు జయంతిని పండుగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంగులూరు ప్రసాద్, పంగులూరు సుధాకర్, దానం మాల్యాద్రి, అనపల్లి సుందరం, బాపన విజయకుమార్, వట్టికాల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ స్థలాలు ప్రైవేటు పరం చేయొద్దు : ఎస్‌డబ్ల్యూఎఫ్





డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్మికులు

కావలి(టౌన్), జూలై24 (ఆంధ్రజ్యోతి) ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ సంస్థలకు అప్పచెప్పవద్దని ఎస్‌డబ్ల్యూఎఫ్ కావలి శాఖ గౌరవాధ్యక్షుడు ఎం వెంకయ్య పేర్కొన్నారు. గురవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిపో వద్ద ధర్నా నిర్వహించారు. కార్మిక నాయకులు మాట్లాడుతూ రూ.కోట్లు విలువ చేసే ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్‌పరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలన్నారు. విజయవాడ గవర్నర్‌పేట-2డిపోను లులు షాపింగ్‌మాల్‌కు ఇచ్చే ప్రతిపాదనలను విరమించాలన్నారు. విలువైన ఆస్తులను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో డిపో నాయకులు కాలేషా, టీ. రోశయ్య, యూ. మధు, ఎస్కె. గౌస్ అల్లాబాష పాల్గొన్నారు.

## ఎస్సీ బాలుర హాస్టల్‌లో జేసీ పరిశీలన



వార్డెనును అడిగి వివరాలు తెలుసుకుంటున్న జేసీ కార్తీక్

ఉలవపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని గురువారం సాయంత్రం జేసీకే కార్తీక, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజతో కలిసి సందర్శించారు. హాస్టల్ భవనం నిర్మించి ఎన్నేళ్లు అవుతుంది... విద్యార్థుల ఎంతమంది ఉన్నారు... వారికి కల్పిస్తున్న వసతుల గురించి వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే నూతన భవనం నిర్మించేందుకు చర్యలు చేపడతామని జేసీ తెలిపారు. అనంతరం హాస్టల్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీలను సందర్శించి, వాటి వివరా లను ఎంఈవో-2 రమణయ్యను అడిగి తెలుసుకున్నారు. జేసీ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో పవన్, రెవె న్యూ సిబ్బంది ఉన్నారు.

## నువ్వు పైరులో సస్యరక్షణ చర్యలు చేపట్టండి





'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్న అధికారులు

లింగసముద్రం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నువ్వు పైరు సాగుచేసిన రైతులు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి హర్షవర్ధన్ తెలిపారు. గురువారం మండలంలోని యర్రారెడ్డిపాలెం, లింగసముద్రం-2 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా యర్రారెడ్డిపాలెంలో సాగు చేసిన నువ్వు పైరును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వీఏఏలు దీప, రేణుక, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్పాట్ అడ్మిషన్‌ను సద్వినియోగం చేసుకోండి

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ ఒక ప్రకటనలో కోరారు. పదోతరగతి పాసైన విద్యార్థులు సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు ప్రవేశం పొందవచ్చన్నారు.



## శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాం

**● పీ.శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ, అల్లూరు**

అల్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించామని అల్లూరు ఎస్ఐ పీ. శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఎవరైనా సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. చోరీలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు. మండలంలో ప్రజలకు శాంతి భద్రతలు లోపిస్తే అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు.

**? : శాంతి భద్రతలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.**

! : మండలంలో ఎక్కడా అల్లర్లు జరగకుండా ముందస్తుగా సమాచారం వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు.

**?: చోరీలకు పాల్పడే వారిని గుర్తించారా...**

! : ప్రస్తుతం చోరీలకు పాల్పడేవారి వివరాలు తెలుసుకునే పనిలోఉన్నాం. త్వరితగతిన వారిని పట్టుకుని తీరుతాం.

**? : పేకాట, కోడిపందేల నివారణకు చేపట్టిన చర్యలు.**

! : పేకాట, కోడి పందేల ఎక్కడైనా జరిగితే ప్రజలు తమకు సమాచారం అందించాలి. జూదరుల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాం.

## ఆశా వర్కర్ల కమిటీ ఏర్పాటు

బిట్రగుంట (దగదర్తి) జూలై 24 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండల ఆశావర్కర్ల కమిటీని గురువారం ఎంపిక చేశారు. దగదర్తిలోని జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ ఎంపికకు జిల్లా యూనియన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి నేతృత్వం వహించారు. మండల కార్యదర్శిగా వై.అనూరాధ, సభ్యులుగా ఆరోగ్యమ్మ, కామేశ్వరమ్మ, పెంచలమ్మ, సునీత, ఎన్ శారద, అరుణమ్మ, డి.శ్రీదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ముగ్గురు నిందితుల అరెస్టు

లింగసముద్రం, జూలై 24 9ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురంలో ఈనెల 21న గంగమ్మ గుడిలో హుండీ చోరీ చేసిన నలుగురిలో ముగ్గురిని గురువారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ ఎం. నారాయణ చెప్పారు. గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కనిగిరి కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలో అరెస్ట్ చేస్తామని ఆయన తెలిపారు.

## 'ఎమ్మెల్యేకి అంత అహంకారం పనికిరాదు'

కందుకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అంత అహంకారం పనికిరాదని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు ఒక ప్రకనటలో విమర్శించారు. ఈరోజు మీరు మాట్లాడుతున్న భాష, చేస్తున్న హెచ్చరికలు చూస్తుంటే ఎన్నికలకు ముందు కందుకూరులో ప్రశాంతమైన వాతావరణం ఉంచుతానని చెప్పి ఓట్లు వేయించుకున్న విషయాన్ని అప్పుడే మరిచిపోయినట్లుందని ఆయన పేర్కొన్నారు. మీరు మాట్లాడుతున్న భాష చూస్తుంటే మీకు తప్పకుండా సమాధానం చెప్పే తీరుతామని అన్నారు.

## సీఎస్ఈకి జై...

( 5వ పేజీ తరువాయి)

అయ్యాయి. అలాగే వీటీటీకే కళాశాలలో 1248 సీట్లకు 841, ఎస్వీసీఎస్ కళాశాలలో 2640 సీట్లకు 1020, డీఎస్ఐటీ కళాశాలలో 235 సీట్లకు 66, జీకేసీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో 432 సీట్లకు 116, పీఐఎస్ఎన్ కళాశాలలో 96 సీట్లకు 6, పీఆర్ఐకే కళాశాలలో 192 సీట్లు 9 సీట్లు భర్తీ అయ్యాయి. అయితే, వీటిలో కూడా సీట్లు అధికంగా భర్తీ అయిన కళాశాలలు ఆనందాన్ని వ్యక్తం చేస్తుండగా సీట్లు భర్తీ కాని కళాశాలల యాజమాన్యాలు మాత్రం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో త్వరలో తిరిగి రెండోసారి వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తే సీట్ల భర్తీ పెరిగే అవకాశం ఉందా లేదా అని వేచి చూడాల్సిందే.

**● సీఎస్ఈకి తగ్గని క్రేజ్**

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ)కు క్రేజ్ తగ్గనంటోంది. సాఫ్టవేర్, హార్డ్‌వేర్ ప్రక్రియల్లో సమాచార వ్యవస్థల డిజైన్, అమలు, నిర్వహణకు సంబంధించిన కోర్సు కాబట్టి దీనికే ఎక్కువగా జై కొడుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిశ్రమల్లో అధునాతన వ్యవస్థలు, ఆటోమెషన్ పురోగతి సీఎస్ ఈ రంగానికి డిమాండ్ పెంచింది. ఏఐ, బ్లాక్‌చెయిన్ వంటి అధునాతన టెక్నా లజీలు ప్రపంచ రూపురేఖలు మారుస్తుండటం, ప్రతి రంగంలో కంప్యూటర్ల వినియోగం ఉండడంతో సీఎస్ఈకి ఎంతో ప్రాధన్యత లభిస్తోంది. దీంతో పెద్ద కంపెనీల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొంది రూ.లక్షల్లో జీతాలు అందుకోవచ్చన్న ఆశతో విద్యార్థులు దీనికే మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో సీఎస్ఈలో 3972 సీట్లకు గాను తొలి విడతలో 2,672 సీట్లు భర్తీ అయ్యి ప్రథమస్థానంలో నిలవగా, ఈసీఈ, ఏఐఎంఎల్‌లు తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

## ఎన్నాళ్లీ చెట్టు కింద సేవలు...!



చెట్టు కింద 104 వైద్యసేవలను ఏర్పాటు చేసిన వైద్యఆరోగ్య సిబ్బంది

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఓ చెట్టు కింద వైద్యఆరోగ్య సిబ్బంది 104 వైద్యసేవలను రోగులకు అందిస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన పాపం.. వారికి శాపంగా మారింది. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను అసంపూర్తిగా వదిలేయడంతో సిబ్బంది ఇలా రోగులకు చెట్లు, అరుగుల మీద వైద్యసేవలందిస్తున్నారు. ఆరుబయట వైద్యసేవలతో అటు రోగులు, ఇటు సిబ్బంది అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను పూర్తిచేసి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

## పరిశ్రమలతో జిల్లా అభివృద్ధి

- ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నూతన పరి శ్రమల ఏర్పాటు జిల్లా అభివృద్ధికి తోడ్పడుతుందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 1700 దరఖాస్తులురాగా 1616 ఆమోదించినట్లు చెప్పారు. వివిధ కార ణాలతో 20 దరఖాస్తులు తిరస్కరించగా 64 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటినీ త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మెగా ప్రాజెక్టుల ద్వారా 13,599 మందికి, భారీ పరిశ్రమల ద్వారా 5,557 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో ఏర్పడుతున్న వివిధ పరిశ్రమల పురోగతిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, ఆర్డీవోలు పావని, అనూష, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

### రూ. 2 లక్షలు కాజేసిన

## సైబర్ నేరగాళ్లు

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రారెడ్డి పాలెంకి చెందిన ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.2 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన వెన్న పూస బసిరెడ్డి ఫోన్‌కు బుధవారం గుర్తు తెలియని నంబర్ నుంచి ఓటీపీ వచ్చింది. అయితే ఈ ఓటీపీని ఆయన బంధువు ఒకరు ఓపెన్ చేశారు.దీంతో బసిరెడ్డి సంబంధించిన మూడు బ్యాంకు ఖాతాల్లో రెండు ఖాతాల నుంచి రూ2 లక్షలను సైబర్ నేరగాళ్లు కొట్టే శారని గురువారం ఉదయం గుర్తించాడు. అనంతరం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.అయితే వారి సూచన మేరకు బసిరెడ్డి గురువారం రాత్రి పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు.అలాగే ఆయన ఖాతాలున్న రెండు బ్యాంకులకు వెళ్లి జరిగిన విష యాన్ని బ్యాంకు అధికారులకు తెలిపి, ఆయన ఖాతాలను లాక్ చేయించాడు.



# బత్తాయి.. బేల చూపులు

- దిగజారిన ధరలు, నిలిచిన ఎగుమతులు
- దిగుబడులు లేక పెట్టుబడులు రానివైనం
- నాడు కాసులు.. నేడు కన్నీళ్లు..!



ఉదయగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బత్తాయి తోటలతో కళకళలాడే ప్రాంతం ఉదయగిరి. ఏటా కాసులు కురిపించే ఈ తోటలు ప్రస్తుతం రైతులకు నష్టాలను మిగుల్చుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో చిత్తకాపు కాయ నాణ్యతను బట్టి టన్ను రూ.40వేల నుంచి 50 వేల వరకు పలికింది. ప్రస్తుత సీజన్ కాపు రూ.15 వేలు కూడా పలకడం గగనంగా మారింది. మంగు, రసం తగ్గిన కాయల కొనుగోలుకు వ్యాపారులు మక్కువ చూపడంలేదు. దీనికి తోడు దిగుబడి సైతం బాగా తగ్గిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు 5 నుంచి 6 టన్నుల కంటే దిగుబడి రావడంలేదు. గతంలో ఇతర రాష్ట్రాల వ్యాపారులు వచ్చి కాయలు చెట్లకు ఉన్నప్పుడే కొనుగోలు చేసేవారు. నేడు ఆ పరిస్థితి తల్లకిందులైంది. ఈ ధరలతో పెట్టిన పెట్టుబడులు కూడా రావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆగిన ఎగుమతులు**

కొన్నిరోజులుగా ఉత్తరాదిరాష్ట్రాలతోపాటు పలు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణం కూడా చల్లడింది. దీంతో ధరలు ఒక్కసారిగా దిగజా రాయి. ప్రతి ఏటా జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో బత్తాయి సీజన్ కాపు మొదలవుతోంది. ఇక్కడ కాయలు నాణ్యతగా ఉండటంతో దిగుబడంతా ఇతర ప్రాంతాల వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో తెలంగాణ, తమిళనాడు, బెంగళూరుతోపాట ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. అయితే ఆయా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో వ్యాపారులు ఇటువైపు కన్నెత్తి చూడడంలేదు. దీంతో ధరలు దిగజారి రైతులకు నష్టాలు తప్పడంలేదు.

**పెట్టుబడులు భారమై...**

బత్తాయి సాగుకు పెట్టుబడులు అధికం. గతంలో ఉదయగిరి నియోజక వర్గంలో అన్నీ మండలాల్లో విస్తారంగా బత్తాయి సాగు ఉండేది. ప్రస్తుతం రెండు, మూడు మండలాలకే పరిమితమైంది. దీనికితోడు వేరుకుళ్లు, బంక, వైరస్ తెగుళ్లు అధికం కావడంతో వాటి నివారణకు రైతులు మందులు పిచికారి చేసేందుకు, దున్నకానికి, చెట్ల పాదులు చేసేందుకు కూలీలకు భారీగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అయితే మార్కెట్ లో గిట్టుబాటు ధర పలకకపోవడంతో రైతులకు పెట్టుబడులు కూడా కష్టమయ్యాయి.

**తగ్గిన దిగుబడులు**

ఈ ఏడాది ధర లేకపోగా సీజన్ కాపు దిగుబడులు కూడా అంతంత మాత్రంగా ఉండడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ధర, దిగుబడి లేకపోవడంతో కూలీల ఖర్చులు, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి తోటలకు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టామని ధర లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.



లారీకి లోడ్ చేస్తున్న బత్తాయి కాయలు



సంగంలోని తంతి తపాలా కార్యాలయం

## రిజిస్టర్ పోస్టు బుకింగ్ సులభతరం

**ఇంటి నుంచే పంపే అవకాశం**
**తపాలా శాఖ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో సేవలు**
**రూ. 500 విలువ లోపైతే ఉచితం**

సంగం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మారు తున్న కాలానికి అనుగుణంగా తపాలాశాఖ సేవలను విస్తరిస్తోంది. సొంతంగా రూపొందించుకున్న అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ ద్వారా గత రెండు రోజుల నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే బ్యాంకింగ్ సేవలకు ఏమాత్రం తీసిపోని రీతిలో పబ్లిక్ మొబైల్ బుకింగ్ సేవలను అమలు చేస్తోంది. ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా ఇంటి వద్ద నుంచే రిజిస్టర్ పోస్టు బుకింగ్ సేవలకు శ్రీకారం చుట్టిం ది. ఇందులో భాగంగా ఎవరైనా వినియోగదారుడు మొబైల్ యాప్‌లో పోస్టల్ సిబ్బందికి రిక్వె స్ట్ మెసేజ్ పంపాలి. తర్వాత తపాలాశాఖ నుం చి బార్‌కోడ్ నెంబరు, ఓటీపీ వస్తుంది. ఇంటి కొచ్చే పోస్టల్ ఉద్యోగి దగ్గర వీటిని సరిచూసుకొని రిజిస్టర్ పోస్టులేవైనా బుక్ చేసుకోవచ్చు. రూ. 500 లోపు విలువ చేసే వాటికి ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. రూ. 500 దాటితే నిర్ణీత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా వినియోగదారులు పోస్టాఫీసుకు వెళ్లి అక్కడ క్యూలో గంటల తరపడి వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. ఎటువంటి అదనపు రుసు ము వసూలు చేయకుండానే డోర్ స్టెప్ సేవలను తపాలాశాఖ అందిస్తోంది.

**వినియోగదారుల్లో హర్షం**

తపాలా శాఖ మొబైల్ యాప్ ద్వారా ఇంటి నుంచే రిజిస్టర్ బుకింగ్ సేవలు అందుబాటులోకి తేవడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పోస్టల్ శాఖ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) మొబైల్ బ్యాకింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు ఏవైనా ఇంటి నుంచే పంపేందుకు రిజిస్టర్ పోస్టు బుకింగ్ సేవలు అందుబాటులోకి తేవడంతో మరింత ఉపయోగకరంగా ఉంటుందని వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందించాలి

- అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనుకబడిన ముస్లిం మైనార్టీలకు 15 శాతం తగ్గకుండా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో శాఖల వారీగా ముస్లిం మైనార్టీలకు అందించిన సంక్షేమం, అభివృద్ధి పథకాలపై సమీక్ష జరిపారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను మైనార్టీలకు చేరువ చేయాలని సూచించారు. నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడు లోని ముస్లిం మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణం పూర్తి చేయడం, మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముస్లిం మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హైపా, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఈవో బాలాజీరావు, డ్వామా పీడీ గంగాభవానీ, సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

**హైవే, రైల్వే భూసేకరణ త్వరితగతిన చేపట్టాలి...**

జిల్లాలో హైవే, రైల్వే అవసరాలకు భూసేకరణను త్వరితగతిన చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ బ్రాడ్ గేజ్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూమిని ఇచ్చిన వారికి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సూచించారు. బద్వేలు నుంచి నెల్లూరు వరకు ఫేస్ వన్, ఫేస్ టు కింద నేషనల్ హైవే ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ అంశంపై చర్చించారు. అవసరమైన చోట అటవీశాఖ అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కే కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్‌సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

### ఫోర్జరీ సంతకాల కేసులో

## మాజీ మంత్రి కాకాణికి రిమాండ్

నెల్లూరు (లీగల్), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ భూముల స్వాహా కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి వచ్చే నెల 7వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపుతూ నెల్లూరు నగర మొదటి తరగతి రెండవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శారదారెడ్డి గురువారం ఉత్తర్వు చేశారు. మోసం, దగా, కుట్రలతో వెంకటాచలం తహసీల్దారు కార్యాలయంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి రికార్డులను తారు మారు చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారన్న కేసులో కాకాణి 14వ నిందితుడిగా ఉన్నారు. తొలుత జిల్లా జైలులో ఉన్న కాకాణిని వర్చువల్ విధానంలో పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరు పరిచారు. ఇరువైపులా వాదనలు విన్నాక న్యాయమూర్తి కాకాణిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపుతూ ఉత్తర్వు చేశారు.

### విషం తాగి వ్యక్తి మృతి

వెంకటాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఇస్కపాళెంలో అనారోగ్యంతో బాధపడుతూ శ్రీనివాసులు అనే వ్యక్తి విషం తాగాడు. నెల్లూరులో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు మృతుడి కుమారుడు మహేష్ తెలిపాడు. తండ్రి శ్రీనివాసులు గత పదేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతుండేవాడన్నారు. ఆ బాధ తోనే విషం తాగాడని, దీంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### వయోజనవిద్య

## నోడల్ ఆధికారిగా మస్తాన్‌రెడ్డి

నెల్లూరు(విద్య), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వయోజన విద్య విభాగం నోడల్ అధికారిగా మల్లు మస్తాన్ రెడ్డి నియమితులయ్యారు. వయోజన విద్యలో అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను నోడల్ అధికారిగా నియమిస్తూ ఆ విభాగం జాయింట్ డైరెక్టర్ బీ ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మస్తాన్ రెడ్డి గురువారం కలెక్టర్ ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తానని తెలిపారు.

### మా ప్రాణాలు తీసి

## మైనింగ్ తవ్వుకోండి

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థులు వేడుకోలు

వరికుంట పాడు (ఉదయగిరి రూరల్), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : 'మా గ్రామంలో మైనింగ్ వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరించాల్సి వస్తే ముందుగా మా ప్రాణాలు తీసి పనులు ప్రారంభించేలా నిర్ణయం తీసుకోండి.' అంటూ జంగంరెడ్డిపల్లి గ్రామస్థులు అధికారుల ఎదుట తమ గోడు వినిపించారు. గురువారం గ్రామంలోని అటవీ ప్రాంతంలో కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. వరికుంటపాడు, భాస్కరాపురం గ్రామాల పరిధిలోని సర్వే నెం.233-1లోని 16.72 హెక్టార్లలో 1,65,798 టన్నుల మైనింగ్ తరలించేందుకు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు లీజు మంజూరు చేసింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సర్పంచ్ దిలీప్‌కుమార్‌తో సహా గ్రామస్థులు మూకుమ్మడిగా తమ నిరసన గళం వినిపించారు. గతంలోనూ తాము వ్యతిరేకించామని, అదే రీతిలో ఇప్పుడూ ప్రయత్నాలు సాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 50 కుటుంబాలకు చెందిన ఎస్సీలమైన తాము ఆ కొండనే కన్నతల్లిగా భావిస్తూ గేదెలు, మూగజీవాలను నమ్ముకుని జీవిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలు సాకుగా తవ్వకాలు సాగించాలనే ఉద్దేశం ఉంటే ముందస్తుగా తమ కుటుంబాలకు విషమిస్తే తాగి మరణిస్తామని బోరున విలపించారు. నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ శ్రీపూజ మాట్లాడుతూ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించడంతో పాటు సంబంధిత శాఖల అధికారులు, ప్రాజెక్టు ప్రతినిధుల నుంచి సేకరించిన నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చట్టపరంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ శాఖ ఈఈ అశోక్‌కుమార్, తహసీల్దారు హేమంత్ కుమార్, వీఆర్వో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**పోలీసుల పహారా నడుమ**

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉదయగిరి సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్, పోలీసు బలగాలు భారీస్థాయిలో మోహరించాయి. వివాదాలకు తావులేకుండా ఎప్పటికప్పుడు ప్రజలను నియంత్రిస్తూ సమావేశం సజావుగా సాగేలా చర్య లు చేపట్టారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కేసులు బనాయించడంతో అధికశాతం మంది తమ నిరసనను వ్యక్తం చేసేందుకు రాలేని పరిస్థితుల్లో నివాసాలకే పరిమితమయ్యారని సర్పంచ్ వాపోయారు.



పోలీసులపై అసహనం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

## రాజకీయాల్లో కీలకంగా మహిళలు

- జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- మహిళా జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు శిక్షణ

నెల్లూరు (జడ్పీ), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడూ ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండే మహిళలు నేడు రాజకీయాల్లో అనేక పదవుల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నెల్లూరు లోని జడ్పీ సమావేశ మందిరంలో గురువారం మహిళా జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఇప్పుడు పాలనతోపాటు, ప్రణాళికలు, నిధుల కేటాయింపులో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థ చట్టబద్ధత పొందిందని, తద్వారా గ్రామాల్లో స్వయం పాలనకు అవకాశం కల్పించిందన్నారు. ఇందులో ఒక ముఖ్యమైన విషయం మహిళలకు కనీసం 33 శాతం రిజర్వేషన్ కల్పించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహనరావు కూడా పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ

## క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం

- విద్యుత్ ఎస్ఈ విజయన్
- బ్రిడ్జ్ టోర్నమెంట్‌లో ఏపీఎస్‌పీడీసీఎల్ ఉద్యోగుల విజయం

నెల్లూరు (జడ్పీ), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని విద్యుత్ శాఖ ఎస్ఈ వీ విజయన్ అన్నారు. నెల్లూరు క్లబ్‌లో నిర్వహించిన 47వ ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు బ్రిడ్జ్ టోర్నమెంట్‌లో ఏపీఎస్‌పీడీసీఎల్ ఉద్యోగులు విజయం సాధించారు. విజేతల బృందంలో ఎస్ఈ విజయన్, ఈఈ శంకర్, డీఈఈలు ప్రభాకర్, అమీర్ బాషా ఉండడంతో గురువారం ఫోన్ ద్వారా దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ కే సంతోషరావు, డైరెక్టర్లు కే గురవయ్య, అయూబ్ ఖాన్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఉద్యోగులు తమ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి క్రీడలను జీవనశైలిలో భాగం చేసుకోవా లన్నారు. టోర్నమెంట్‌లో ఏపీ ఆటగాళ్లు మొదటి స్థానం సాధించగా జట్టులోని ఆటగాళ్లు అందరూ ఏపీఎస్‌పీడీసీఎల్‌కు చెందిన వారేనని చెప్పారు. తమ గెలుపు విద్యుత్ సంస్థకు అంకితమన్నారు. కాగా, డిస్కమ్, జిల్లాలోని అధికారులు, సిబ్బంది, ట్రేడ్ యూనియన్ నేతలు, అసోసియేషన్ నేతలు విజేతలకు అభినందనలు తెలియజేశారు.



చైర్మన్‌తో ఫోన్ ఇన్‌లో పాల్గొన్న టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు, ఉద్యోగులు

### కొత్తగా ఉద్యోగంలో చేరితే

## రూ.15వేలు సాయం

- ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా 'పీఎం వికసిత్ భారత్'
- ఈపీఎఫ్ అధికారులు



విజయ డెయిరీలో జరిగిన ఈపీఎఫ్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు (వెంక టేశ్వరపురం), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి నూతనంగా ఉద్యోగంలో చేరిన ప్రతీ కార్మికుడికి కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.15వేల చొప్పున రెండేళ్ల ఆర్థిక తోడ్పాటును అందిస్తుందని జిల్లా ఈపీఎఫ్ అధికారులు కృష్ణారావు, సుబ్రహ్మణ్యం తెలిపారు. దేశ వ్యాప్తంగా 3.5కోట్ల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గారి పథకాన్ని ప్రవేశ పెట్టిందని చెప్పారు. నెల్లూరు వెంకటేశ్వరపురంలోని విజయ డెయిరీలో గురువారం నూతన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగం కల్పించిన పరిశ్రమ యాజమాన్యానికి కూడా ప్రతీ నెల కార్మికుడి జీతంలో 10శాతాన్ని కేంద్రం అందజేస్తుందని చెప్పారు. పరిశ్రమల యాజమానులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్మికుల పీఎఫ్‌కు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా నెల్లూరు మినీ బైపాస్‌లోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ అధికారులు శ్రీనివాసులు, చంద్ర, రాజశేఖర్ రెడ్డి, శివయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఘర్షణపై డీడీ విచారణ



కలువాయి ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులను విచారిస్తున్న సాంఘిక సంక్షేమశాఖ డీడీ శోభారాణి

కలువాయి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగిందన్న సమాచారం అందడంతో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి గురువారం విచారణ చేపట్టారు. ఈవిషయమై విద్యార్థులను ఆమె విచారించారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ రాత్రి హాస్టల్‌లో కరెంట్ లేనప్పుడు విద్యార్థులు కొట్టుకున్నట్లు, ఆ సమయంలో సిబ్బంది ఎవ్వరూ అక్కడ లేనట్లు తమ దృష్టికి వచ్చిందని, దీంతో ఈ విషయమై విచారణ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అయితే విద్యార్థులు ఇక్కడ ఎలాంటి గొడవ జరగలేదని, ఆ సమయంలో వాచ్‌మెన్ కూడా హాస్టల్‌లో ఉన్నట్లు తెలిపినట్లు ఆమె చెప్పారు. ఈవిషయమై హైస్కూల్ హెచ్‌ఎంను కూడా కలసి మాట్లాడతామని తెలిపారు. ఆమె వెంట పొదలకూరు ఏఎస్‌డబ్ల్యు సుధామణి ఉన్నారు.